ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక


VISION ANDHRA TELUGU DAILY




మంగళవారం 09 జూన్ 2026 | Tuesday 09 June 2026 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 69 | Vol.No 28 Issue No .69 | www.visionandhra.in

## పెళ్లికి ముందే శారీరక సంబంధాలు

- ఇది మోసపూరితమని చెప్పలేం
- పరస్పర అంగీకారంతోనే జరిగినట్లు గుర్తించాల్సిందే
- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,జూన్8 : పెళ్లికి ముందు శారీరక సంబంధాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. పెళ్లికి ముందు పరస్పర అంగీకారంతో ఏర్పడిన శారీరక సంబంధాల ఆధారంగా ఒక వ్యక్తి వ్యక్తిత్వం లేదా నడవడికను ప్రశ్నించలేమని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ప్రేమ మిగతా 2లో..

## రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ..

# గుజరాత్‌కు గులాంగిరి



- మెట్రో, మూసీ ప్రక్షాళనకు ఎందుకు అండ్డుకుంటున్నారు
- సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన
- రూ.1,674 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం
- కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిలపై మండిపడ్డ సిఎం రేవంత్

*రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ..గుజరాత్‌కు ఇంకెన్నాళలు గులాంగిరి చేస్తారని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రోకి కేంద్రం నుంచి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ నిధులు ఎందుకు తీసుకురారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. హైదరాబాద్‌కి సింగూరు జలాలను ఎందుకు తీసుకురానివ్వరని ప్రశ్నల వర్షం కురిపించారు. గోదావరి జలాలు తీసుకొస్తే వారికేం ఇబ్బందని నిలదీశారు. గుజరాత్‌కు ఎన్నాళ్లు గులాంలుగా ఉంటారని ధ్వజమెత్తారు. సోమవారం హైదరాబాద్ మియాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. రూ.1,674 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.*

హైదరాబాద్,జూన్8 : ప్రభుత్వానికి అండగా ఉంటామని మహిళలు చెబుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాలుష్యాన్ని నియంత్రించకపోవడం వల్లే ఢిల్లీని పడావ్ పెట్టారని విమర్శించారు. ముంబైలో ట్రాఫిక్ జామ్, వర్షం వస్తే రోడ్లపైకే నీళ్లు వస్తాయని తెలిపారు. స్లమ్స్‌లో సదుపాయాలు లేక ముంబైలో నివసించే పరిస్థితి లేదని చెప్పారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్యతో హైదరాబాద్‌కు కంపెనీలు వచ్చాయని ప్రస్తావించారు. ఎయిర్‌పోర్టుకు ఎన్నిగంటల్లో చేరుకుంటామో కూడా చెప్పలేమని అన్నారు. గతేడాది వారంపాటు నీళ్లలోనే చెన్నై ఉందని వివరించారు. కోల్‌కతా శాంతిభద్రతల గురించి చెప్పాల్సిన అవసరమే లేదని తెలిపారు. ఐదు నగరాల నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలని అన్నారు. ఒక్కటే నగరంగా ఉంటే అనేక సమస్యలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. పరిపాలనలో సమస్యలు తలెత్తకుండా 3 కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని వివరించారు. అమెరికా సిలికాన్ వ్యాలీతో మన సైబరాబాద్ పోటీపడుతోందని ఉద్ఘాటించారు. గ్రేటర్ చుట్టూ నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తెలంగాణలో 8 మంది ఎంపీలను ప్రజలు గెలిపించారని తెలిపారు. మిగతా 2లో..

## హోర్ముజ్ జలసంధి మూసివేత

- సంక్షోభం కొనసాగితే ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం
- దేశంలో 30 నుంచి 60 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు
- కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ



న్యూఢిల్లీ,జూన్8 : హోర్ముజ్ జలసంధి మూసి ఉంచినప్పటికీ దేశంలో ఇంధన నిల్వలకు ఢోకా లేదని కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ తెలిపారు. 30 నుంచి 60 రోజుల వరకూ సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని కేంద్రమంత్రి మిగతా 2లో..

## నీట్ రీ ఎగ్జామ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- పేపర్ తయారీ నుంచి, ప్రింటింగ్ వరకు సీక్రసీ
- పేపర్ తయారీదారులంతా రహస్య ప్రదేశానికి తరలింపు




న్యూఢిల్లీ,జూన్8 : మే 3న జరిగిన నీట్ పరీక్షల్లో పేపర్ లీకేజీ వివాదం దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జూన్ మిగతా 2లో..

## సంక్షేమ రాజ్య నిర్మాణం..

# ప్రజాప్రభుత్వ లక్ష్యం



- తెలంగాణలో 'నాలెడ్జ్' విప్లవం
- రూ.110 కోట్లతో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్
- రూ..25 కోట్లతో ఎస్సీ హాస్టల్ పునరుద్ధరణ
- ఉద్యోగాల నోటిఫికేషన్లతో పాటు ఉచిత డిజిటల్ కోచింగ్
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్, జూన్8 : ప్రజా ప్రభుత్వం తెలంగాణలో సంక్షేమ రాజ్యం నిర్మించేదిశగా కృత నిశ్చయంతో పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరోసారి స్పష్టం చేశారు. లోయర్ ట్యాంక్ బండ వద్ద రూ.110 కోట్ల అంచనాలతో నిర్మించనున్న బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్, నింబోలి అడ్డా వద్ద రూ. 25 కోట్ల అంచనాలతో నిర్మించనున్న ఎస్సీ హాస్టల్ కు సబంధించి స్థల పరిశీలన అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఈ రెండు భవనాలకు సంబంధించి ఆర్థిక, మిగతా 2లో..

## మోడీ పాలనతో చిక్కుల్లో దేశం

- సర్ ప్రక్రియతో లక్షలాది మంది ఓట్లు గల్లంతు
- రాజకీయ వేధింపులకు దర్యాప్తు సంస్థల దుర్వినియోగం
- ఇండియాకూటమి భేటీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే




న్యూఢిల్లీ,జూన్8 : ప్రధాని నరేంద్ర మోదీ పాలనతో భారతదేశం సమస్యల్లో పడిందని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. మోదీ హయాంలో రాజ్యాంగంపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని.. బీజేపీయేతర రాష్ట్రాలపై కేంద్రం మిగతా 2లో..

## బొగ్గు దిగుమతలును తగ్గించేయత్నం


- బొగ్గు ఉత్పత్తిలో స్వయం సమృద్ధి దిశగా భారత్
- మైనింగ్, కోల్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు
- ప్రస్తుతం 189 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు
- గత 12 ఏళ్లుగా ప్రధాని మోడీ నిరంతర కృషితో పురోగతి
- కోల్ రంగంలో సంస్కరణలతో ఐదులక్షల మందికి ఉపాధి
- క్రిటికల్ మినరల్స్ కోసం అర్జెంటీనాతో ఒప్పందం
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి



హైదరాబాద్,జూన్8 : క్రమంగా విదేశాల నుంచి బొగ్గు దిగుమతులను తగ్గించే పనిలో ఉన్నామని కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నూతన భారత నిర్మాణంలో బొగ్గు రంగం కీలక పాత్ర పోషిస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. ప్రతి వారం బొగ్గు ఉత్పత్తి, సరఫరాపై ప్రధాని మోదీ పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. గతంలో రూ. 1.89లక్షల కోట్ల బొగ్గు కుంభకోణం జరిగిందని కాగ్ నివేదిక ఇచ్చింది. కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన కోల్ మైన్స్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఎన్డీయే మిగతా 2లో..

## ఎబోలా వ్యాప్తిపై ఆరోగ్య శాఖ అప్రమత్తం

- విదేశీ ప్రయాణికులు రాకపై ప్రత్యేక నిఘా
- ఎబోలా లక్షణాలు ఉంటే గుర్తించి గాంధీకి తరలింపు
- వ్యాధి లక్షణాలు ఉంటే సమాచారం ఇవ్వాల్సిందే
- అధికారులతో సమీక్షించిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర



హైదరాబాద్, జూన్8 : కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో.. రాష్ట్రంలో చేపట్టిన ముందస్తు జాగ్రత్తలు, పర్యవేక్షణ చర్యలు, వివిధ శాఖల మధ్య సమన్వయం, ఎమర్జన్సీ రెస్పాన్స్ సిస్టమ్, తదితర అంశాలపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మిగతా 2లో..

## మహిళా శక్తి మహాసభకు

# సర్వం సిద్ధం


- మహిళల ఆర్థిక సాధికారతకు చారిత్రక మైలురాయి
- మహిళా శక్తి మహాసభను విజయవంతం చేయండి
- రాష్ట్ర మహిళలకు మంత్రులు సీతక్క,పొన్నం ప్రభాకర్ పిలుపు



హైదరాబాద్,జూన్8 : తెలంగాణ మహిళా సాధికారత చరిత్రలో మరో సువర్ణ అధ్యాయానికి హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదిక కానుంది. రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ నిర్వహిస్తున్న 'మహిళా శక్తి మహాసభ'కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం సాయంత్రం 4 గంటలకు జరగనున్న ఈ భారీ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 25 వేల మంది మహిళలు హాజరుకానున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, మిగతా 2లో..

## ప్రజల భవిష్యత్ బాగు చేసే బాధ్యత ప్రభుత్వానిదే

- భూ సమస్యల పరిష్కారం కోసం బ్లాక్‌చైన్ టెక్నాలజీ
- క్యూఆర్ కోడ్‌తో రాజముద్ర కలిగిన పాస్ పుస్తకాలు జారీ
- ట్యాంపర్ చేయకుండా పకడ్బందీగా భూ రికార్డులు
- గత ప్రభుత్వ హయాంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టారు
- గొడ్డలి పట్టే వారికి నాగలి పట్టే వారి బాధలు ఎలా తెలుస్తాయి
- ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరిస్తున్నాం
- సిద్ధాంతంలో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ
- సాగు,తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్న చంద్రబాబు




భీమవరం,జూన్8 : ప్రజల భవిష్యత్ బాగు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం బ్లాక్‌చైన్ టెక్నాలజీని తీసుకొచ్చామని సీఎం తెలిపారు. క్యూఆర్ కోడ్‌తో రాజముద్ర కలిగిన పాస్ పుస్తకాలు జారీ చేశామన్నారు. ఇప్పుడు రైతుల భూ రికార్డులను ఎవరూ ట్యాంపర్ చేయలేరని అన్నారు. సోమవారం సిద్ధాంతంలో రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలను సీఎం పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. భవిష్యత్తులో తాగు నీరు, సాగునీరుకి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకునే బాధ్యతను మంత్రి రామానాయుడికి అప్పగించామన్నారు. ఎప్పుడు చూసినా గోదావరి జిల్లా ఆహ్లాదకరంగా మిగతా 2లో..

## విశాఖ స్టీల్‌లో

# భారీ ప్రమాదం

- ద్రవరూప స్టీల్ లిక్విడ్ పడి మంటలు
- 9మంది కార్మికుల దుర్మరణం
- ఏడుగురికి తీవ్ర గాయాలు..ఆస్పత్రికి తరలింపు
- మంటలు చెలరేగడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- ఘటన జరిగిన వెంటనే కార్మికులు, ఉద్యోగుల పరుగు
- ఘటనపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి..అధికారులతో ఆరా
- హుటాహుటిన విశాఖ బయల్దేరిన హోంమంత్రి అనిత



విశాఖపట్నం,జూన్8 : విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్-2, ఎస్‌టీసీ-3 హీట్ ఎఫ్‌జీలో స్టీల్ మెటల్ లిక్విడ్ లాడిల్ పేలడంతో ఉక్కుద్రవం లీకై మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది కార్మికులు మృతి చెందగా.. పలువురు మిగతా 2లో..

## పెళ్లికి ముందే శారీరక సంబంధాలు

సంబంధాలు అన్నీ వివాహానికి దారితీయవని తెలిపింది. ఇద్దరి మధ్య పరస్పర అంగీకారంతో ఏర్పడిన ప్రేమ బంధం తర్వాత వివాహంగా మారకపోయినా, దానిని మోసం లేదా నేరంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. అలాగే, ప్రేమలో ఉన్న సమయంలో వివాహం చేసుకుంటామని భావించి శారీరక సంబంధం ఏర్పడినప్పటికీ, తర్వాత వివిధ కారణాల వల్ల పెళ్లి జరగకపోతే ప్రతి సందర్భంలోనూ అది మోసం చేసినట్లుగా భావించరాదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇద్దరి మధ్య సంబంధం ఏర్పడిన సమయంలో వివాహం చేసుకునే నిజమైన ఉద్దేశం ఉందా?, లేదా? అనే అంశాన్ని ఆయా కేసుల వారీగా పరిశీలించాల్సి ఉంటుందని న్యాయస్థానం సూచించింది. ఇద్దరి పరస్పర సమ్మతితో ఏర్పడిన సంబంధాలు, మోసపూరితంగా వివాహ వాగ్దానం చేసి ఏర్పడిన సంబంధాల మధ్య స్పష్టమైన తేడాను గుర్తించాల్సిన అవసరం ఉందని న్యాయస్థానం తెలిపింది. కేవలం సంబంధం వివాహానికి దారితీయలేదనే కారణంతో ఒకరిపై మరొకరు మోసపూరిత ఆరోపణలు చేయడం సరైన విధానం కాదని కోర్టు అభిప్రాయపడింది. ఈ తీర్పు వ్యక్తిగత స్వేచ్ఛ, పరస్పర అంగీకారం, ఆధునిక సామాజిక సంబంధాలపై న్యాయవ్యవస్థ దృక్పథాన్ని ప్రతిబింబిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## హోర్ముజ్ జలసంధి మూసివేత

తెలిపారు. అయితే పశ్చిమాసియాలో యుద్ధ సంక్షోభం సుదీర్ఘకాలం కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. సోమవారంనాడిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ... 'మరో 30 రోజులు హోర్ముజ్ జలసంధి మూతపడే ఉంటే ఏం జరుగుతుంది? దేశీయంగా మనకు తగినన్ని నిల్వలు ఉన్నాయి. 60-60-60 అని చెప్పగలను. అంటే 60 రోజులకు సరిపడా క్రూడాయిల్, నేచురల్ గ్యాస్, ఎల్పీజీ నిల్వలు ఉన్నాయి' అని హర్దీప్ సింగ్ పురీ చెప్పారు. స్వల్పకాలిక అంతరాయాలను భాగస్వామ్య దేశాల సపోర్ట్‌తో అధిగమించేందుకు అవసరమైన వ్యూహాత్మక ప్రణాళికలు తమ వద్ద ఉన్నాయని అన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితి రెండు మూడు రకాలుగా ఉండొచ్చని, ఘర్షణలు విస్తరిస్తే అది అసాధారణ పరిస్థితి అవుతుందని, అది బాధాకరమని అన్నారు. ఒకవేళ హోర్ముజ్ జలసంధిని మూసి ఉంచిన పక్షంలో ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఇప్పటికే చర్యలు ప్రారంభించామని చెప్పారు. యూఏఈ వంటి మంచి మిత్రులు మనకున్నారని, ఎల్పీజీ కార్గోలను నేరుగా మనకు పంపగలమని యూఏఈ నుంచి ప్రతిపాదన ఉందని, పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోగలమని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి దేశీయంగా స్ట్రాటజిక్ పెట్రోలియం సహా 30 నుంచి 60 రోజులకు సరిపడా అన్నిరకాల నిల్వలు ఉన్నాయని చెప్పారు. ఇవి 76 నుంచి 80 రోజులకు కూడా సరిపోవచ్చన్నారు.

## మోడీ పాలనతో చిక్కుల్లో దేశం

వివక్ష చూపుతోందని మండిపడ్డారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ వేధింపులకు వాడుకుంటున్నారని ఆరోపించారు. సోమవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఇండియా బ్లాక్ కూటమి పార్టీల నేతలు సమావేశమయ్యారు. మోదీ ప్రభుత్వంలో దేశం ఎదుర్కొంటున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధాన సవాళ్లపై చర్చించారు. ఈ సందర్భంగా కూటమి పార్టీలను ఉద్దేశించి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రసంగించారు. దేశ ఆర్థిక పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని ఆయన అన్నారు. ఉద్యోగాల కల్పనకు అవసరమైన పెట్టుబడులు దేశానికి రావడం లేదని పేర్కొన్నారు. పలు రంగాల్లో ప్రైవేట్ గుత్తాధిపత్యాలు పెరుగుతున్నాయని తెలిపారు. మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తో లక్షలాది మంది ప్రజలు ఓటు హక్కును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎస్ఎంఈ రంగం తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. మోదీ ప్రభుత్వంలో పరీక్షల నిర్వహణ వైఫల్యాలతో యువత నష్టపోతున్నారని ఖర్గే చెప్పుకొచ్చారు. మూడేళ్ల క్రితం ఇండియా కూటమి ఏర్పడిందని, పార్లమెంటులో ఇటీవల దాని బలం ఏంటో అధికార పక్షం రుచి చూసిందన్నారు. లోక్‌సభలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లును ఓడించేందుకు ఈ ఏడాది ఏప్రిల్ 17న కూటమి పార్టీలు దృఢంగా ఏకమయ్యాయని ఖర్గే ప్రశంసించారు. ఇప్పుడు ఆ స్ఫూర్తిని మరింత బలోపేతం చేసుకుని ముందుకు సాగాలన్నారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిపక్షం ఐక్యంగా ఉండాలన్నారు. కీలక సమావేశానికి 23 ప్రతిపక్ష పార్టీల నేతలు హాజరయ్యారు. వారిలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్, తేజస్వీ యాదవ్, మమతా బెనర్జీ, దీపాంకర్ భట్టాచార్య, మెహబూబా ముఫ్తీ, సుప్రియా సూలే, బ్రివన్ థోల్ తదితరులు ఉన్నారు. అయితే, కీలక భాగస్వాములైన డీఎంకే, ఆప్ పార్టీలు మాత్రం సమావేశానికి దూరంగా ఉన్నాయి.

## విశాఖ స్టీల్‌లో భారీ ప్రమాదం

గాయపడ్డారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. 1,500 డిగ్రీల వేడితో స్టీల్ మెటల్ లిక్విడ్ ల్యాడిల్ ద్వారా ఉక్కుద్రవాన్ని లిఫ్ట్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదం సంభవించడంతో భయాందోళనకు గురైన కార్మికులు, ఉద్యోగులు బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలు ఆర్పేందుకు యత్నిస్తున్నారు. మెటల్ ల్యాడల్ నుంచి బకెట్లు కుప్పకూలాయి. ల్యాడల్‌లో ఉన్న ద్రవ లోహం అకస్మాత్తుగా కిందపడటంతో అక్కడ పనిచేస్తున్న కార్మికులు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో ప్రమాదస్థలిలో 9 మంది కార్మికులు మృతిచెందగా, మరో ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే ప్లాంట్ యాజమాన్యం అత్యవసర భద్రతా చర్యలు చేపట్టింది. గాయపడిన కార్మికులను వెంటనే సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో ప్లాంట్‌లో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ ప్రారంభించారు. ల్యాడల్‌లోని ద్రవ లోహం ఎందుకు కిందపడింది?, సాంకేతిక లోపమా? లేక భద్రతా ప్రమాణాల్లో ఏవైనా నిర్లక్ష్యం జరిగిందా? అనే కోణాల్లో అధికారులు దర్యాప్తు చేపట్టారు. సంఘటన స్థలాన్ని ఉన్నతాధికారులు పరిశీలించి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. అధికారిక నివేదిక వచ్చిన తర్వాతే గాయపడిన వారి సంఖ్య, మరణాల వివరాలు, ప్రమాదానికి గల అసలు కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద వివరాలపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. కార్మికుల మృతిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అలాగే అన్నిశాఖలు సమన్వయంతో పనిచేసి సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా విచారించాలని చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత ఈ ప్రమాదంపై వెంటనే స్పందించారు. విశాఖ జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ప్రమాద స్థలంలో సహాయక చర్యలను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. విజయనగరం పర్యటనలో ఉన్నప్పటికీ, ప్రమాద సమాచారం అందిన వెంటనే హుటాహుటిన ఘటనా స్థలానికి హోంమంత్రి బయలుదేరారు.

## మహిళా శక్తి మహాసభకు సర్వం సిద్ధం

ఉపాధి విస్తరణ, వ్యాపారాభివృద్ధి, నిర్ణయాత్మక భాగస్వామ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా అమలు చేస్తున్న కార్యక్రమాలకు ఈ మహాసభ ప్రతీకగా నిలవనుంది. ఈ నేపథ్యంలో సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆధ్వర్యంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి ఏర్పాట్లను పరిశీలించారు. మహాసభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మహిళా సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను, మహిళల ఆర్థికాభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను ఆయన సభలో వివరించనున్నారు. అదే వేదికపై మహిళా సంఘాలకు ప్రస్తుతం అందుతున్న రూ.5 లక్షల రుణ పరిమితిని రూ.10 లక్షలకు పెంచే కీలక నిర్ణయాన్ని ప్రకటించనున్నారు. భ సందర్భంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద రూ.500 కోట్ల చెక్కులు, మహిళా సంఘాలు నిర్వహిస్తున్న ఆర్టీసీ అ÷-దదె బస్సుల హైర్ చార్జీల కింద రూ.20.30 కోట్ల చెక్కులు పంపిణీ చేయనున్నారు. అదేవిధంగా కొత్త బస్సుల కొనుగోలు కోసం టీజీఎస్ఆర్టీసీకి రూ.199 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు. మహిళా సంఘాల భాగస్వామ్యంతో కొనుగోలు చేసి ఆర్టీసీకి అ÷-దదెకిచ్చిన 553 బస్సులను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించనున్నారు. మహిళల ఆర్థిక భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ వినూత్న నమూనా దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలకు ఇప్పటివరకు కలిగిన రూ.10,700 కోట్లకు పైగా ఆర్థిక ప్రయోజనాలను సభలో వివరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మహిళల జీవితాల్లో తీసుకొచ్చిన సానుకూల మార్పులను ప్రజలకు తెలియజేయనున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి మహిళలు తమ సంఘాలకు చెందిన సొంత బస్సుల్లో హైదరాబాద్‌కు చేరుకునేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నారు. తెలంగాణ నలుమూలల నుంచి మహిళా శక్తి ఒకే వేదికపై సమీకృతం కానున్న ఈ మహాసభ, మహిళల ఆర్థిక ప్రగతి ప్రయాణంలో మరో చారిత్రక మైలురాయిగా నిలవనుంది. ÷రిళిమవారం సాయంత్రం పరేడ్ గ్రౌండ్‌లో సభ

## రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ.. గుజరాత్‌కు గులాంగిరి

మెట్రో, మూసీ ప్రక్షాళనకు అనుమతులు ఎందుకు తేవట్లేదని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి ఎంత లడాయి మనిషి అనేది అందరికీ తెలుసునని విమర్శించారు. కిషన్‌రెడ్డి డ్రామాలు ఆపాలని ఎద్దేవా చేశారు. తెలంగాణతో మహారాష్ట్ర సీఎం చర్చలకు రాకుండా.. అడ్డుకుంటున్నది బీజేపీనేనని ఆగ్రహించారు. సబర్మతి అద్భుతమన్న బీజేపీ నేతలు.. మూసీ ప్రక్షాళన చేయరా అని ప్రశ్నించారు. పదేళ్ల తర్వాత ఒకాయన ఫామ్‌హౌస్‌కు వెళ్లారని విమర్శించారు. పదేళ్లపాటు కేసీఆర్, 12 ఏళ్లలో మోదీ ఏం చేశారో అసెంబ్లీలో చర్చిద్దామని.. బీఆర్ఎస్, బీజేపీ నేతలు చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎకరం రూ.200 కోట్లు పలుకుతున్న ప్రాంతంలో మౌలిక వసతులు అవసరమని చెప్పుకొచ్చారు. కార్పొరేట్ ఆఫీస్‌ల మాదిరిగానే కార్పొరేషన్ ఆఫీస్ నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఈ

ప్రాంతంలో లక్ష ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. ఎక్కడ నివసించేవారికి అక్కడే ఇళ్లు కట్టి ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.1,674.74కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. మియాపూర్‌లో రూ.161కోట్లతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. రూ.530కోట్లతో మియాపూర్ చౌరస్తాలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అలాగే రూ.308కోట్లతో శేరిలింగంపల్లి ఆర్వోబీ నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టారు. రూ.65.53కోట్లతో నిర్మించిన బాచుపల్లి ఫ్లైవర్‌కు సీఎం రేవంత్ ప్రారంభోత్సవం చేశారు.రూ.229 కోట్లతో ఓఆర్ఆర్‌కు ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్డు కోసం ప్రధాన వంతెన నిర్మాణం, ఓఆర్ఆర్ నుంచి కొత్త సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. రూ.110కోట్లతో శంకర్‌పల్లి రోడ్ నుంచి మణికొండ వరకు పైప్ లైన్ రోడ్డు నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ చేశారు.

రూ.29.25కోట్లతో కొల్లూరు ఇంటర్‌చేంజ్ సమీపంలోని రెండు రైల్వే ఓవర్ హెడ్స్ వరకు నాలుగు లేన్ల అప్రోచ్ ర్యాంపుల నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టారు. రూ.26.50కోట్లతో నానక్‌రామ్‌గూడ నుంచి గచ్చిబౌలి వరకు ఓఆర్ఆర్ ఎడమ వైపు ఉన్న ప్రధాన క్యారేజ్ వే విస్తరణకు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.200కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికీ భూమిపూజ చేశారు. రూ.14.40కోట్లతో మాదాపూర్, నానక్‌రామ్‌గూడలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్ నిర్మాణానికి సీఎం రేవంత్ కొబ్బరికాయ కొట్టారు. అనంతరం మియాపూర్‌లో 'ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక' బహిరంగ సభలో ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సభకు మంత్రి శ్రీధర్ బాబు, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, ఎమెల్యేలు అరికెపూడి గాంధీ, మాల్ రెడ్డి రంగారెడ్డి, నవీన్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ప్రజల భవిష్యత్ బాగు చేసే బాధ్యత ప్రభుత్వానిదే

ఉంటుందన్నారు. పంటలు పండించడంలో జిల్లాలో రైతులకు మించిన వారు లేరని కొనియాడారు. రాయలసీమ, విశాఖ జిల్లాల్లో పరిశ్రమల కోసం భూములు కావాలంటే ఇస్తారని.. ఇక్కడ మాత్రం సెంటు భూమి కూడా ఇవ్వరని అన్నారు. అక్వా రైతుల సంక్షేమం కోసం ఓ ప్రణాళిక రూపొందించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ప్రశాంతంగా ఉండే ఈ జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టారని.. గొడవలు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ప్రజల భూములను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టిందని మండిపడ్డారు. గొడ్డలి పట్టుకునే వారికి నాగలి పట్టుకున్న రైతు గుర్తుకు రాలేదని వ్యాఖ్యానించారు. 'మీ భూమి మీద సైకో ఫొటో వేశారు. భూమి మీది.. ఫొటో సైకోది.. నిద్ర లేస్తూనే ఆయన మొహం చూడాల్సి వచ్చేది. జగన్ పిచ్చితనానికి ట్రీట్‌మెంట్ ఎక్కడ ఉందో తెలీదు. మీకేమైనా తెలిస్తే, ఆ అడ్రస్ ఆయనకు పంపుతాను' అంటూ సీఎం చంద్రబాబు సెటైరికల్ కామెంట్స్ చేశారు. రీసర్వేలో రైతులను భాగస్వాములను చేశామని చెప్పారు. 6,688 గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూ రికార్డులు అప్‌డేట్ చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 26 లక్షల పాస్ పుస్తకాలను పంపిణీ చేశామన్నారు.

నిషేధిత జాబితా 22ఎలో ఉన్న భూ సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రైతుల ఖాతాల్లో రూ.8వేల కోట్ల అన్నదాత సుఖీభవ నిధులు జమ చేశామని చంద్రబాబు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతులకు నగదు చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. త్వరలో ఆక్వా రైతుల సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. రాష్ట్రంలో భూ రికార్డుల సంస్కరణలు, రైతుల హక్కుల పరిరక్షణ, వ్యవసాయాభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. గోదావరి జిల్లాలు దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా నిలిచాయని కొనియాడిన సీఎం.. ఈ ప్రాంత రైతులు భూమిని సమర్థంగా వినియోగించుకుని వ్యవసాయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ప్రశంసించారు. ఇప్పుడు రైతుల భూ రికార్డులను ఎవరూ ట్యాంపర్ చేయలేరని, భూ సమస్యల పరిష్కారం కోసం బ్లాక్ చైన్ టెక్నాలజీ తీసుకొచ్చాం సీఎం చెప్పుకొచ్చారు. భూమి రికార్డులను మరింత భద్రంగా ఉంచేందుకు ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. బ్లాక్‌చైన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్‌లు, అధునాతన భద్రతా ఫీచర్లతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నాము. కరెన్సీ నోట్లకు ఉండే భద్రతా ప్రమాణాల తరహాలో రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు రైతులకు అందిస్తున్నాము. రీ-సర్వే, ఈ-కేవైసీ ప్రక్రియల అనంతరం మాత్రమే పాస్ పుస్తకాలు ముద్రిస్తున్నామని వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 6,688 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి 26.46 లక్షల మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేసాము. ఇంకా 62.32 లక్షల పుస్తకాలు పంపిణీ చేయాల్సి ఉంది, నిర్ణీత గడువులోగా 90 లక్షల మంది భూ యజమానులకు పాస్ పుస్తకాలు అందజేయడమే లక్ష్యం. గత పాలనలో ఏర్పడిన సమస్యలను పరిష్కరించేందుకు మూడు సంవత్సరాల పాటు కృషి చేయాల్సి వచ్చింది. రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తీసుకొస్తున్నాము. రీ-సర్వే 2.0 కింద ఇప్పటికే 1,836 గ్రామాల్లో తుది రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేసాం. అమ్మకం, బహుమతి, విభజన వంటి 9 లక్షల భూ లావాదేవీలకు 100 శాతం ఆటో మ్యుటేషన్ వ్యవస్థను అమలు చేస్తున్నాము. వారసత్వ హక్కుల బదిలీని సులభతరం చేస్తూ రూ.10 లక్షల లోపు ఆస్తులకు కేవలం రూ.100తో బదిలీ సౌకర్యం కల్పించాము. అంతకంటే ఎక్కువ విలువ గల ఆస్తులకు రూ.1,000 స్టాంప్ డ్యూటీ చెల్లిస్తే సరిపోతుంది' అని సీఎం చెప్పారు. అలాగే పాత భూ రికార్డుల డిజిటలైజేషన్ వేగంగా కొనసాగుతోందని.. 1బీ, అడంగల్, డీకేటీ, ఇనాం, సీలింగ్ రికార్డులను డిజిటల్ రూపంలోకి తీసుకువస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. వాట్సాప్ ద్వారా మ్యుటేషన్ దరఖాస్తు, ట్రాకింగ్ సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు.

## సంక్షేమ రాజ్య నిర్మాణం.. ప్రజాప్రభుత్వ లక్ష్యం

పాలనపారమైన అనుమతులు మంజూరయ్యాయని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ భవనాలు కేవలం భౌతికంగా కనపడేటువంటి ఒక కట్టడాలు మాత్రమే కాదు.. వేలాదిమంది విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడే ఆధునిక దేవాలయాలని ఆయన అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకుల కోచింగ్ కష్టాలను శాశ్వతంగా దూరం చేయాలన్నదే ప్రజా ప్రభుత్వ బలమైన సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. ట్యాంక్‌బండ్ వద్ద నిర్మించ తలపెట్టిన 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్' స్థలాన్ని, ఆ తర్వాత కాచిగూడలోని 'నింబోలిఅడ్డా హాస్టల్' ప్రాంగణాన్ని సంక్షేమ శాఖా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఉప ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ను ట్యాంక్‌బండ్ దగ్గర సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్, మరో 10 అంతస్తులతో నిర్మించనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. అవతేకాక నింబోలిఅడ్డా వద్ద మూడు అంతస్తులతో హాస్టల్ భవనాల నిర్మాణం దళిత, నిరుపేద వర్గాల చిరకాల వాంఛ అని చెప్పారు. ఈ భవనాలను నిర్మించడం ద్వారా రాష్ట్రంలో జ్ఞానం పొందాలనుకునే అందరికీ పెద్ద ఎత్తున ఉపయోగపడతాయని చెప్పారు. ఈ భవనాల నిర్మాణంకు సంబంధించి ప్రతిపాదనలు పంపిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తరఫున ÷నాన్స్ క్లియరెన్స్ చేసి పంపించడం జరిగిందన్నారు. నాలెడ్జ్ సెంటర్ లో స్టడీ సర్కిల్స్, డిజిటల్ లైబ్రరీ, కాన్ఫరెన్స్ హాల్స్ లో విజ్ఞానాన్ని పంచే అత్యుత్తమ వేదికలగా నిలుస్తాయనే

అశాభవాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇక్కడ నిర్వహించే కార్యకలాపాలను డిజిటల్ వ్యవస్థతో మారుమూల ప్రాంతాలకు చేర్చేలా బలమైన సాంకేతిక వ్యవస్థను అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత మేము చాలా స్పష్టంగా చెప్పాము.. రాష్ట్రంలోని ప్రతి శాసనసభ నియోజకవర్గంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్స్ ను నిర్మిస్తున్నట్లు ప్రకటించామని చెప్పారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు కోచింగ్ కోసం హైదరాబాద్ రాకుండా అక్కడే ప్రిపేరయ్యేలా ఇవి ఉండబోతున్నాయి. భవిష్యత్తులో ఆయా శాసనసభ నియోజకవర్గాల్లోనే, అక్కడే వాళ్లకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. బెస్ట్ ఆఫ్ ది బెస్ట్ లెక్చరర్స్ ఇక్కడి నుంచి పాఠాలు చెబుతుంటే.. ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు ఉన్నచోటనుంచే కదలకుండా కోచింగ్‌ను పొందేలా ఈ సెంటర్లను ఇంటర్‌లింక్ చేస్తున్నట్లు చెప్పారు. నాలెడ్జ్ సెంటర్ కేవలం ఒక భవనం మాత్రమే కాదని, కోట్లాది మంది విజ్ఞానాన్ని పెంపొందించుకునే ఒక నిరంతర విద్యా వేదికగా ఆయన అభివర్ణించారు. కూలీ నాలీ చేసుకునే తల్లిదండ్రులు, వ్యవసాయం చేసుకునే కుటుంబాలు, మధ్యతరగతి చిన్న వ్యాపారుల పిల్లలు.. పోటీ పరీక్షల కోచింగ్ కోసం హైదరాబాద్ వచ్చి ఇక్కడ వసతి ఖర్చుల భారాన్ని మోయలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ముందుచూపుతో ఈ నిర్ణయం తీసుకుందన్నారు. కేవలం ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వడమే కాకుండా, నిరుద్యోగులు ఆయా ఉద్యోగాలను సాధించేలా రాష్ట్రవ్యాప్తంగా ఉచిత కోచింగ్ సౌకర్యాన్ని ఈ నాలెడ్జ్ సెంటర్ ద్వారా

అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఈ ప్రధాన సెంటర్ నుంచి బెస్ట్ లెక్చరర్స్ చెప్పే పాఠాలను.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాల్లో నిర్మించబోయే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో, డిజిటల్ వ్యవస్థ ద్వారా విద్యార్థులు నేరుగా వీక్షించేలా ఇంటర్‌లింక్ చేస్తున్నట్లు వివరించారు. ట్యాంక్‌బండ్ వద్ద నిర్మించే ఈ భవన సముదాయంలో స్టడీ సర్కిల్స్, డిజిటల్ లైబ్రరీ, అత్యాధునిక కాన్ఫరెన్స్ హాళ్లు ఉంటాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేధావులతో ఇక్కడ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పాత నిర్మాణాన్ని పూర్తిగా తొలగించడం కోసం రూ.5 కోట్ల నిధులను విడుదల చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వం 2016లోనే దీనికి శంకుస్థాపన చేసినప్పటికీ వివిధ కారణాల వల్ల నిర్మించలేకపోయిందన్నారు. మా ప్రజాప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో ఈ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి సంకల్పించిందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్ మొత్తం వ్యయం రూ.110 కోట్లని, ఈ ఏడాదే పనులు వేగంగా జరగడానికి బ్జడెట్ లోనే రూ.50 కోట్లను కేటాయించినట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. ఎక్కడా రాజీ పడకుండా అత్యుత్తమ ఆర్కిటెక్చర్, బెస్ట్ డిజైన్స్‌తో ఈ భవనాన్ని నిర్మించాల్సిందిగా సంక్షేమ శాఖకు ఆయన సూచించారు. ఉమ్మడి రాష్ట్ర కాలం నుంచి ఎంతో మంది పేద విద్యార్థులకు ఆశ్రయమిచ్చి, ఉన్నత ఉద్యోగస్తులుగా తీర్చిదిద్దిన కాచిగూడలోని 'నింబోలిఅడ్డా హాస్టల్' ను పూర్తిగా ఆధునికీకరణ చేయబోతున్నట్లు ఉపముఖ్యమంత్రి ప్రకటించారు. బ్జడెట్ సమావేశాల్లోనే ఈ ప్రతిపాదనను ప్రవేశపెట్టామని చెప్పారు.

## బొగ్గు దిగుమతలును తగ్గించేయత్నం

ప్రభుత్వం వచ్చాక బొగ్గు రంగంలో కీలక సంస్కరణలు తీసుకొచ్చాం అన్నారు. ప్రస్తుతం 189 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. గతంలో బొగ్గును చైనా, ఆస్ట్రేలియా, ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకునేవాళ్లం. అయితే ఇప్పుడు ఇతర దేశాల నుంచి బొగ్గు దిగుమతి తగ్గించే ప్రయత్నం చేస్తున్నాం అని వివరించారు. అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్‌పై అధ్యయనం చేస్తున్నాం. ఈనెల 11న ప్రైవేట్ కంపెనీలతో చర్చిస్తాం. 2028 నాటికి అన్ని కోల్ బ్లాక్స్ మూసేస్తాం. క్రిటికల్ మినరల్స్ మిషన్ ప్రయోగానికి రూ.1,500 కోట్లు కేటాయించాం. 24 క్రిటికల్ మినరల్స్‌ను దిగుమతి చేసుకుంటున్నాం. అర్జెంటీనాలో 6 క్రిటికల్ మినరల్స్ బ్లాక్స్ తీసుకున్నాం అని కిషన్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాలుగా దేశ అభివృద్ధి కోసం అనేక కీలక సంస్కరణలు అమలు చేసిందని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా మైనింగ్, కోల్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని ఆయన పేర్కొన్నారు. గతంలో బొగ్గు రంగం అవినీతి, అక్రమాలు, అరకొర నిధులతో ఇబ్బందులు ఎదుర్కొనేదని, కానీ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈ రంగం పూర్తిగా రూపాంతరం

చెందిందన్నారు. కోల్ రంగంలో సంస్కరణల ఫలితంగా దేశవ్యాప్తంగా సుమారు ఐదులక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని కిషన్ రెడ్డి వెల్లడించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో బొగ్గు కేటాయింపుల వ్యవహారంలో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయని.. అప్పటి కేంద్ర బొగ్గు మంత్రి జైలుకు వెళ్లిన పరిస్థితులు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. ప్రస్తుతం కోల్ రంగం పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేస్తోందని అన్నారు. ప్రపంచంలో బొగ్గు వినియోగంలో చైనా తర్వాత భారత్ రెండో స్థానంలో ఉందని, దేశ విద్యుత్ ఉత్పత్తిలో 72శాతం బొగ్గుపైనే ఆధారపడి ఉందని మంత్రి వివరించారు. ఈ ఏడాది దేశం ఒక బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి మైలురాయిని చేరుకుందని తెలిపారు. ప్రస్తుతం దేశ అవసరాలకు సరిపడేలా 80 రోజుల బొగ్గు నిల్వలు అందుబాటులో ఉన్నాయని, విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి అంతరాయం కలగకుండా కోల్ సంస్థలు పనిచేస్తున్నాయని చెప్పారు. స్టీల్, ఎరువుల పరిశ్రమలతో పాటు అనేక రంగాలకు బొగ్గు కీలక ముడి పదార్థమని పేర్కొన్న కిషన్ రెడ్డి, గతంలో విదేశాల నుంచి భారీగా బొగ్గు దిగుమతి చేసుకునే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు దేశీయ ఉత్పత్తి పెరగడంతో దిగుమతులు గణనీయంగా తగ్గాయని తెలిపారు. మైనింగ్ ప్రాంతాల్లో రైల్వే మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తూ

రవాణా ఖర్చులు తగ్గించే చర్యలు చేపడుతు న్నామని చెప్పారు. క్రిటికల్ మినరల్స్ విషయంలో ప్రపంచవ్యాప్తంగా తీవ్ర పోటీ నెలకొందని, వాటి కోసం దేశాధినేతలను కూడా కిడ్నాప్ చేసే స్థాయికి పరిస్థితులు వెళ్లాయని ఆయన వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్‌కు ఒక పొరుగు దేశం కీలక ఖనిజాల సరఫరాను నిలిపివేసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో క్రిటికల్ మినరల్స్‌లో స్వయం సమృద్ధి సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తోందన్నారు. ప్రధాని మోదీ విదేశీ పర్యటనల్లో కూడా కీలక ఖనిజాల సరఫరాపై వివిధ దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారని చెప్పారు. కోల్ ఆధారంగా సింథటిక్ గ్యాస్ తయారీపై కూడా ప్రభుత్వం దృష్టి సారించిందని కిషన్ రెడ్డి వెల్లడించారు. అంతర్జాతీయంగా ఇరాన్, అమెరికా ఉద్రిక్తతల వంటి పరిస్థితుల వల్ల ఇంధన దిగుమతులపై ప్రభావం పడుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ వనరుల అభివృద్ధి అవసరమని అన్నారు. దేశంలో 187 బొగ్గు గనులు ఉన్నాయని, వినియోగం పూర్తయిన గనులను శాస్త్రీయ పద్ధతుల్లో మూసివేస్తున్నామని మంత్రి తెలిపారు. మూసివేసిన గనుల్లో పెద్ద ఎత్తున వృక్షారోపణ, పర్యాటక అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.

## ఎబోలా వ్యాప్తిపై ఆరోగ్య శాఖ అప్రమత్తం

సోమవారం సెక్రటేరియట్‌లో సమీక్ష చేశారు. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి రాష్ట్రానికి వచ్చే దేశ, విదేశీ ప్రయాణికులపై ప్రత్యేక నిఘా కొనసాగుతున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. శంషాబాద్ విమానాశ్రయంలో అమలులో ఉన్న స్క్రీనింగ్, సర్వైలెన్స్ వ్యవస్థలను మరింత బలోపేతం చేశామని తెలిపారు. ప్రభావిత దేశాల నుంచి వచ్చిన ప్రయాణికుల వివరాలను సేకరించి, వారి ఆరోగ్య పరిస్థితిని 21 రోజుల పాటు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వివరించారు. అనుమానిత లక్షణాలు కనిపించిన వారిని వెంటనే గుర్తించి, గాంధీ హాస్పిటల్‌లో ఐసోలేషన్‌లో ఉంచుతున్నామని తెలిపారు. ఇప్పటివరకూ ఇద్దరు అనుమానితులను గాంధీలో ఐసోలేషన్‌లో ఉంచి, వారి సాంపిల్స్‌ను టెస్టుల కోసం పూణెలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపించగా.. అక్కడ చేసిన టెస్టుల్లో వారి ఇద్దరికీ వైరస్ నెగిటివ్ వచ్చిందని మంత్రికి వివరించారు. సీఎంఆర్ సూచన మేరకు వారి సాంపిల్స్‌ను మరోసారి సేకరించి టెస్టుల కోసం పూణెలోని ఎన్ఐవీకి పంపించామని చెప్పారు. రెండోసారి నెగిటివ్ వస్తే, వారిని ఐసోలేషన్‌లో నుండి డిశ్చార్జ్ చేస్తామన్నారు. అనుమానిత సాంపిల్స్ సేకరణ, టెస్టులు

చేయడంలో ఎలాంటి అలసత్వం ఉండకూడదని మంత్రి సూచించారు. ఆరోగ్యశాఖకు అవసరమైన సహకారం అందించాలని సీసీఎంబీ డైరెక్టర్‌ను మంత్రి కోరారు. ఐసీఎంఆర్ నుంచి ఎబోలా టెస్టింగ్ కిట్లు వచ్చాయని, టెస్టులు చేయడం ప్రారంభించామని సీసీఎంబీ డైరెక్టర్, డాక్టర్ వినయ్ నందికూరి తెలిపారు. సాంపిల్ వచ్చిన వెంటనే టెస్టులు చేసి, ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం ఇస్తామని ఆయన వివరించారు. విదేశాల నుంచి వచ్చే కొంత మంది ప్రయాణికులు తమకు ఇచ్చిన అడ్రస్‌లో ఉండడం లేదని అధికారులు మంత్రికి తెలిపారు. ఈ అంశంపై మంత్రి సీరియస్‌గా స్పందించారు. ఎబోల ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులు తమ చిరునామా, ఫోన్ నంబర్ తదితర వివరాలను కచ్చితంగా, సక్రమంగా అందించాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు. తప్పుడు వివరాలు అందించడం లేదా వాస్తవాలను దాచిపెట్టడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణించాలని అధికారులకు సూచించారు. తప్పు సమాచారం ఇచ్చే వారిపై ఎపిడెమిక్ డిసీజెస్ యాక్ట్ సహా వర్తించే చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. తప్పుడు సమాచారం అందించినట్లయితే చట్టపరమైన చర్యలు, కేసుల నమోదు వంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందనే విషయాన్ని శంషాబాద్

విమానాశ్రయంలోనే ప్రయాణికులకు స్పష్టంగా తెలియజేయాలని మంత్రి సూచించారు. విదేశీ ప్రయాణికులతో సమర్థవంతంగా కమ్యూనికేట్ చేసేందుకు ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ సహకారం తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఎబోలా ప్రభావిత దేశాల్లో ఎక్కువగా మాట్లాడే ఫ్రెంచ్, అరబిక్, స్వాహిలి సహా అవసరమైన విదేశీ భాషల్లో మాట్లాడగల సిబ్బందిని మూడు షిఫ్టుల్లో, 24 గంటలపాటు విమానాశ్రయంలో అందుబాటులో ఉంచి పర్యవేక్షణ, సమాచార సేకరణ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కాంటాక్ట్ ట్రేసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆరోగ్యశాఖ, జీహెచ్ఎంసీ, విమానాశ్రయ అధికారులు, పోలీసు శాఖ తదితర విభాగాల మధ్య సమన్వయాన్ని పెంచాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో ఎబోలా వ్యాధి నివారణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు. పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని, కేంద్ర ఆరోగ్యశాఖ, ఐసీఎంఆర్ మార్గదర్శకాల ప్రకారం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ప్రజలు అపోహలను నమ్మకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని సూచించారు.

## నీట్ రీ ఎగ్జామ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

21న దేశవ్యాప్తంగా నిర్వహించబోయే రీ టెస్ట్‌ను అత్యంత పారదర్శకంగా, లీకులకు ఏమాత్రం తావులేకుండా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మునుపెన్నడూ లేని విధంగా ఒక అసాధారణ భద్రతా వ్యూహాన్ని సిద్ధం చేశాయి. ఈసారి క్వశ్చన్ పేపర్లు లీక్ అవ్వకుండా ఉండేందుకు ఏకంగా భారత వైమానిక దళం సహాయం తీసుకోనున్నారు. ఈ మేరకు రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మధ్య జరిగిన ఒక ఉన్నత స్థాయి సమావేశంలో ఈ వ్యూహంపై సుదీర్ఘంగా చర్చించారు. గతంలో క్వశ్చన్ పేపర్లను ప్రింటింగ్ ప్రెస్ నుంచి పరీక్ష కేంద్రాలకు తరలించే రవాణా సమయంలోనే లీకేజీ ముఠాలు చేతివాటం ప్రదర్శించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ లోపాన్ని సరిదిద్దడానికి.. ప్రధానమంత్రి కార్యాలయం పర్యవేక్షణలో సరికొత్త చర్యలు చేపడుతున్నారు. దీని ప్రకారం.. క్వశ్చన్ పేపర్లను అత్యంత

సురక్షితమైన ఎయిర్‌ఫోర్స్ విమానాలు, హెలికాప్టర్ల ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తారు. దీనివల్ల రవాణాలో జరిగే ఆలస్యం తగ్గడమే కాకుండా.. అనధికారిక వ్యక్తులు క్వశ్చన్ పేపర్లను తాకే అవకాశం కూడా ఉండదు. ఈసారి భద్రతను ఏ స్థాయిలో పటిష్టం చేశారంటే.. క్వశ్చన్ పేపర్లను తయారు చేసే నిపుణులు, మోడరేటర్లు, అనువాదకులను పరీక్ష జరిగే జూన్ 21వ తేదీ వరకూ ఒక రహస్య ప్రాంతంలో పూర్తిగా నిర్బంధంలో ఉంచారు. బయటి ప్రపంచంతో వారి కి ఎలాంటి సంబంధాలు లేకుండా కఠిన నిఘా ఏర్పాటు చేశారు. క్వశ్చ న్ పేపర్ల బాక్సులకు హైటెక్ జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్స్ ఏర్పాటు చేస్తున్నా రు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థుల బయోమెట్రిక్ గుర్తింపును పకడ్బందీగా పరిశీలిస్తారు. రీ-ఎగ్జామ్‌కు ముందు సోషల్ మీడియాలో నకిలీ పేపర్లు అమ్ముతూ విద్యార్థులను మోసం చేసే ముఠాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు.. మరోవైపు సైబర్ విభాగాన్ని రంగంలోకి దించారు. గతంలో జరిగిన తప్పుల కారణంగా పరీక్ష రద్దయినందున, ఈ రీ-టెస్ట్ కోసం హాజరయ్యే విద్యార్థుల నుంచి ఎలాంటి అదనపు ఫీజు వసూలు చేయడం

లేదని విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. దీనికి అయ్యే పూర్తి ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని, అభ్యర్థులు ఎలాం టి వదంతులను నమ్మకుండా ప్రశాంతంగా పరీక్షకు సిద్ధం కావాలని ఎన్టీఏ కోరింది. మరో రెండు వారాల్లో నీట్ యూజీ 2026 రీ-ఎగ్జామి నేషన్ జరగనుంది. పేపర్ లీక్ ఆరోపణలతో ఇప్పటికే ఓసారి పరీక్షను రద్దు చేయడంతో రీ-టెస్ట్ నిర్వహణ విషయంలో ఎన్టీఏ అత్యంత అప్రమత్తతతో వ్యవహరిస్తోంది. పేపర్ తయారీ దశ నుంచే కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. రీ-ఎగ్జామ్ ప్రశ్నపత్రాల తయారీలో పాల్గొన్న నిపుణులను రహస్య ప్రదేశంలో లాక్‌డౌన్‌లో ఉంచినట్లు తెలుస్తోంది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. నీట్ యూజీ పేపర్ తయారుచేసిన నిపుణులు, పర్యవేక్షకులు, ట్రాన్స్‌లేటర్లు సహ ఈ ప్రక్రియలో భాగస్వాములైన ప్రతిఒక్కరినీ ప్రస్తుతం అత్యంత భద్రత కలిగిన రహస్య ప్రాంతంలో ఉంచినట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. వీరిపై భద్రతా అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉంచారని తెలిపాయి.

# సంపాదకీయం

## విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాలపై నిఘా !

ఇటీవలి కాలంలో మాదక ద్రవ్యాల పట్టివేత ఆందోళన కలిగిస్తోంది. ఎక్కడికక్క నిత్యం ఎక్కో ఓ చోట మాదక ద్రవ్యాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ఉమమడి తెలుగు రాష్ట్రాల్లో గంజాయి విపరీతంగా సరఫరా అవుతోంది. ఈగిల్ టీమ్‌లు పనిచేస్తున్నా, డ్రగ్స్ సరఫరా ఆగడం లేదు. చాపకింద నీరులా డ్రగ్స్ రవాణా సాగుతుతోంది. కాలేజీలు, స్కూళ్లు తెరుస్తున్న వేళ ప్రభుత్వాలు అప్రమత్తం కావాలి. మాదక ద్రవ్యాలు చిన్నారులను చిదిమేయకుండా చూడాలి. తల్లిదండ్రులు కూడా పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలి. ఎవరు ఎవరితో వెళుతున్నారు..ఎక్కడికి అన్నది గుర్తించాలి. మాదక ద్రవ్యాల ముఠాలు విద్యార్థులను లక్ష్యంగా చేసుకని వ్యాపారాలు చేస్తున్నాయి. కఠినంగా వ్యవహరించకపోతే యువత తీవ్ర ప్రమాదంలో పడేలా ఉంది. పిల్లల ప్రవర్తనను, వారు ఎక్కడెక్కడి వెళుతున్నారన్నది తల్లిదండ్రుల నిరతంరం గమనించాలి. వారరు ఎవరి వలలో అయినా పడుతున్నారా అన్నది గుర్తించాలి. విద్యా సంస్థల్లో అవసరమైతే చెకింగ్స్ పెట్టాలి. ఈ రకంగా పిల్లలపై దుష్ప్రభావం చూపకుండా చేయాలి. మాదక ద్రవ్యాల ముఠాలు ఇప్పటికే ఐటి రంగాన్ని, సినిమా రంగాన్ని కేడా ప్రభావితం చేస్తున్నాయి. డ్రగ్స్ పార్టీలు కలకలం రేపుతున్నాయి. ఫామ్‌హౌజ్ పార్టీల్లో డ్రగ్స్ వాడకం పెరిగింది. ఇటీవల పలు కేసుల్లో ఇది నిరూపితం అయ్యింది. ఇతర దేశాలతో పోల్చితే భారతదేశంలో మాదకద్రవ్యాల వినియోగం తక్కువగా ఉంది. అయితే ప్రపంచ వ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో భారత్ క్రమేణా కీలక పాత్ర వహిస్తోంది. సహజంగానే ఇది ఆందోళన కలిగించే అంశం. విశ్వవ్యాప్తంగా ఉత్పత్తి అవుతోన్న హెరాయిన్‌లో 95శాతం థాయిలాండ్, బర్మా, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్థాన్ లలోనే ఉత్పత్తి అవుతోంది. ఈ దేశాల మధ్య ఉన్న భారత్‌కు మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడం కత్తి మీద సాముగా ఉంది. మాదక ద్రవ్యాల అక్రమరవాణాకు భౌగోళికంగా భారత్ అనువుగా ఉంది. దీంతో అంతర్జాతీయ ముఠాలు భారత్‌పై కన్నేసి ఉంచాయి. భారత్ నుంచి విదేశాలకు నిత్యం రాకపోకలు సాగించే ప్రవాసులను పావులుగా వాడుకోవడానికి ఆ మాఫియా ముఠాలు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాయి. మాదక ద్రవ్యాలన్నింటిలోనూ ఖరీదైన హెరాయిన్‌ను భారతదేశంలో ప్రతి రోజు సగటున 28 లక్షల మంది ఒక టన్ను మేరకు వినియోగిస్తున్నట్టు ఒక సర్వేలో వెల్లడయింది. కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ఈ విషయాన్ని తెలిపింది. దీన్ని బట్టి మాదక ద్రవ్యాల వినియోగం ఎంతగా పెరిగిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఒక్క హెరాయిన్ ద్వారా భారత్‌లోకి ప్రతి సంవత్సరం 1.44 లక్షల కోట్ల రూపాయల సొమ్ము మనీలాండరింగ్ ద్వారా వస్తుందని కూడా కేంద్రప్రభుత్వ అధ్వర్యంలోని జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ సంస్థ అంచనా వేసింది. ఆరంభంలోనే ఈ అక్రమాన్ని నిర్మూలించడానికి సమగ్ర చర్యలు తీసుకోకపోతే తెలుగు రాష్ట్రాల, పంజాబ్‌కు తేడా లేకుండాపోతుంది. మరీ ముఖ్యంగా స్కూళ్లు, కాలేజీలు లక్ష్యంగా ముఠాలు పనిచేస్తున్నట్లు ఇటీవల గుర్తించారు. పిల్లు మాదక ద్రవ్యాలకు బానిసలైతే వారిని దారిలోకి తీసుకుని రావడం కష్టం. అందువల్ల ఈ ముఠాల మూలాలను కనుగొని వాటిని నిర్మూలించాల్సి ఉంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రవాసులతో పాటుగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రవాసుల ద్వారా వారికే తెలియకుండా మాదక ద్రవ్యాలను విదేశాలకు సరఫరా చేస్తున్నట్లుగా ఇప్పటి వరకు బహిర్గతమైన కేసుల ద్వారా తెలుస్తోంది. గల్ఫ్ దేశాల్లో మాదక ద్రవ్యాల రవానా, సేవనం పై కఠిన ఆంక్షలు ఉన్నాయి. అక్కడ చాలామంది కఠిన శిక్షలకు గురవుతున్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నేరంపై గల్ఫ్ దేశాలలో ముఖ్యంగా కువైత్‌లో ఆంధప్రదేశ్ ప్రవాసులు అధిక సంఖ్యలో జైళ్ళలో మగ్గుతున్నారు. కువైత్ కేంద్ర కారాగారంలో మాదక ద్రవ్యాలకు సంబంధించిన నేరాలపై శిక్ష అనుభవిస్తున్న భారతీయ ఖైదీలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారే అత్యధికంగా ఉన్నారు. హెరాయిన్ కంటే స్వల్ప ప్రభావం కలిగిన ఔషధ మందులు, గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడ్డ వారు యు.ఏ.ఇ., ఖతర్ తదితర దేశాలలోని జైళ్ళలో మగ్గుతున్నారు. దురదృష్టవశాత్తు వీరి నేరాల విషయమై స్వదేశంలోని పోలీసులు లోతుగా విచారణ చేయలేకపోతున్నారు. కొన్ని కేసులలో దర్యాప్తునకు సహకరించడానికి కుటుంబ సభ్యులు ముందుకు రావడం లేదు. మరి కొన్ని కేసులలో స్మగ్లింగ్ ముఠాలు గల్ఫ్ జైళ్ళలో మగ్గుతున్న వారి కుటుంబ సభ్యులకు నెలకు కొంత మొత్తం పారితోషికం ఇస్తున్నారు. దీంతో సంబంధిత ఖైదీల కుటుంబాలు కూడా దర్యాప్తునకు సహకరించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. విదేశాలకు అక్రమ రవాణా అటుంచి స్వదేశంలోనూ మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోతోంది. హైదరాబాద్‌తో సహా దేశవ్యాప్తంగా పలు నగరాలలో యువతీయువకులు మాదక ద్రవ్యాల వ్యసనానికి గురవుతున్నారు. గల్ఫ్‌లో పుట్టిపెరిగిన కొంత మంది పిల్లలను వారి తల్లిదండ్రులు ఉన్నత విద్యాభ్యాసానికై హైదరాబాద్‌కు పంపించడానికి డ్రగ్స్ కారణంగా భయపడుతున్నారు. ఈ క్రమంలో స్కూళ్లు, కాలేజీల్లో నిఘా పెంచాలి. పిల్లలు ఎవరితో వెళుతున్నారో గుర్తించాలి. కాలేజీలు, స్కూళ్ల పరిసరాల్లో సిసి కెమెరాలను పెంచాలి. దీంతో పిల్లల యోగక్షేమాలకు కూడా అవకాశం ఏర్పడుతుంది. దేశంలో యువతను డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపడే యత్నం చేయాలి. డ్రగ్స్ రవాణాపై మరింత కఠనంగా వ్యవహరిస్తే తప్ప ఇది సాధ్యం కాదు.

## శ్రీగంధం తోటకు నిప్పంటించిన గుర్తుతెలియని దుండగులు

### భారీ నష్టం కలిగించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించి న్యాయం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నెల్లూరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు





మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 8 ( విజన్ ఆంధ్ర): నెల్లూరు శ్రీనివాసులు అనే రైతు మాట్లాడుతూబలపాల గ్రామ రెవెన్యూ పరిధిలోని అతని వ్యవసాయ భూమిలో గత ఆరు సంవత్సరాలుగా ఎంతో శ్రమ, సమయం మరియు ఆర్థిక వ్యయంతో శ్రీగంధం తోటను ఎంతో అభివృద్ధి చేశానని అన్నారు. అయితే గత కొంతకాలంగా గుర్తుతెలియని వ్యక్తులు నా తోటను లక్ష్యంగా చేసుకుని వరుసగా నిప్పంటిస్తున్న సంఘటనలు జరుగుతున్నాయి. తాజాగా 06-06-2026 తేదీన మధ్యాహ్నం సుమారు 2:00 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా నిప్పంటించడం వల్ల సుమారు 8 ఎకరాల శ్రీగంధం తోట, డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థ, గేట్ వాల్వులు మరియు ఇతర వ్యవసాయ సామగ్రి పూర్తిగా దగ్ధమై నాకు భారీ ఆర్థిక నష్టం సంభవించిందిఇంతకుముందు కూడా ఇదే తోటలో పలుమార్లు అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నాయి. గత సంవత్సరం సుమారు నాలుగు ఎకరాల మేర నష్టం జరిగింది. ఇటీవల రెండు సందర్భాల్లో నిప్పు పెట్టిన ప్రయత్నాలను సకాలంలో గుర్తించి అదుపు చేయగలిగాము. అయితే ఈసారి జరిగిన ఘటనలో తీవ్ర నష్టం వాటిల్లిందిఈ వరుస సంఘటనలు యాదృచ్ఛికంగా కాకుండా ఉద్దేశపూర్వకంగా మరియు కక్షపూరితంగా జరుగుతున్నాయనే బలమైన అనుమానం నాకు కలుగుతుందని ఆయన వాపోయారు. నేను గ్రామంలో పాఠశాల అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలు, పూర్వ విద్యార్థుల సేవా కార్యక్రమాలు మరియు ప్రజా ప్రయోజన కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ ప్రజల సహకారంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. ఈ నేపథ్యంలో జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరగడం అత్యంత అవసరమని భావిస్తున్నాను అని అన్నారు. సంబంధిత పోలీసు, రెవెన్యూ మరియు వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా సంఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపించి, బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకునేలా ఆదేశించి, నాకు న్యాయం జరిగేలా చూడవలసిందిగా వినయపూర్వకంగా ప్రార్థిస్తున్నాను. అదేవిధంగా జరిగిన నష్టాన్ని అధికారికంగా అంచనా వేయించి, ప్రభుత్వ నిబంధనల మేరకు సాధ్యమైన సహాయం మరియు రక్షణ చర్యలు కల్పించేందుకు కూడా తగిన ఆదేశాలు జారీ చేయాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నెల్లూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుకు జరిగిన అన్యాయానికి విచారిస్తూ వారికి నష్టపరిహారం ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి

### ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకూరి చిరంజీవి

అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 8.విజన్ ఆంధ్రకోమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ (చీఎవీ) పథకం కింద మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ (మీహ్నా)లుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల గత 6 నెలలుగా వేతనాలు వెంటనే విడుదల చేయాలని లిఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ యూనియన్ (ఏఐటీయూసీ)లి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందిఈ సందర్భంగా లిఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఆత్మకూరు చిరంజీవిలి మాట్లాడుతూ 12-11-2025 నుండి కెరమెరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మోడీ, దేవాపూర్ సబ్ సెంటర్లలో, అలాగే అడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిర్రకుంట, గుండి సబ్ సెంటర్లలో మీహ్నాలుగా నిరంతరాయంగా విధులు నిర్వహిస్తున్న, గ్రామీణ, గిరిజన ప్రాంత ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు, గర్భిణీల పర్యవేక్షణ, బాలింతల సంరక్షణ, వ్యాధి నిరోధక కార్యక్రమాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు మరియు ఇతర వైద్య సేవలను అంకితభావంతో అందిస్తున్న మీహ్నా ఉద్యోగులకు గత 6 నెలలుగా నెలవారీ వేతనాలు విడుదల కాకపోవడం వలన కుటుంబ పోషణ భారంగా మారిందని తెలిపారు.



వేతనాలు అందకపోయినా ప్రజా సేవలకు ఎటువంటి ఆటంకం కలగకుండా వారి విధులను క్రమం తప్పకుండా నిర్వర్తిస్తున్నారూ.ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న కాంట్రాక్టు ఆరోగ్య సిబ్బంది పట్ల మానవతా దృక్పథంతో స్పందించి, పెండింగ్‌లో ఉన్న 6 నెలల వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారుఈ కార్యక్రమంలో లిమిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ రవీనా, ప్రత్యూష, స్నేహ, అనూషలి తదితరులు పాల్గొన్నారు.

## దుబ్బాక దేశాయ్ బీడీ పరిశ్రమ ముందు CITU ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు




విజన్ ఆంధ్ర దుబ్బాక రిపోర్టర్ బిసిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట వార్డులోనీ దేశాయి డీ పరిశ్రమ 5 నంబరు బ్రాంచ్ లోని బీడీ కార్మికులకు గత నెల 18 తేదీ నుండి పని లేక ఇబ్బందులు పడుతున్నారనీ వెంటనే పని కల్పించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో దుబ్బాక దేశాయ్ బీడీ పరిశ్రమ సెంటర్ ముందు ధర్నా చేశారు. అనంతరం తెలంగాణ బీడీ & సిగార్ వర్కర్స్ యూనియన్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి జి.భాస్కర్, మాట్లాడుతూ దుబ్బాక మండలం ధర్మాజీపేట బ్రాంచ్ లోని బీడీ కార్మికులకు సుమారు గత 20 రోజుల నుండి పని లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కంపనీ యాజమాన్యానికి అనేకసార్లు విన్నవించుకున్న యాజమాన్యం పని కల్పించకుండా మొండిగా వ్యవహరించిందని విమర్శించారు. గత 20 రోజుల నుండి పని కోల్పోయిన రోజులకు యాజమాన్యం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం వెంటనే స్పందించి బ్రాంచి ప్రారంభించి తంబాకు, తునికాకు వెంటనే మంజూరు చేసి బీడీ కార్మికులకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. లేనియెడల కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలకు సిద్ధపడతామని దేశాయి బీడీ కంపనీ యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎండి సాజిద్, నర్సింలు,స్వామి ధర్మాజీపేట బ్రాంచ్ 5 నెంబర్ బీడీ కార్మికులు లావణ్య,మల్లవ్వ, సతవ్వ,లచ్చవ్వ,రామలచ్చవ్వ ,వాణి , నర్సవ్వ, రజిత, తదితరులు పాల్గొన్నారు.

## వార్డు సభ ద్వారనే సమస్యలు పరిష్కారం

### అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణి

### కార్పొరేటర్ పూదరి సునీత ప్రభాకర్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 08,(విజన్ ఆంధ్ర)వార్డు సభ ద్వారనే వార్డులో ఉన్న సమస్యలు పరిష్కరించబడుతాయని 39 వ డివిజన్ కార్పొరేటర్ పూదరి సునీత ప్రభాకర్ అన్నారు.ప్రజా ప్రభుత్వం లో 99 రోజుల ప్రణాళిక ప్రజా పాలనలో భాగంగా సోమవారం పట్టణ సిఐ ప్రమోద్ రావు, విద్యుత్ శాఖ ఏ డి వేణుగోపాల్ తో కలిసి 39వ డివిజన్లో వార్డు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పూదరి సునీత ప్రభాకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆదేశాల మేరకు ఇప్పటికే డివిజన్ లో అనేక అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. ఇంకా కొన్నింటికి త్వరలో మరిన్ని నిధులు తీసుకొచ్చి డివిజన్ లో ఎక్కడ సమస్యలు లేకుండా కృషి చేస్తానన్నారు.వార్డులో తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ సిబ్బంది కి అందించాలని,ప్రతి ఒక్కరు తమ తమ ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్దిదారునికి అందేలా చూస్తామన్నారు. పట్టణ సిఐ ప్రమోద్ రావు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు అలవాటు పడవద్దని, గంజాయి కి అలవాటు పడి జీవితాలను అంధకారం చేసుకోవద్దన్నారు.మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ప్రతి ఒక్కరు తమ తమ ఇంటి వద్ద వార్డులో సి సి కెమెరాలు అమర్చుకోవాలన్నారు. విద్యుత్ సమస్యలు లేకుండా తమ సిబ్బంది ఎప్పటికప్పుడు డివిజన్ లో పర్యవేక్షిస్తున్నారని విద్యుత్ శాఖ డీ ఈ వేణుగోపాల్ అన్నారు.వార్డులో మూడు ట్రాన్స్ఫర్మాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అర్హులైన పలువురు లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏ ఈ శ్రీనివాస్, వార్డు ఆఫీసర్ శ్రీనివాస్, వార్డు అధ్యక్షురాలు వైద్య సరిత, ఆర్పీలు,ప్రజలు పాల్గొన్నారు.

## ముగిసిన మాన్‌సూన్ రెగట్టా సెయిలింగ్ చాంపియన్‌షిప్

### విజేతలకు పథకాలు అందజేసిన ప్రభుత్వ కార్యదర్శి కె.రామకృష్ణారావు

హైదరాబాద్, జూన్ 08 (విజన్ ఆంధ్ర) : ఈనెల 2 నుంచి హుస్సేన్‌సాగర్‌లో జరిగిన 17వ మాన్‌సూన్ రెగట్టా నేషనల్ ర్యాంకింగ్ సెయిలింగ్ చాంపియన్‌షిప్‌లో పలు విభాగాల్లో పతకాలు సాధించిన తెలంగాణ సెయిలర్లకు ముగింపు వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కె.రామకృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ చీఫ్ కోచ్ సుహైమ్ షేక్ తో కలసి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. అండర్-16 బాయ్స్‌లో రవికుమార్ స్వర్ణం, పూట్ల నరసింహ రజతం, నీలకొండ మణి కాంస్యం, అండర్-16 గర్ల్స్‌లో రమీజా భాను స్వర్ణం, శృంగారి రాయ్ రజతం, సాక్షి కుమారి కాంస్యం, అండర్-18 మిక్స్‌డ్ డబుల్ హ్యాండర్‌లో బద్రీనాథ్ నిరుడు-రిశ్వక జోడీ స్వర్ణం, చంద్రలేఖ తత్తరి-ధనుష్ జక్కుల రజతం, శిరీష జల్లమ్మగారి-రామ్ చరణ్ కాంస్యం,



స్కిఫ్ బాయ్స్ విభాగంలో శరణ్య యాదవ్-శివం వాల్మీకి స్వర్ణం, వినోద్ దండు-అరవింద్ మలోత్ రజతం, మహమ్మద్ రిజ్వాన్-ధోకి సాత్విక్ కాంస్యం, సింగిల్ హ్యాండర్ బాయ్స్‌లో ప్రీత్ సివాల్ స్వర్ణం, హృదయ్ జైరామ్ జోషి రజతం, కౌనిక్ వర్ధన్ కాంస్యం, సింగిల్ హ్యాండర్ గర్ల్స్‌లో కాత్యాయని కౌశిక్ స్వర్ణం, కృతిక విశ్వనాథన్ రజతం, రమ్యశ్రీ చల్లా కాంస్య పతకాలు గెలుచుకున్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని వినతి పత్రం

### మౌలిక సదుపాయాలు కల్పించాలని బిజెపి ఎనిమిదో వార్డు ఇన్చార్జ్ డాక్టర్ సీతారాం నాయక్ డిమాండ్ చేశారు




మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 8 (విజన్ ఆంధ్ర):మహబూబాబాద్ జిల్లాలోని ఈరోజు జరిగిన గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో స్నేహ శబారిష్ కి ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించి పాఠశాలలను బలోపేతం చేసి మూలిక సదుపాయాలు కల్పించాలని డాక్టర్ సీతారాం నాయక్ వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మహబూబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదో వార్డు బాబు నాయక్ తండా సాంక్రియా తండా ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు పరిస్థితులు కలెక్టర్ దృష్టికి తీసుకొనిపయినానని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వ్యాప్తంగా బడిబాట కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నప్పటికీ మా తండాల్లో ఇప్పటివరకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయుల ద్వారా అడ్మిషన్ల కోసం ఎటువంటి అవగాహన కార్యక్రమం నిర్వహించబడలేదని వారు వాపోయారు. మరోవైపు ప్రవేటు పాఠశాలలో విద్యార్థులు అడ్మిషన్లకు కోసం ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రచారం లేక విద్యార్థులు రాలేకపోతున్నారు. ఉపాధ్యాయుల కొరత దీనివల్ల పాఠశాలలో మూతపడే కార్యక్రమం జరుగుతుందని ఇట్టి పరిస్థితులను చక్కదిద్ది పాఠశాల నిర్వహించే విధంగా చేయాలని వారు డిమాండ్ చేశారు. పాఠశాలల్లోని వెంటనే త్రాగునీరు మరుగుదొడ్లు ఫర్నిచర్ ఇది సౌకర్యాలు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## ఫీజుల పేరిట నిలువు దోపిడీని నియంత్రించాలి

### ఐక్య విద్యార్థి సంఘాలు

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 08,(విజన్ ఆంధ్ర) జిల్లాలో ఉన్నటువంటి కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజుల పేరుతో నిలువు దోపిడీ చేయడాన్ని ఐక్య విద్యార్థి సంఘాలుగా తీవ్రంగా ఖండిస్తున్నామని సోమవారం ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ చైతన్య,నారాయణ,ఆల్ఫోర్స్ లాంటి కార్పొరేట్ పాఠశాలలు ముందస్తు అడ్మిషన్ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను హింసించడం, మరోవైపు అడ్మిషన్ పొందిన విద్యార్థుల కు సంబంధించి ఫీజు కన్ఫర్మేషన్ మరియు పుస్తకాల పేరుతో ఫీజుల దోపిడీకి తెరలేపి విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నాయని అన్నారు. ఈ విషయాలపై జిల్లా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నిరెత్తనట్టు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తుందని,మరోవైపు కొన్ని కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలు విద్యాశాఖ అధికారులు మమ్మల్ని ఏం చేయలేరంటూ బాహాటంగానే చెబుతూ ప్రశ్నించే వారిపై ఎదురుదాడికి దిగుతున్నారని అన్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు నిద్రమత్తు వీడి విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే వివిధ రకాల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఐక్య విద్యార్థి సంఘాలుగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు సిహెచ్. శ్రీనివాస్, జుమ్మిడి గోపాల్, క్రాంతి కుమార్, అభిరామ్ మరియు శేఖర్ ఉన్నారు.

## జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ ఛాంపియన్షిప్లో ఛాంపియన్లుగా నిలిచిన ఓరుగల్లు విద్యార్థులు

హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 8 (విజన్ ఆంధ్ర) మే 30వ తేదీ నుండి జూన్ 3వ తేదీ వరకు ఒడిస్సా లోని కుర్దా లో జరిగిన జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ ఛాంపియన్షిప్లో వరంగల్ జిల్లా నుండి మణి మార్షల్ ఆర్ట్స్ అండ్ ఫిట్నెస్ అకాడమీ విద్యార్థులు కార్తీక్ పరిశి, గణేష్ పూసల పాల్గొని ఇద్దరు కాంస్య పథకం సాధించారని ప్రముఖ మార్షల్ ఆర్ట్స్ కోచ్ గడదాసు మణికంఠ తెలిపారు మరియు జాతీయస్థాయిలో కాంస్య పథకాలు సాధించినందుకు కోచిగా గర్వపడుతూ వారిని సన్మానించడం జరిగింది. ఈ క్రీడాకారులు పథకాలు సాధించినందుకు కోచ్ మణికంఠ తో పాటు వారి తల్లిదండ్రులు మరియు మిత్రులు సంతోషం వ్యక్తం చేశారు.



## హనుమకొండ డిఎంహెచ్వో గా డాక్టర్ ఎస్ దుర్గా రామ్ కుమార్

హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 8 (విజన్ ఆంధ్ర)వైద్య ఆరోగ్యశాఖ బదిలీల్లో భాగంగా హనుమకొండ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ ఎస్ దుర్గా రాంకుమార్ గారిని నియమించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ ని కలిసి రిపోర్ట్ చేయడం జరిగింది. వీరు కూకట్పల్లి జోన్ డిఎంహెచ్వో గా పని చేస్తూ బదిలీపై హనుమకొండకు రావడం జరిగింది. ప్రస్తుతం హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ అల్లం అప్పయ్య ని ములుగు జనరల్ ఆస్పత్రి ఆర్ఎంఓ గా నియమించడం జరిగింది. అదనపు కలెక్టర్ శ్రీఎన్ రవి ,డి ఆర్ ఓ శ్రీనివాస్ లను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది డిప్యూటీ సివిల్ సర్జన్ లుగా డాక్టర్ సిహెచ్ మురళి మరియు డాక్టర్ పవిత్ర లు జిల్లాకు బదిలీపై రావడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు సిబ్బంది అభినందనలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్వోమదన్ మోహన్ రావు , డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రదీప్ రెడ్డి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ రుబీనా అఫ్రోజ్ ఏవో కోలా రాజేశ్, జిల్లా మాస్ ఎడ్యుకేషన్ మీడియా అధికారి అశోక్ రెడ్డి, హెచ్ ఈ ఈ ఓ చంద్రశేఖర్ , డిపిఓ రుక్ముద్దీన్, ప్రసన్న కుమార్ ,ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.



## నాగర్ కర్నూలు జిల్లా డి. ఎం. హెచ్. ఓ.గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కె.కృష్ణ



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): జూన్ 08 ఇటీవల వైద్య మరియు ఆరోగ్య శాఖలో సాధారణ బదిలీల్లో భాగంగా మహబూబ్ నగర్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కె. కృష్ణ నాగర్ కర్నూల్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారిగా బదిలీ అయ్యారు.సోమవారము నాడు డాక్టర్ కె. కృష్ణ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారిగా విధులలో చేరారు. ఇన్చార్జ్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా ఉన్న డాక్టర్ కే రవికుమార్ నాయక్ నుండి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగానూతనంగా బాధ్యతలు స్వీకరించిన డి.ఎం.హెచ్. ఓ.డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తానని, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లో జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉంచడానికి తీవ్రమైన కృషి చేస్తానని తెలియజేశారు.ప్రోగ్రామ్ అధికారులు, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది,ఇతర సిబ్బంది సహకరించాలని కోరారు.

# రైతులకు ఇబ్బంది లేకుండా వరి కొనుగోలు ప్రక్రియ

## హేమంత కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధిజూన్ 06రాష్ట్రంలో వరి కొనుగోలు, సంక్షేమ పథకాల అమలును పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి అదనపు డి జి పి మహేష్ భగవత్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సి.పి.లు, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నీట్–2026 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు, వరి ధాన్యం కొనుగోలు, జూన్ 9న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి సభ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 21వ తేదీన జరగనున్న నీట్–2026 పరీక్షకు 24 పట్టణాలలో 208 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 72 వేల 956 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఇందుకు తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయాలని, రాష్ట్ర, జిల్లా సమన్వయ కమిటీలు అందుకు అనుగుణంగా పని చేయాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులపై తక్షణమే స్పందించాలని, వదంతులు వ్యాప్తి కాకుండా చూడాలని తెలిపారు. ప్రభుత్వ సంస్థలలో మాత్రమే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలలో సి సి కెమెరాలు ఏర్పాటు చేయాలని, అంతర్జాతీయ యోగా దినోత్సవం దృష్ట్యా పరీక్ష



నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. పరీక్ష రోజున ప్రశ్న పత్రాల తరలింపు, అభ్యర్థుల రిజిస్ట్రేషన్, బయోమెట్రిక్ వెరిఫికేషన్, అభ్యర్థుల తనిఖీ, బందోబస్తు తదితర ఏర్పాట్లను ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 71 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి 4 వేల 488 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు 10 లక్షల 58 వేల మంది రైతుల ఖాతాలలో 13 వేల 577 కోట్ల రూపాయల కనీస మద్దతు ధర జమ చేయడం జరిగిందని, మిగిలిన ధాన్యాన్ని కూడా త్వరితగతిన కొనుగోలు చేసి కొనుగోలు ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి మండల మహిళా సమాఖ్యకు 1 చొప్పున 553 బస్సులను మంజూరు చేయడం జరిగిందని, ఈ బస్సులను జూన్ 9వ తేదీన సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా మహిళా సమాఖ్య సభ్యులకు లాంఛనంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లు, సభకు మహిళా సమాఖ్య సభ్యుల తరలింపుపై ఆయా జిల్లాల గ్రామీణ అభివృద్ధి అధికారులు, ఆర్ టి సి రీజినల్ మేనేజర్లు సమన్వయంతో పని చేసి సభను విజయవంతం చేయాలని తెలిపారు. జూన్ 12న రాష్ట్రంలోని పాఠశాలల పునః ప్రారంభానికి విద్యార్థులకుఅందజేయవలసిన యూనిఫామ్ లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ హాజరై,మాట్లాడుతూ . జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వర్షాల దృష్ట్యా కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచడం జరిగిందని, రవాణా సంబంధిత ఏర్పాట్లు చేయడం జరిగిందని, తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని తెలిపారు. తొమ్మిదో తేదీకి మహిళల తరలింపు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలోని ఈనెల 12వ తేదీ నుండి ప్రారంభం కనుగొన్న పాఠశాలల పునః ప్రారంభానికి పకడ్బందీ ఏర్పాటు చేస్తామని పాఠ్యపుస్తకాలు ఏకరూప దుస్తులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. వర్షాకాలంలో తీసుకుని జాగ్రత్తల పట్ల కలెక్టర్ వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అమరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి చిన్న ఓబులేసు ,, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నరసింహారావు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రాజేందర్ , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభల ద్వారా గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

**గ్రామ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు కీలకం**
**యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి**
**చందుబట్ల గ్రామసభలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్,**

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): జూన్ 08రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నాగర్ కర్నూల్ మండల పరిధిలోని చందుబట్ల గ్రామంలో గ్రామ సర్పంచ్ తిరుపతి గౌడ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన గ్రామసభకు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.జిల్లా కలెక్టర్ , జిల్లా ఎస్పీ ,గ్రామ ప్రజలతో అధికారులు ముఖాముఖి సమావేశమై గ్రామంలోని సమస్యలు, అభివృద్ధి అవసరాలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై నేరుగా వివరాలు సేకరించారు. అనంతరం సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు.ఈ సందర్భంగా హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ, గ్రామసభలు ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభాలని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సమిష్టిగా కృషి చేసే వేదిక గ్రామసభ అని అన్నారు. గ్రామ



ప్రజలు తమ అవసరాలు, సమస్యలను గ్రామసభలో స్వేచ్ఛగా తెలియజేయాలని సూచించారు.తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, వీధిదీపాలు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు ముందస్తు ప్రణాళికలు రూపొందించి, అందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని అన్నారు.గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని, గ్రామసభల ద్వారా తీసుకునే నిర్ణయాలు గ్రామప్రగతికిదోహదపడతాయని కలెక్టర్పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూసమాజ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషిస్తారని చెప్పారు. ప్రస్తుతం యువతలో మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో యువత డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా కుటుంబాలు, సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతాయనిహెచ్చరించారు. యువత విద్య, ఉపాధి, క్రీడలు, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించి తమ జీవితాలను ఉన్నత లక్ష్యాల వైపు మలుచుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగానికి పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకుతెలియజేయాలని కోరారు.అదేవిధంగా సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, మహిళల రక్షణ అంశాలపైప్రజలకుఅవగాహన కల్పించారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈగ్రామసభలో ఆర్డిఓ సురేష్ బాబు, డీఎస్పీ శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, ఎంపీడీవో చిన్నమ్మ, ఎంపీఓ రాజీవ్ ప్రసన్నకుమార్, సెక్రటరీ అన్వేష్, వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

### జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూన్–08(విజన్ ఆంధ్ర)అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా రెవెన్యూ అధికారి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.పెద్దపల్లి పట్టణం నల్ల పోచమ్మ వాడకు చెందిన ఎం.డి.శాబాన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఈఈ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ తెలిపారు. గోదావరిఖని మార్కండేయ కాలనీకి చెందిన బి.శంకర్ తనకు దివ్యాంగుల ఫోటోలు వీల్ చైర్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా డి.ఆర్.డి.ఓ కుశ రాస్తూ వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.అంతర్గాం మండలం ఎక్లాస్పూర్ గ్రామానికి చెందిన రవికుమార్ ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న వాచ్మెన్ పోస్ట్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి సొసైటీ కి రాస్తూ పరిశీలించి సమస్య పరిష్కరించాలని అన్నారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


## ధాన్యం కొనుగోళ్లలో మరింత వేగం అవసరం

**అన్ లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి**
**తడిసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలి**
**అధికారులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాలు**



రాజన్న సిరిసిల్ల, జూన్ 8 (విజన్ ఆంధ్ర బ్యూరో):జిల్లాలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్తో కలిసి టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ధాన్యం కొనుగోళ్లు, రవాణా, అన్ లోడింగ్ తదితర అంశాలపై సమీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, హమాలీల అందుబాటు, గన్నీ సంచుల నిల్వలు, ఇప్పటివరకు మూసివేసిన కొనుగోలు కేంద్రాల వివరాలను అధికారులు కలెక్టర్కు వివరించారు.అపరెల్ పార్క్లు, గోదాములకు ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను సమకూర్చాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు ప్రక్రియ పూర్తయిన కేంద్రాల నుంచి హమాలీలను అన్ లోడింగ్ పనులకు వినియోగించాలని, తుది దశకు చేరుకున్న కేంద్రాల నుంచి వాహనాలు, కార్మికులను అవసరమైన ఇతర కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు.
ధాన్యం కొనుగోలు, రవాణా, అన్ లోడింగ్ ప్రక్రియలను ప్రణాళికాబద్ధంగా వేగవంతం చేయాలని, అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఎక్కడైనా ధాన్యం తడిసినట్లయితే ఆలస్యం చేయకుండా వెంటనే రైస్ మిల్లులకు తరలించి నాణ్యత పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## హనుమకొండ జిల్లా వైద్యాధికారి బదిలీ



హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 8 ( విజన్ ఆంధ్ర )హనుమకొండ జిల్లా వైద్యాధికారిగా సుదీర్ఘకాలం పనిచేసిన డాక్టర్ అల్లెం అప్పయ్య సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సూచనల మేరకు ములుగు జిల్లా ఆర్ ఎం ఓ గా బదిలీ అయ్యారు.కూకట్ పల్లి డి ఎం ఎం హెచ్ ఓ గా పనిచేసిన దుర్గం రామ్ కుమార్ ను హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించాల్సిందిగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది

### ప్రజలలో అవగాహన పెంపొందించేందుకే గ్రామ, వార్డు సభలు

# ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి

**–పంటల మార్పిడి ఆవశ్యకతను గుర్తించాలి**
**బురాన్ పల్లి గ్రామ సభలో కలెక్టర్ దీపక్ తివారి వెల్లడి**

వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 08 (విజన్ ఆంధ్ర) : సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు వివిధ అంశాలపై ప్రజలలో అవగాహన పెంపొందించాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ పంచాయతీలలో గ్రామ సభలను, మున్సిపల్ పట్టణాలలో వార్డు సభలను నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి వెల్లడించారు. వికారాబాద్ మండలం బురాన్ పల్లి గ్రామంలో సోమవారం స్థానిక సర్పంచ్ రాథోడ్ రాందాస్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పంటల మార్పిడి, సరైన మోతాదులో ఎరువుల వినియోగం, రక్షిత మంచినీటి సరఫరా, వర్షపు నీటిని ఓడిసిపట్టడం, భూగర్భ జలాల సంరక్షణ, విరివిగా మొక్కల పెంపకం, పర్యావరణ సమతుల్యాన్ని కాపాడడం, ప్రత్యేక ఓటరు




జాబితా సవరణ, వానాకాలంలో సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో జిల్లా అరుదైన ఘనతను కలిగి ఉన్నదని గుర్తు చేశారు. పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి విధానాన్ని అవలంభిస్తూ సాగు రంగంలో ప్రత్యేకతను చాటాలని రైతులకు సూచించారు. ఎల్ నినో ప్రభావం వల్ల తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నందున, తక్కువ సాగు నీటి అవసరం కలిగిన పంటలను విత్తుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వం నోటిఫై చేసిన ఆయా పంట రకాలనే సాగు చేయాలని, నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నకిలీ, నాసిరకం విత్తనాలను విక్రయించే డీలర్ల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని, అర్హులైన రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ సబ్సిడీలు, ఇతర ప్రయోజనాలు పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ దోహదపడుతుందని తెలిపారు. కాగా, వర్షాభావ పరిస్థితులు తలెత్తినా కూడా పట్టణాలు, నిర్దేశిత గ్రామాలకు తాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా ఈగలు, దోమల వ్యాప్తిని నివారించవచ్చుని, తద్వారా వ్యాధులు సోకకుండా కాపాడుకోవచ్చని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను గ్రామ పంచాయతీలు తప్పనిసరిగా అమలు చేయాలని అన్నారు. తడి, పొడి, శానిటరీ, ప్రత్యేక వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలన్నారు. ప్రత్యేక ఓటరు సవరణ(ఎస్.ఐ.ఆర్) కార్యక్రమం గురించి ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో కలెక్టర్ అవగాహన కల్పించారు. జూన్ 25 నుండి బీ.ఎల్.ఓలు ఇంటింటికి తిరుగుతూ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ నిర్వహిస్తారని, వారికి సహకరించాలని ప్రజలను కోరారు. ప్రతి ఒక్కరు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, మహిళలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకుంటూ ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ హితవు పలికారు. అర్హులైన వారు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ది పొందేలా చొరవ చూపాలన్నారు. గ్రామ సభలో మండల ప్రత్యేక అధికారి డీ.పీ.ఓ జయసుధ , తహసిల్దార్ లక్ష్మి నారాయణ,ఎంపిడిఓ డాక్టర్ కేశబోయిన వినయ్ కుమార్, స్థానిక అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రైతు పండించిన ప్రతి గింజను పభుత్వం కొంటుంది

**–ధాన్యం నిల్వలు, కొనుగోలు ప్రక్రియ పై ఆకస్మిక తనిఖీ**
**–జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్,**
**–కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

నాగర్కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): జూన్ 08 మండలంలోని చందుబట్ల గ్రామంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో నిల్వ ఉంచిన వరి ధాన్యాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ సోమవారం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యం నిల్వలు, వాటి భద్రత, నిర్వహణ విధానాలను వారు క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈసందర్భంగా రైస్ మిల్లులో నిల్వ చేసిన వరి ధాన్యం వివరాలను సంబంధిత అధికారులు కలెక్టర్కు వివరించారు. ధాన్యం నిల్వ చేసే గోదాముల సామర్థ్యం, తేమ శాతం, నాణ్యత పరిరక్షణ చర్యలు, రవాణా ఏర్పాట్లు, భద్రతా ప్రమాణాలపై అధికారులు ఆరా తీశారు.జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూడు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ధాన్యానికి ఎలాంటి నష్టం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ధాన్యం నిల్వల విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, రైతుల శ్రమకు తగిన విలువ దక్కేలా ధాన్యం నాణ్యతను కాపాడాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు మరియు ధాన్యం దిగుమతి ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా వాహనాల నుంచి ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేసి, రైతులు ఎక్కువసేపు నిరీక్షించాల్సిన పరిస్థితులు తలెత్తకుండా చూడాలని సూచించారు.అదేవిధంగా కొనుగోలు కేంద్రాల్లో ట్యాబ్ ఎంట్రీలను వెంటనే పూర్తి చేయాలని, ఎలాంటి ఆలస్యం లేకుండా డేటా నమోదు ప్రక్రియను సకాలంలో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమర్థవంతమైన సేవలు



అందిస్తూ, కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.అలాగే నిల్వల నిర్వహణలో పారదర్శకత పాటిస్తూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. ధాన్యం నిల్వ కేంద్రాల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ, ధాన్యం నిల్వ కేంద్రాలు, గోదాముల వద్ద భద్రతా ఏర్పాట్లను మరింత బలోపేతం చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. నిల్వల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలుచోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, రైతుల కష్టార్జిత పంట భద్రంగా నిల్వ ఉండేలా అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ తనిఖీలో జిల్లా పౌరసరపాలక శాఖ అధికారి నరసింహారావు, డి ఎం సివిల్ సప్లై రాజేందర్, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లు ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు మధు మరింత సేవ చేసే అవకాశాలు కల్పించాలి



సూర్యాపేట జూన్ 08:(విజన్ ఆంధ్ర)ప్రజలకు మధు మరింత సేవ చేసే అవకాశాలు కల్పించాలని అభిమానులు,సన్నిహితులు కోరారు.సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏలగబోయిన మధు యాదవ్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, సన్నిహితులు సేవా కార్యక్రమాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేయగా,మధ్యాహ్నం గాంధీనగర్లోని స్నేహ నిలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అవసరమైన వారికి చేయూతనివ్వడం గొప్ప సేవ అని, అన్ని దానాలకన్నా అన్నదానమే మహాదానం అని పేర్కొన్నారు. మధు యాదవ్ సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుంటూ ప్రజలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో మధు యాదవ్ నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుతూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు సేవ చేసే అవకాశాలు మరింత పెరగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎలగబోయిన నాగరాజు, ఎడ్ల ఉపేందర్, సింగం నరేష్, నామ రాజశేఖర్, సింగం జానిబాబు, చింతపల్లి రామరాజు, ఉపేందర్, ఎడ్ల బాలరాజు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# బురాన్ పల్లి గ్రామ అభివృద్ధి లక్ష్యంగా కృషి

# లక్షబాట వేయడానికి సహకరించాలి

- సీసీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలి
- అధిక వర్షపాతంతో కంది పత్తి పంట దిగుబడి రాలేదు
- ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన రైతులు
- గ్రామ సభలో బురాన్ పల్లి గ్రామ సర్పంచ్ రాథోడ్ రామ్ దాస్ వెల్లడి





వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 0 8 (విజన్ ఆంధ్ర) : పులుసు మామిడి గ్రామం నుండి బురాన్ పల్లి వరకు రోడ్డు నిర్మాణానికి సహకరించాలని బురాన్ పల్లి గ్రామ సర్పంచ్ రాథోడ్ రామ్ దాస్ ప్రత్యేక గ్రామసభ సాక్షిగా విజ్ఞప్తి చేశారు. నక్షబాట వదిలేందుకు రైతులు సహకరించినా పులుసుమమిడి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కిష్టయ్య, పీరంపల్లి గ్రామానికి చెందిన పీర్లకాడి బందయ్య కుమారుడు సహకరించడం జిల్లా కలెక్టర్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వికారాబాద్ మండల పరిధిలోగల బురాన్ పల్లి గ్రామంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక గ్రామ సభను సర్పంచ్ రాథోడ్ రామ్ దాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి డిపిఓ జయసుధ ఎంపిడిఓ డాక్టర్ కేశబోయిన వినయ్ కుమార్ డీఎస్పీ అంజయ్య సిఐ రఘుకుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గ్రామ సర్పంచ్ రాథోడ్ రాందాస్ మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని సభాముఖంగా తెలిపారు. కుమ్మరోని పొలం నుండి పరమేశుని గుట్ట వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. చేరి అనంతయ్య పొలం నుండి మంగలి అంజయ్య పొలం వరకు బిటి రోడ్డు నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మల్లన్నోళ్ల పెద్ద పరమయ్య ఇంటి నుండి పెద్ద మామిడి తోట వరకు సిసి రోడ్డు హనుమాన్ టెంపుల్ నుండి పోచమ్మ టెంపుల్ వరకు సిసి రోడ్డు పోచమ్మ టెంపుల్ నుండి శివాలయం టెంపుల్ వరకు సిసి రోడ్డు డీలర్ వెంకటస్వామి ఇంటి నుండి రాథోడ్ లాలయ్య ఇంటి వరకు సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సభాముఖంగా వేడుకున్నారు. కంది పత్తి పంట లు అధిక వర్షపాతంతో పూర్తిగా దెబ్బతిని రైతులు నష్టపోయారని గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పటేల్ మనోహర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. బురాన్ పల్లి తండాలో నాలుగు మినీ వాటర్ ట్యాంకులు బురాన్ పల్లి గ్రామంలో 6 మినీ వాటర్ ట్యాంకులు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అక్నాపురం నర్సింలు ఇంటిదగ్గర 7ప్త్రజా మోటర్ బిగించేందుకు వెంటనే నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో సమన్వయమే విజయానికి మార్గం -కలెక్టర్ అంకిత్



కొత్తగూడెం బ్యూరో జూన్ 09(విజన్ ఆంధ్ర)భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతితో కలిసి ప్రజల నుంచి వచ్చిన వినతులు, ఫిర్యాదులను స్వీకరించి పరిశీలించారు. జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామూహిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని అన్నారు. ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును బాధ్యతాయుతంగా పరిశీలించి, అర్హత మేరకు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తక్షణ పరిష్కారం సాధ్యమైన అంశాలను వెంటనే పరిష్కరించడంతో పాటు, మిగిలిన సమస్యలను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని పేర్కొన్న కలెక్టర్, ప్రతి సమస్య వెనుక ఉన్న మూల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజా సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని, ప్రజలు అవసరమైన ఆధార పత్రాలతో వినతులు సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని తెలిపారు.ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలని, ప్రజల సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కట్టుబడి పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంది

### సూర్యాపేట జిల్లా ఎస్పి కె నరసింప



సూర్యాపేట జూన్ 08:(విజన్ ఆంధ్ర)సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పి నరసింహ పిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు ఎస్పిని ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు.ఈ సందర్భంగా ఎస్పి నరసింహ ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అలాగే, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఆత్మ రక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుంది

### దేహదారుఢ్యానికి కరాటే అలవర్చుకోవాలి

### నారాయణపేట కలెక్టర్ సిహెచ్ ప్రియాంక



నారాయణపేట , జూన్ 8 ( విజన్ ఆంధ్ర) ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని నారాయణపేట కలెక్టర్ సిహెచ్ ప్రియాంక అన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో కరాటే లో బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థులను సోమవారం సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూమాస్టర్ కేశవ్ కరాటే అకాడమీలో బ్లాక్ బెల్ట్ సాధించిన.యం.అఖిల్.స్రవంతి మడివాల్, రాజేశ్వరి మడివాల్,దొరోల్ల భావేష్ నాయుడు,అర్జున్,లావణ్య,పొట్ట అభిరామ్,రీత్విక్ అద్వైత్, లకు సర్టిఫికెట్లు ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు.నారాయణపేట జిల్లాలో ఉండే పిల్లలు ప్రతి ఒక్కరు, ఒక విధిగా కరాటే నేర్చుకోవాలని అందుకే మన తెలంగాణ ప్రభుత్వం పాఠశాలల స్థాయిలోనే కరాటే నేర్పిస్తున్నామని కరాటే నేర్చుకుంటేనే దేహ దారుడ్యానికి మంచిదని కరాటే ప్రతి ఒక్కరికి ఆపద సమయంలో మిమ్మల్ని మీరు రక్షించుకునే వారు అవుతారని సూచించారు. దేవుల్లతో సమానమైన గురువులను పూజించాలని,పెద్దవారి పట్ల బాధ్యతతో మెలగాలని, బ్లాక్ బెల్ట్ పొందిన వారందరు భవిష్యత్తులో ఉచిత శిక్షణ అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టర్ అశోక్ మాస్టర్,అకాడమి మెంబర్ అశోక్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 0 8 (విజన్ ఆంధ్ర) : సీఎం ప్రజావాణి జిల్లా ప్రజావాణిలో పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులకు ఆదేశించారు. సీఎం ప్రజావాణి జిల్లా ప్రజావాణి ద్వారా అందిన ప్రజల వినతులు, ఫిర్యాదులకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులో పరిశీలించి, అర్హత ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. ఎలాంటి కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయో శాఖల వారీగా సమీక్షించి, ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.వజిల్లా లో మొత్తం 110 దరఖాస్తులు , పెన్షన్, గ్రామా పంచాయతి, విద్యా శాఖ, ఏ డి సర్వే , భూ సమస్యలు, వివిధ సమస్యలపై వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించమన్నారు. అధికారులు ప్రజల వినతులపై నిర్లక్ష్యం ప్రదర్శించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లు ఉమా శంకర్ ప్రసాద్, వెంకటాచారి, జాడ్ పి సి ఇ ఓ సుదీర్, డి ఆర్ డి ఏ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజావాణి విభాగ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించాలి



నారాయణపేట, జూన్ 8 (విజన్ ఆంధ్ర) ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రియాంక అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 26 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను,లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ కె. హరిత



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 8, విజన్ ఆంధ్రప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. రెబ్బెన మండల కేంద్రానికి చెందిన అంబిలపు కౌశిక్ కళ్యాణ్ తనకు దివ్యాంగుల పింఛన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. సిర్పూర్ – టి మండలం కొమ్ముగూడ గ్రామానికి చెందిన దుర్గం హోక్టు తమకు చెందిన వ్యవసాయ భూమిని కౌలుకు ఇస్తే కబ్జా చేసుకున్నాడని, తిరిగి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ మండలం నజ్రుల్ నగర్ కు చెందిన కవిత మండల్ తన భర్త ఎల్ ఐ సి లో భీమా ప్రీమియం తీసుకొని మరణించారని, భీమా డబ్బులు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ మండలం గుండి గ్రామానికి చెందిన దేశబోయిన నవీన్ తనకు వస్తున్న ఆసరా పింఛను డబ్బులు బ్యాంకు ద్వారా ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ మండలం అంకుశాపూర్ గ్రామానికి చెందిన పెరుగు కమలాబాయి తనకు చెందిన భూమిలో అక్రమంగా ఇండ్లు నిర్మిస్తున్నారని, ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. చింతలమానేపల్లి మండలం కర్జెల్లి గ్రామానికి చెందిన గందే శంకరయ్య గతంలో వచ్చిన ఆసరా పింఛన్ 2 నెలల నుండి రావడం లేదని, పింఛన్ పున: రుద్దరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం తుంగెడ గ్రామానికి చెందిన డొంగ్రి సంధ్య తన మానశికి దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెజ్జూర్ మండలం రెబ్బెన గ్రామానికి చెందిన మల్లేష్ తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ ఆర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రతి దరఖాస్తులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు.


## బడిబయటపిల్లలుప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి



నారాయణపేట, జూన్ 8 (విజన్ ఆంధ్ర) బడి ఈడు కలిగిన బడి బయట పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని జాజాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి అన్నారు. సోమవారం నారాయణపేట మండల పరిధిలోని అప్పి రెడ్డి పల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తిచేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి బడి ఈడు పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. 6–14 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరినీ బడిలో చేర్పించాలని, ఒక్కరూ బడి బయట ఉండవద్దని తల్లిదండ్రులకు అవగాహన కల్పించామన్నారు.పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్ యూనిఫామ్, మధ్యాహ్న భోజనం అన్నీ ఉచితం. బడి మానేసిన పిల్లలకు ప్రత్యేక బ్రిడ్జి కోర్సు ఉంటుందని తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా బడికి పంపాలి“ అని కోరారు. ప్రైవేట్ పాఠశాల కన్నా ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాలైన వసతులను కలిగి ఉంటాయని వాటిని తల్లిదండ్రులు. సద్వినియోగం చేసుకోవాలని అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో ఉన్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం భాను ప్రకాష్ లక్ష్మణ్ నరసింహ రఘురాంరెడ్డి ప్రతాప్ నిర్మల శశిరేఖ గ్రామంలోని తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు .

## నక్షసర్వేను ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి

### -ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు




వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 08 (విజన్ ఆంధ్ర) : నక్ష సర్వే ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తెలిపారు. సోమవారమ వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశము నిర్వహించారు. నక్ష (నేషనల్ జియో స్పాషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబీటెషన్స్) సర్వే ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు.నక్ష సర్వే పురోగతి తదితర అంశాలపై వివిధ జిల్లాల కలెక్టర్లతో సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల వీడియో కాన్ఫరెన్సు హాలు నుండి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి హాజరయ్యారు. ఆయా జిల్లాల కలెక్టర్లతో సీఎస్ మాట్లాడి.. సర్వే ఎక్కడి వరకు పూర్తి చేశారో ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ.. కేంద్ర సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో నక్ష కింద దేశంలోని 150 అర్బన్ లోకల్ బాడీస్ ను ఎంపిక చేశారని వెల్లడించారు. రాష్ట్రంలోని 10 మున్సిపాలిటీలు ఎంపిక చేశారని తెలిపారు. జూలై నెలాఖరులోగా మొత్తం సర్వే ప్రక్రియ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పకడ్బందీగా పూర్తి చేయిస్తామని,కోడంగల్ మున్సిపల్ పరిధిలో నక్ష కార్యక్రమం కింద 12 వార్డ్స్ కు గాను 7 వార్డ్స్ పూర్తి చేసి 121 బ్లాక్ లు పూర్తి అయ్యాయని, లాగిన్ లు పంపించామని ,మిగతా వాటిని ప్రతి ఒక్క ఇంటి సరిహద్దులు, ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు, ఇతర ఖాళీ స్థలాల విస్తీర్ణం వివరాలు పకడ్బందీగా పూర్తి చేయిస్తామని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్సు లో కోడంగల్ మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

## బ్రిడ్జిఏర్పాటుతో ప్రజలకు వాహనదారులకు సౌకర్యం



ఊట్కూర్, జూన్ 8 ( విజన్ ఆంధ్ర) ఊట్కూర్ మండల పరిధిలోని పెద్దపోర్ల, చిన్నపోర్ల గ్రామాల మధ్య చెరువు కట్టపై మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సహకారంతో రూ. 2కోట్లతో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తయితే ప్రజలు వాహనదారులకు సౌకర్యంగామారుతుందని పెద్దపోర్ల సర్పంచ్ బోయిన్ పల్లి కాశమ్మ అన్నారు. సోమవారం ఊట్కూర్ మండల పరిధిలోని పెద్దపోర్ల, చిన్నపోర్ల చెరువు కట్ట వద్ద చేపడుతున్న బ్రిడ్జి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా చెరువు కట్ట వద్ద బ్రిడ్జి లేకపోవడంతో వివిధ గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకువెళ్లగా నిధులు మంజూరు చేయడంతో పనులు వేగవంతంగా కొనసాగుతుందనిఅన్నారు. బ్రిడ్జి నిర్మాణంతో రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. పక్షం రోజుల్లో బ్రిడ్జి పనులు పూర్తికానున్నట్లుతెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఖీ, బిజెపి నాయకుడు నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో 5వ తరగతి ప్రవేశాలకు గడువు పొడిగింపు

### -ప్రవేశాలకు జూన్ 10 వరకు అవకాశం

### -జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం.రవీందర్

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూన్–08(విజన్ ఆంధ్ర)2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి పెద్దపల్లి జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (రెసిడెన్షియల్)లో 5వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తుల గడువును జూన్ 10 వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం.రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో 5వ తరగతి (రెసిడెన్షియల్)లో కేటాయించిన 73 సీట్లకు తగిన సంఖ్యలో దరఖాస్తులు అందకపోవడంతో మరో 20 సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల లోపు ఉండాలని తెలిపారు. అలాగే ఒక కుటుంబం నుంచి ఒక్క విద్యార్థి మాత్రమే ప్రవేశానికి అర్హుడని స్పష్టం చేశారు.ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయంలోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం నుంచి దరఖాస్తు ఫారాలను పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను కులం, ఆదాయం, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు తదితర అవసరమైన పత్రాలతో జతచేసి జూన్ 10 సాయంత్రం 5 గంటలలోపు అదే కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.మరిన్ని వివరాల కోసం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని లేదా 9014327045, 9989354155 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదు దారుల నుండి 22 ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ఆంధ్ర): జూన్ 08 జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారంపరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు సూచనలు చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి వచ్చిన 22 అర్జీలలో భూమికి సంబంధించిన అర్జీలు 07, తగు న్యాయం సంబంధించిన అర్జీలు 11, భార్యాభర్తల గొడవలు 04 స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ కి పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది.ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి,



పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్సేవల్నివినియోగించుకుంటూ,వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా సంగ్రామ్ సింగ్ జీ పాటిలెతెలియజేశారు.

# ఎన్టీఆర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను కఠినంగా శిక్షించాలి –టీడీపీ పేట నాయకులు



నారాయణపేట, జూన్ 8 ( విజన్ ఆంధ్ర) నల్గొండ జిల్లా హైదరాబాదు రోడ్డున ఉన్న తెలుగుదేశం పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరా మారావు విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను పట్టు కొని వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నారాయణపేట జిల్లా టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు.వారు విలేకరులతో మాటాడుతూ ఎన్టీఆర్ సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అనే స్ఫూర్తి తో బడుగు బలహీన వర్గాల కోసం టీడీపీ పార్టీని స్థాపించారన్నారు. బడుగు బలహీన వర్గాలను రాజ్యాధి కారంలో భాగస్వాములను చేసిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. ఇటువంటి నాయకుని విగ్రహానికి నిప్పు పెట్టడం చాలా దారుణం అన్నారు. దుండగులను పట్టుకుని ఇటువంటి పని చేయకుండా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా పార్లమెంట్ టిడిపి మాజీ ఉపాధ్యక్షుడు రాములు యాదవ్ ,దామరగిద్ద మండల పార్టీ అధ్యక్షుడు లింగరెడ్డిపల్లి సర్పంచ్ మొగులప్ప ,గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 65 దరఖాస్తులు



కామారెడ్డి బ్యూరో జున్ 8(విజన్ఆంధ్ర)ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రజల నుండి వినతులు స్వీకరించారు.జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలు, ఫిర్యాదులు, అభ్యర్ధనలకు సంబంధించిన దరఖాస్తులను కలెక్టర్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా మొత్తం 65 దరఖాస్తులు వచ్చాయని, అర్జీదారులు సమర్పించిన వినతులను జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ, వాటిని పరిశీలించి నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ప్రజావాణి లో అదనపు కలెక్టర్ యన్ వి గిరి, డి ఆర్ ఒ పాండు, జెడ్ పి సిఇఓ చందర్, జిల్లా అధికారులు, ఉన్నారు.

# గ్రామ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

## – సర్పంచ్ కత్తుల కళ్యాణి



నెల్లికుదురు. జూన్ 8, విజన్ ఆంధ్ర:గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై సహకరించాలని సర్పంచ్ కత్తుల కళ్యాణి యాకన్న అన్నారు. సోమవారం పర్యావరణ, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యా, వైద్యం, విద్యుత్, పారిశుధ్యం తదితర అంశాలపై అవగాహన కోసం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో తాగునీరు సమస్య ఉండకుండా తగిన చర్యలు తీసుకుంటామని ముందస్తు వర్షాకాల పరిస్థితులపై శానిటేషన్ సైడ్ కాలువల పూడికతీత సమస్యలపై గ్రామ పాలక మండలి పనులు చేపిస్తున్నామని పరిశుద్ధంలో భాగంగా డస్ట్ బిన్ వాడే విధానం అందరికీ అవగాహన అయ్యేటట్లుగా ప్రతి ఒక్కరికి చెప్తున్నామని, గ్రామ సేవ చేయడానికి మీ ముందుకు వచ్చామని మీరు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామంలోని ప్రతి ఒక్కరి సమస్యల పట్ల స్పందించి మీ వెన్నంటే ఉంటామని, గ్రామ అభివృద్ధి చేయడంలో గ్రామ ప్రజలు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, అధికారులు, నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# ప్రత్యేక సభల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 08,(విజన్ ఆంధ్ర)ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన గ్రామ/డివిజన్/వార్డు సభలలో ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల అమలు, ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 31, 32 డివిజన్లకు సంబంధించి లక్ష్మీ గార్డెన్స్ లో నిర్వహించిన డివిజన్ సభకు డిసిపి ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, మంచిర్యాల నగరపాలక సంస్థ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, 31వ డివిజన్ కార్పొరేటర్ సంపత్ రెడ్డి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రత్యేక గ్రామ/డివిజన్/వార్డు సభలు నిర్వహించి, పారిశుద్ధ్యం, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ, అరైవ్– అలైవ్, ఇందిరమ్మ ఇండ్లు, సంబంధిత అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఘన వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, తడి చెత్త, పొడి చెత్త, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు వేరువేరుగా సేకరించి నిర్వీర్యం చేయడం ద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా కొనసాగించినట్లయితే వ్యాధుల నియంత్రణ సులభతరం అవుతుందని, వర్షం వచ్చినప్పుడు లోతట్టు ప్రాంతాలలో నీరు నిల్వ కాకుండా ఉంటుందని తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్ల సహకారంతో ఇంటింటికి తిరిగి ఎన్యుమరేషన్ ఫారాల అందజేత, స్వీకరణ, చనిపోయిన, డబుల్, షిఫ్టెడ్ ఓటర్ల తొలగింపు ప్రక్రియ క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని



తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్– అలైవ్ కార్యక్రమం నిర్వహించడం ద్వారా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. విద్యావవస్థ బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని, గత సంవత్సరం లాగానే ఈ విద్యా సంవత్సరం కూడా ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించాలని తెలిపారు. 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుండి మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహార పథకం కూడా అందించడం జరుగుతుందని, జూనియర్ కళాశాలలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్యం, విద్య, మహిళా రక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల తహసిల్దార్ల దృష్టికి తీసుకురావచ్చని, ప్రజా సమస్యల పరిష్కారంపై అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేస్తుందని తెలిపారు.

**డిసిపి ఎగ్గడి భాస్కర్ మాట్లాడుతూ**ప్రజలందరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు, రోడ్డు భద్రత నియమాలు పాటించడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం ద్వారా అకస్మాత్తుగా జరిగే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. రాత్రి సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్ పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, బాలికల సంరక్షణ కొరకు షీ టీం సభ్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా చూడాలని, తెలిసిన వాళ్ళు ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగించినట్లు సమాచారం ఇస్తే వారిని డి–అడిక్షన్ సెంటర్ కు తరలించి కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఏదైనా ఇబ్బందులు తలెత్తితే 100 నెంబర్ కు డయల్ చేసి వెంటనే సమాచారం అందించడం ద్వారా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

**మేయర్ ధర్ని మధుకర్ మాట్లాడుతూ...**మంచిర్యాల నగరపాలక సంస్థ మేయర్ మాట్లాడుతూ "మంచిర్యాల శుభ్రత– ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రత" నినాదంతో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, వీధి దీపాలు, రోడ్ల మరమ్మత్తులు, త్రాగునీటి సదుపాయం, మురుగు కాలువల నిర్వహణ, తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ తదితర అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రజాపాలన ద్వారా ప్రజల వద్దకే అధికారులు వచ్చి సమస్యలు తెలుసుకోవడం జరుగుతుందని, ఎలాంటి అవినీతి, దళారీ వ్యవస్థకు అవకాశం లేకుండా పనులు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందించి సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల సంబంధిత ప్రొసీడింగ్స్ ను లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల సాధనకు కాళేశ్వరం వేదిక

## జర్నలిస్టులందరూ పెద్ద ఎత్తున తరలిరండి

భూపాలపల్లి జిల్లా 08 జూన్ (విజన్ ఆంధ్ర)జూన్ 9న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా జర్నలిస్టుల సమావేశం.. క్యాతం సతీష్ కుమార్జర్నలిస్టుల వృత్తి భద్రత, సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు జిల్లాలోని పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలనే లక్ష్యంతో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే ఐజేయూ) జయశంకర్ భూపాలపల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9న కాళేశ్వరంలో జిల్లా స్థాయి జర్నలిస్టుల సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి సామంతుల శ్యామ్, రాష్ట్ర హెల్త్ కమిటీ మెంబర్ సామల శ్రీనివాస్ తెలిపారు.మంగళవారం ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ మహాసభకు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేణుమాధవ్, కంకనాల సంతోష్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.ఈ సందర్భంగా జర్నలిస్టుల అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, గృహ స్థలాల కేటాయింపు, పెన్షన్, బీమా సదుపాయాలు, సంక్షేమ పథకాలు, వృత్తిపరమైన సమస్యలు, మీడియా రంగంలో నెలకొంటున్న సవాళ్లు, డిజిటల్ మీడియా యుగంలో జర్నలిస్టుల బాధ్యతలు వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే జర్నలిస్టుల సమస్యల



పరిష్కారానికి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై తీర్మానాలు ఆమోదించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.జిల్లా వ్యాప్తంగా పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఒకే వేదికపై చర్చించి వాటి పరిష్కారానికి సమిష్టి పోరాట కార్యాచరణ రూపొందించడంతో పాటు సంఘ బలోపేతం, సభ్యత్వ నమోదు, జర్నలిస్టుల ఐక్యత, వృత్తి గౌరవ పరిరక్షణ, యువ జర్నలిస్టులకు ప్రోత్సాహం వంటి అంశాలపై ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు వివరించారు.జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధన, వృత్తి పరిరక్షణ దిశగా కీలక మైలురాయిగా నిలవనున్న ఈ మహాసభకు జిల్లాలని జర్నలిస్టులందరూ పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలు, అభిప్రాయాలు, సూచనలు వెల్లడించి సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# టీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ వద్ద వినూత్న నిరసన



కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూన్ 08.ఈరోజు తెలంగాణ రక్షణ సేన పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో తెలంగాణ ధర్నా చౌక్ లో గ్యాస్ ధరలు తగ్గించాలని వినూత్న నిరసన తెలపడం జరిగింది.ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా నాయకులు సీనియర్ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్ హరిప్రసాద్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఒకవైపు ఆడవారికి అండగా ఉంటామంటూ బూటకపు ప్రకారం చేస్తూ గ్యాస్ ధరలు పెంచి పాత రోజుల విధంగా కట్టెలు పోయే దిక్కు అయ్యే విధంగా బిజెపి ప్రయత్నం చేస్తుందని వారు అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే గ్యాస్ ధరలు తగ్గించాలని కరీంనగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన బాధ్యులు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. ఈరోజు కరీంనగర్ లో స్థానిక తెలంగాణ చౌక్ లో ఈరోజు కట్టెల పొయ్యి మీద వంట చేసుకుని తమ నిరసనను తెలియజేశారు. మోడీ గారి ప్రభుత్వం వచ్చినప్పటినుండి గ్యాస్ ధరలను మూడు నెలలోనే మూడు విడతలుగా పెంచి బడుగు బలహీన వర్గాల నడ్డి విరిచే విధంగా పని చేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించి నిరుపేద ప్రజలకు అండగా ఉండాలని వారు అన్నారు లేనిపక్షంలో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో జిల్లాలో పెద్ద ఎత్తున మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం ఉంటుందని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు అంకం శివరాణి, అధివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, విద్యార్థి సంఘం జిల్లా నాయకులు చెన్నమల్ల చైతన్య, జిల్లా నాయకులు బుడిగె పరుశురాం గౌడ్, బసవేణి రాజేందర్, గాలిపెల్లి రత్నాకర్ చారి, జంగా అపర్ణ, కుతాడి రజిత, దాసరి అంజలి, లింగంపల్లి శ్రీనివాస్, కుతాడి పరుశురాం, నూతి సాయి చరణ్, శివసారం రాజ్ కుమార్, కొలిపాక గౌతమి, పల్లె శారద, గుగులోతు దివ్య, ద్యావ శారద, పూసాల పవన్ కుమార్, గుంజపడుగు పవన్ కుమార్, సబ్బు నాగరాజు, కొండపాక రాకేష్, తదితరులు పాల్గొన్నారు

# నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి

## –లాంగ్ పెండింగ్ కేసులను క్లియర్ చేయాలి
## –డి సి ఆర్ బి డీఎస్పీ మహేష్

నారాయణపేట , జూన్ 8 (విజన్ ఆంధ్ర) నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని,చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న కేసులను పరిష్కరించాలని డీఎస్పీ లు మహేష్, లింగయ్య సూచించారు.సోమవారం ఆ క్రైమ్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. జిల్లాలోని అన్ని సర్కిల్స్, పోలీస్ స్టేషన్లలో లాంగ్ పెండింగ్ కేసులు వెంటనే క్లియర్ చేయాలని, కేసుల దర్యాప్తు నాణ్యత, నేరల నియంత్రణ పై చర్యలు తీసుకొని ప్రజలకు మెరుగైన సేవలుఅందించాలి అని తెలిపారు.ఈ సందర్భంగా డీఎస్పీ లు మాట్లాడుతూ ప్రతి కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్ష పడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని, పోలీస్ అధికారులంతా బాధ్యతగా పని చేయాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని అన్నారు. పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, విసబుల్ పోలీసింగ్ విధులు నిర్వర్తించాలని తెలిపారు. నిషేధిత గంజాయి అక్రమరవాణా, మట్కా,జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్త సీసీ కెమెరాలను ఏర్పాటు, అవి నిరంతరం పనిచేసే




విధంగా మానిటర్ చేయాలని సూచించారు. దొంగతనల కేసుల్లో ప్రస్తుతం పోలీసు శాఖ వినియోగిస్తున్న సాంకేతికతను ఉపయోగించి లాంగ్ పెండింగ్ కేసులలోని నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేసి భాధితులకు త్వరతగతిన అందేలా చూడాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు.విలేజ్ పోలీసు అధికారులు గ్రామలలో పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతూ సామాజిక అంశాల పై అవగాహన కల్పించాలని తెలిపారు.జిల్లా పోలీస్ వ్యవస్థ పటిష్టతపై దృష్టి సారించాలనీ, ప్రతి అధికారి తాను బాధ్యత వహిస్తున్న ప్రాంతంలో నేరాలు జరగకుండా కృషి చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో సి ఐ లు భగవంత్ రెడ్డి, సైదులు ఎస్సైలు వెంకటేశ్వర్లు, సతీష్ రెడ్డి నవీద్, రాజు, అశోక్ బాబు, రాజు, బాలరాజు, రమేష్, రాము, రాజశేఖర్, రమేష్, పురుషోత్తం, నరేష్, సునీత, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# భగవాన్ దాస్ పోరాటంతోనే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ

## బీఆర్ జయంతి వేడుకలో వరంగల్ ఎంపీ కడియం కావ్య
## కోచ్ ఫ్యాక్టరీకి భగవాన్ దాస్ పేరు పెట్టాలి
## సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

హనుమకొండ జిల్లా ప్రతినిధి జూన్ 8 (విజన్ ఆంధ్ర): బీఆర్ భగవాన్ దాస్ పోరాటంతోనే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమ రూపం సంతరించుకుని నేడు నిజం కాబోతున్నదని వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. సోమవారం సీనియర్ కమ్యూనిస్టు యోధుడు, కార్మిక నాయకులు బీఆర్ భగవాన్ దాస్ 96వ జయంతి వేడుకలు హనుమకొండ అశోక జంక్షన్ లోని బీఆర్ భగవాన్ దాస్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తదితరులు బీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ భగవాన్ దాస్ పోరాటంతోనే కోచ్ ఫ్యాక్టరీ సాధ్యమై నేడు పూర్తి కాబోతున్నదని, తద్వారా ఈ ప్రాంతంలో వేలాది మంది యువతకు ఉపాధి,ఉద్యోగ అవకాశాలు అందనున్నాయని అన్నారు. అలాగే వరంగల్ కు తాగు నీరు, సాగునీటి కోసం బీఆర్ భగవాన్ దాస్ పోరాడాలని, భూ పోరాటాలు నిర్వహించి పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు సాధించి పెట్టారని అన్నారు. తన జీవిత కాలం బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన భగవాన్ దాస్ రాష్ట్ర స్థాయిలో సిపిఐకి పేరు తీసుకు వచ్చారని అన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ, సిపిఐ ఎప్పుడూ మిత్ర పక్షాలుగా కొనసాగుతూ రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణకు కలిసి ముందుకు సాగుతున్నాయని అన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి భగవాన్ దాస్ పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆయన పోరాటంతోనే కోచ్



ఫ్యాక్టరీ వచ్చిందని అన్నారు. బీఆర్ ఆశయాలకు అనుగుణంగా మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిస్తామని అన్నారు. భగవాన్ దాస్ చూపిన బాటలో కమ్యూనిస్టు కార్యకర్తలుగా ముందుకు సాగుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, భగవాన్ దాస్ కుమారులు డాక్టర్ బి. రాజ్ సిద్దార్థ, బీఆర్ లెనిన్, బిఆర్ఎస్ నాయకులు మేడిపల్లి శోభన్ బాబు, ఆవోపా జిల్లా అధ్యక్షులు డి. ఈశ్వరయ్య, జర్నలిస్టు సంఘాల నాయకులు తోట సుధాకర్, కేకే, పి. అశోక్, గోకారపు శ్యామ్, బొడిగె శ్రీను,సిపిఐ జిల్లా నాయకులు మునిగాల బిక్షపతి, నేదునూరి రాజమౌళి, ఏదునూరి వెంకట్రాజం, కొట్టెపాక రవి, బికేఎంయూ జాతీయ నాయకులు మోతె లింగారెడ్డి, నాయకులు గుండె బద్రి, కండె నర్సయ్య, మాలోతు శంకర్ నాయక్, ఎం. స్వామి చరణ్, రవీందర్,జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మా తాతల.. తండ్రుల సమాధులు తొలగించవద్దు

## అభివృద్ధికి మేము వ్యతిరేకం కాదు
## దళితులపై దాడులు చేసే ఊరుకునేది లేదు
## గోపాల్ పూర్ ఉర చెరువు దళిత బాధితుల ఆవేదన


హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 8 ( విజన్ ఆంధ్ర) అభివృద్ధి పేరుతో తమ తాతల తండ్రుల సమాధులను తొలగిస్తే ఊరుకునేది లేదు అని గోపాల్పూర్ ఊర చెరువు దళిత బాధితులు హెచ్చరించారు. సోమవారం హనుమకొండ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోపాల్పూర్ ఊర చెరువు దళిత బాధితులు మాట్లాడుతు అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని కానీ అభివృద్ధి పేరుతో తమ తాతల తండ్రుల సమాధులను తొలగిస్తే తమ ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసినట్లే అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు బంధువులు తమపై పగబట్టి దళితులైన తమ బంధువుల సమాధులు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తాము




శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపడితే పోలీసులు ఇష్టం వచ్చినట్లు దాడి చేస్తూ తమను అరెస్టు చేశారని తమలో చాలామందికి గాయాలయ్యాయని అన్నారు. అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టర్ కు తమ పూర్వికుల సమాధులు తొలగించకుండా అభివృద్ధి పనులు కొనసాగించాలని వినతి పత్రం అందించారు

# పంట అవశేషాలకు నిప్పు పెట్టవద్దు

నారాయణపేట జూన్ 8 (విజన్ ఆంధ్ర) పంట అవశేషాలకు నిప్పు పెట్టవద్దని, ఒకవేళ నిప్పు పెడితే రూ.5000 నుంచి 25 వేల జరిమానా విధించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక తెలిపారు. సోమవారం జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంట అవశేషాలను కాల్చ వద్దు – ప్రకృతిని కాపాడండి అంటూ రైతులకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన కరపత్రాలను ప్రజావాణి హాల్ లో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులు పంట అవశేషాలను కాల్చకుండా వ్యవసాయ శాఖ ఏవోలు, ఏ ఈ వో లు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల కలిగే నష్టాలను రైతులకు క్లుప్తంగా



వివరించాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియా నాయక్, డీఆర్డీవో వెంకట్ రాములు, డీ ఈ వో గోవింద రాజులు, ఎస్సీ కార్పొరేషన్ ఈ డీ అబ్దుల్ ఖలీల్, జిల్లా మత్స్య శాఖ అధికారి రెహమాన్, డీ పీ ఆర్ వో రషీద్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్-2026 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## -జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్




హనుమకొండ జిల్లా ప్రతినిధి జూన్ 8 (విజన్ ఆంధ్ర)ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న నీట్–2026 ( నీట్ -యు జి ) ప్రవేశ పరీక్షలను ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో నీట్ పరీక్ష నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసిన 12 పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, భద్రతా చర్యలు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ నిర్వహణ, వైద్య సేవలు తదితర అంశాలపై కలెక్టర్ అధికారులతో విస్తృతంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నీట్ పరీక్ష దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన పరీక్ష అని, అందువల్ల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి పరీక్షా కేంద్రంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా, తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు, తగిన బెంచీలు, ఫ్యాన్లు, లైటింగ్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతలు కట్టుదిట్టంగా నిర్వహించాలని, ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని పోలీసు శాఖ అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు సమయానికి కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన మార్గదర్శకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రతి కేంద్రంలో ప్రథమ చికిత్స సదుపాయాలు, అవసరమైన వైద్య సిబ్బంది, అత్యవసర సేవలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. పరీక్ష నిర్వహణలో పాల్గొనే కేంద్ర నిర్వాహకులు, ఇన్విజిలేటర్లకు మార్గదర్శకాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని, పరీక్ష గోప్యత, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రశ్నాపత్రాల రవాణా, భద్రపరిచే ప్రక్రియలో నిర్దేశిత నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. నీట్ పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో నీట్ పరీక్ష జిల్లా కోఆర్డినేటర్, నోడల్ అధికారి బిక్షపతి, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి గౌరీశంకర్, ఈడీఎం శ్రీధర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మాతా శిశు ఆసుపత్రిలో పెట్రోల్ దొంగల బీభత్సం


## ద్విచక్ర వాహనాల పైపులు కోసి పెట్రోల్ ఎత్తుకుపోతున్న గుర్తుతెలియని వ్యక్తులు





కొత్తగూడెం బ్యూరో జూన్ 09(విజన్ ఆంధ్ర)రామవరం ప్రాంతంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఆవరణలో రాత్రి వేళల్లో పెట్రోల్ దొంగలు రెచ్చిపోతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రి ప్రాంగణంలో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాల పెట్రోల్ పైపులను కోసి, అందులోని ఇంధనాన్ని దొంగిలిస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే రోగులు, వారి కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది, ఇతర ఉద్యోగులు తమ వాహనాలను ఆసుపత్రి ఆవరణలోనే నిలిపి ఉంచుతుంటారు. అయితే ఉదయం వాహనాలను స్టార్ట్ చేయడానికి ప్రయత్నించినప్పుడు పెట్రోల్ లేకపోవడం, పైపులు కోసివేయబడటం వంటి ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని పలువురు వాపోతున్నారు. ప్రజలకు భరోసా కల్పించాల్సిన ఆసుపత్రి ప్రాంగణంలోనే వరుసగా పెట్రోల్ దొంగతనాలు జరగడం రోగులు, సిబ్బంది, స్థానికుల్లో భయాందోళనలు కలిగిస్తోంది. ఇకనైనా సంబంధిత అధికారులు అప్రమత్తమై భద్రతా లోపాలను సరిదిద్ది ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# రహావీర్ పథకానికి రాపిడో మోర్త్ భాగస్వామ్యం



హైదరాబాద్, జూన్ 08 (విజన్ ఆంధ్ర) : రాపిడో, మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్పోర్ట్, హైవేస్(మోర్త్) రహావీర్ పథకంపై దేశ వ్యాప్తంగా అవగాహన పెంచేందుకు భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు రాపిడో కో ఫౌండర్ అరవింద్ సంక సోమవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని నితిన్ గాడ్కరి, మోర్త్ సెక్రటరీ, అడిషనల్ సెక్రటరీలు మరియు అరవింద్ సంక సమక్షంలో ప్రారంభించచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 4 లక్షల మందికి పైగా రాపిడో కెప్టెన్లు ఏకకాలంలో 'రహావీర్ ప్రతిజ్ఞ' స్వీకరించి గిన్నిస్ వరల్డ్ రికార్డు నెలకొల్పినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదం జరిగిన తొలి గంట(గోల్డెన్ అవర్)లో బాధితులకు సకాలంలో సహాయం అందించేలా ప్రజలను ప్రోత్సహించడమే రహావీర్ పథకం లక్ష్యం అని తెలిపారు. రహావీర్ పథకంపై అవగాహన కోసం రాపిడో తన టెక్నాలజీ ప్లాట్‌ఫారమ్ 400కు పైగా నగరాల్లోని కెప్టెన్ నెట్‌వర్క్‌ను వినియోగించి ఇన్-యాప్ ఎడ్యుకేషన్, సోషల్ మీడియా ప్రచారాలు, కెప్టెన్ అవుట్‌రీచ్ కార్యక్రమాలు నిర్వహించనుందని తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

## ప్రజావాణి దరఖాస్తులు 77

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్..



సూర్యాపేట జూన్ 08:(విజన్ ఆంధ్ర)ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అధికారులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబందించి 43 దరఖాస్తులు, డిడబ్ల్యుఓ 4, డీపీఓ 3, మున్సిపాలిటీ 3 మిగిలిన 24 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని మొత్తం 77 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని కలెక్టర్ ఈ సందర్బంగా అన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్డిఓ పి డి సన్యాసయ, డిఎంహెచ్ఓ వెంకటరమణ, పిడి హౌసింగ్ సిద్ధార్థ్, సిపిఓ కిషన్ నాయక్, డి ఏ ఓ శ్రీధర్ రెడ్డి, డిఇఓ అశోక్ , స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు ఇతర జిల్లా అధికారులు తదితరులు హాజరైనారు.

# పత్రికా విలేకరుల పిల్లలకు 100 శాతం ఫీజు రాయితీ కల్పించాలి

## జిల్లా కలెక్టర్‌కు టీయూడబ్ల్యూజేయూ వినతి - సానుకూల హామీ



వరంగల్ జూన్ 8 (విజన్ ఆంధ్ర)గుర్తింపు పొందిన వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు జిల్లాలోని ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 100 శాతం ఫీజు రాయితీ కల్పించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజేయూ) వరంగల్ జిల్లా శాఖ జిల్లా కలెక్టర్‌ను కోరింది. టీయూడబ్ల్యూజేయూ జిల్లా కన్వీనర్ మిర్జా ఫతేహుల్లా బేగ్ నాయకత్వంలో జర్నలిస్టుల ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ప్రజలకు సమాచారాన్ని చేరవేయడంలో,ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ,జిల్లాస్థాయిలో పనిచేస్తున్న అనేక మంది జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పెరుగుతున్న విద్యా ఫీజుల కారణంగా తమ పిల్లల చదువుల భారాన్ని భరించడం కష్టంగా మారిందని,అందువల్ల గుర్తింపు పొందిన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో పూర్తి ఫీజు మినహాయింపు కల్పించాలని కోరారు. ఈ వినతిపై స్పందించిన జిల్లా కలెక్టర్ సమస్యను సానుకూలంగా పరిశీలిస్తామని,దీనిపై త్వరలోనే తగిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ సానుకూల స్పందనపై జర్నలిస్టు సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ,జర్నలిస్టుల పిల్లల విద్యా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన అనుకూల నిర్ణయం తీసుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ అబ్దుల్ రజాక్ అక్రమ్,మహమ్మద్ ఫాజలుల్ రెహ్మాన్ వాజిద్,మహమ్మద్ రియాజ్‌ఉద్దీన్,మహమ్మద్ నాయబ్ రసూల్,మొహమ్మద్ మోమిన్,మహమ్మద్ ముస్తాబా రాజా ఉర్ రెహ్మాన్,సయ్యద్ సిదిక్,మహమ్మద్ అమీర్ ముదసిర్ నాజ్,షేక్ జావిద్ తదితరులు పాల్గొన్నారు...

# గుత్తేదారుల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి

## ఈ నెల 18 న చలో హైదరాబాద్

## బిల్డర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు సత్యమూర్తి




మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 08,(విజన్ ఆంధ్ర)ప్రభుత్వానికి చెందిన వివిధ నిర్మాణా పనులకు సంబందించిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని బిల్డర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు వేముల సత్యమూర్తి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు సిరాజ్ ఉర్ రహమాన్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. కాంట్రాక్టర్ల పెండింగ్ బకాయిలను సీనియార్టీ ప్రకారం ప్రభుత్వం చెల్లించాలని ముందుగా పనులు పూర్తి చేసి సంవత్సరాలుగా బిల్లుల కోసం ఎదురుచూస్తున్న కాంట్రాక్టర్లకు ప్రాధాన్యత ఇవ్వాలని వారు కోరారు. గతంలో కాంట్రాక్టర్ల సంఘం పలుమార్లు ప్రభుత్వానికి వినతిపత్రం అందించినప్పటికీ మా అభిప్రాయాలను తగిన విధంగా పరిగణలోకి తీసుకోలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం నుండి రావలసిన నిధుల చెల్లింపులు ఆలస్యం కారణంగా అనేకమంది కాంట్రాక్టర్లు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, పలువురు ఆత్మహత్యలకు పాల్పడగా మరికొందరు గుండెపోటుకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు మాత్రమే కాకుండా కాంట్రాక్టర్ పనులపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది ఉద్యోగులు, ఇంజనీర్లు, సూపర్వైజర్లు, అకౌంటెంట్లు, యంత్రాల ఆపరేటర్లు, డ్రైవర్లు, కార్మికులు మరియు నిర్మాణ సామాగ్రి సరఫరాదారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నిర్మాణరంగంపై ఆధారపడిన కాంట్రాక్టర్లు రోడ్డున పడే పరిస్థితి నెలకొందని అన్నారు. కాంట్రాక్టర్ల హక్కులను కాపాడేందుకు వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధించేందుకు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టర్లకు పిలుపునిస్తూ ఈనెల 18న చలో హైదరాబాద్ నిర్వహించే కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కాంట్రాక్టర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమం లో భాగస్వాములమని అన్నారు. ప్రభుత్వం చేపట్టినటువంటి రోడ్లు, భవనాలు, సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి పథకాలు ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణం ద్వారా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కాంట్రాక్టర్లు విశేషంగా దోహదపడుతున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కాంట్రాక్టర్లను ఆదుకొని పెండింగ్ బిల్లులను క్రమసంఖ్య ప్రకారం విడుదల చేసి నిర్మాణ రంగాన్ని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మాజీ రాష్ట్ర చైర్మన్ బి సుగుణాకర్ రావు, మాజీ స్టేట్ చైర్మన్ కటుకూరి దేవేందర్ రెడ్డి, స్టేట్ చైర్మన్ యు.సురేందర్, స్టేట్ అడ్వైజర్ కే. ప్రభాకర్ రెడ్డి, ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్, జనగామ చైర్మన్ లు రామారావు, రవీందర్రావు, మనోజ్, జితేందర్రావు, వంశీకృష్ణ, వివిధ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# ఇంటర్‌లింక్ లైన్ వ్యవస్థతో ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా

## ఉత్తమ్ జాడే ఎస్ఈ..




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి మే 8 విజన్ ఆంధ్రవినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఉత్తమ్ జాడే సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆసిఫాబాద్ తెలిపారు. ఏదైనా ఒక సబ్‌స్టేషన్ , లైన్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయినా , ప్రకృతి వైపరీత్యాలు, గాలివానలు, వరదలు, అత్యవసర మరమ్మతులు లేదా ఇతర సాంకేతిక కారణాల వలన ఏర్పడే విద్యుత్ అంతరాయాలను నివారించడానికి వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ఆధునిక ఇంటర్‌లింక్ లైన్ (అనుసంధాన) వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. లిఅసలు ఏమిటి ఇంటర్‌లింక్ లైన్ వ్యవస్థ?సాధారణంగా ఒక విద్యుత్ లైన్‌లో లోపం ఏర్పడితే ఆ పరిధిలోని వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. అయితే ఇంటర్‌లింక్ లైన్ వ్యవస్థ ద్వారా ఒక 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను మరో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌తో, ఒక 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను సమీపంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌తో, అలాగే ఒక 33 కేవీ లైన్‌ను మరో 33 కేవీ లైన్‌తో అనుసంధానం చేయడం జరుగుతుంది. దీని ఫలితంగా ఒక మార్గంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సందర్భంలో వెంటనే ప్రత్యామ్నాయ మార్గం ద్వారా విద్యుత్‌ను సరఫరా చేయగలుగుతారు. దీంతో వినియోగదారులకు విద్యుత్ అంతరాయాలు గణనీయంగా తగ్గడమే కాకుండా, అత్యవసర పరిస్థితుల్లో కూడా నిరంతరాయ విద్యుత్ సరఫరా కొనసాగుతుంది. అదేవిధంగా రెండు 33 కేవీ లైన్ల మధ్య కూడా ఇంటర్‌లింకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశామని మరియు ఐదు ఇంటర్లింకింగ్ లైన్ ల పనులు పురోగతిలో వున్నాయి , దీనివల్ల విద్యుత్ సరఫరాలో మరింత స్థిరత్వాధించగలిగామని పేర్కొన్నారు. ఈ ఇంటర్‌లింక్ వ్యవస్థ ద్వారా వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించడంతో పాటు, ఏదైనా లైన్‌లో లోపం ఏర్పడినప్పుడు లేదా నిర్వహణ పనులు చేపట్టాల్సిన సందర్భంలో ప్రత్యామ్నాయ మార్గం ద్వారా విద్యుత్‌ను కొనసాగిన్తూ మరమ్మతులు సులభంగా నిర్వహించగలుగుతున్నామని తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా ఈ వ్యవస్థను విస్తరించేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించి దశలవారీగా అమలు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని ఈ సందర్భంగా సూపరింటెండింగ్ ఇంజనీర్ స్పష్టం చేశారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా యూపీహెచ్‌సీ రామవరంలో అవగాహన కార్యక్రమం


## మన ఆరోగ్యం మన చేతుల్లోనే - డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం రాథోడ్



కొత్తగూడెం బ్యూరో జూన్ 09( విజన్ ఆంధ్ర) ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామవరం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ముఖ్య అతిథిగా హాజరై పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మన ఆరోగ్యం మన చేతుల్లోనే" అనే సందేశంతో పరిశుభ్రమైన పరిసరాలు, ఆరోగ్యకరమైన జీవనశైలి, పర్యావరణ పరిరక్షణ సమాజ ఆరోగ్యానికి అత్యంత అవసరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం, ప్రపంచ మెదడు కణితుల దినోత్సవం, ప్రపంచ సముద్రాల దినోత్సవం ప్రాముఖ్యతను వివరించిన ఆయన, "ఆర్‌ఆర్‌ఆర్ రిడ్యూస్, రీయూజ్, రీసైకిల్" విధానాన్ని పాటించడం ద్వారా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని సూచించారు. వర్షాకాలంలో దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణపై ప్రత్యేకంగా మాట్లాడిన డీఎంహెచ్‌వో, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ప్రతి శుక్రవారం "డ్రై డే" పాటించాలని సూచించారు. కూలర్లు, టైర్లు, కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ కవర్లు, ఖాళీ సీసాలు, పూల కుండీల్లో నిల్వ ఉండే నీటిలో దోమలు పెరిగి మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, బోదకాలు, మెదడువాపు వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. నీటి గుంటల్లో కిరోసిన్ లేదా వాడిన ఇంజిన్ ఆయిల్ పోయడం ద్వారా దోమల లార్వాను నివారించవచ్చని తెలిపారు. చిన్న దోమ కాటు కూడా ప్రాణాంతక వ్యాధులకు కారణమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాగే యాంటీ డయేరియా మాసం సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. మరుగుదొడ్లు ఉపయోగించిన తర్వాత, ఆహారం తయారు చేసే ముందు, పిల్లలకు ఆహారం పెట్టే ముందు తప్పనిసరిగా సబ్బుతో చేతులు కడుక్కోవాలని సూచించారు. ఐదేళ్లలోపు పిల్లల్లో డయేరియా లక్షణాలు కనిపిస్తే వెంటనే ఓఆర్ఎస్, జింక్ మాత్రలు అందించి సమీప ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు పొందాలని తెలిపారు. 14 సంవత్సరాల వయస్సు గల కిశోర బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాముఖ్యతను వివరించిన డాక్టర్ తుకారాం రాథోడ్, ఈ టీకా ద్వారా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి బాలికకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమం ముగింపులో యూపీహెచ్‌సీ ప్రాంగణంలో మొక్క నాటి పచ్చదన పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. "మన ఆరోగ్యం, పర్యావరణ ఆరోగ్యం పరస్పరం అనుసంధానమై ఉన్నాయి. పర్యావరణాన్ని కాపాడితేనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలం" అని డాక్టర్ తుకారాం రాథోడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేటర్లు పద్మ, శంకర్, సుధాకర్ రాజు, శంకరమ్మ, కమ్యూనిటీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, రాజేశ్వరి, దిలీప్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రైతులకు లాభసాటి పంటలపై అవగాహన కల్పించాలి

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట జూన్ 08:(విజన్ ఆంధ్ర)తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకే 'ప్రజా పాలన ప్రగతి నివేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. సూర్యాపేట మండలం రామన్నగూడెం గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూప్రభుత్వం విద్యా, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఇందులో భాగంగానే 99 రోజుల పాటు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజా పాలనలో భాగంగా అధికారులు నేరుగా ప్రజల వద్దకే వెళ్లి, వారి సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కరిస్తారని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేరాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా లాభసాటి పంటలుప్రస్తుత సీజన్‌లో మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు సాంప్రదాయ వరి సాగుకు ప్రత్యామ్నాయంగా లాభసాటిగా ఉండే ఇతర పంటలపై దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. రానున్న వర్షాకాలంలో ఎల్నీనో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిందని గుర్తుచేశారు. వర్షాలు సకాలంలో పడకపోతే, వరి పంట చేతికొచ్చే సమయానికి ఆశించిన దిగుబడి రాక రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ నష్టాలను నివారించేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా.. విడతల వారీగా ఎలాంటి ప్రత్యామ్నాయ పంటలు వేస్తే లాభదాయకంగా ఉంటుందో వ్యవసాయ అధికారులు రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తారని కలెక్టర్ తెలిపారు. ఓటర్ జాబితాలో పేరు నమోదు కోసం తమ ఇళ్లకు వచ్చే బీఎల్‌ఓల దగ్గర ఎన్యుమరేషన్ ఫామ్ పూర్తి చేసి అందించాలని కోరారు. అలాగే, పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే వారికి నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం అందడం ఎంతో కీలకమని, ఆ దిశగా తల్లిదండ్రులు, అధికారులు కృషి చేయాలన్నారు. రాబోయే రోజుల్లో రామన్నగూడెం గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచి, ఒక ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ నెల 25 లోపు బిల్లులు సమర్పించాలిగ్రామంలోని వార్డుల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను ఈ నెల 25వ తేదీ లోపు సబ్మిట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, ఎంపీడీవో బాలకృష్ణ, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక భారాలు తగ్గించాలి

- ఎం సిపిఐ( యూ) నేత జి చంద్రయ్య.
- రాష్ట్రపతికి కలెక్టర్ ఈవో ద్వారా మెమోరాండం
- కలెక్టరేట్ ముందు ధర్నా.



ములుగు జూన్ 08 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : కేంద్ర ప్రభుత్వం ప్రజలపై మోపుతున్న ఆర్థిక భారాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎం సి పి ఐ (యు) పార్టీ ములుగు జిల్లా కార్యదర్శి జి. చంద్రయ్యలి డిమాండ్ చేశారు. ఆ పార్టీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ములుగు కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కు మెమోరాండం రూపొందించి జిల్లా కలెక్టర్ ఈవో ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో జి. చంద్రయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలతో రైతులు, కార్మికులు, ఆదివాసీలపై తీవ్ర భారాలు మోపుతోందన్నారు. పెట్రోల్, డీజిల్, సహజవాయువు, ఎరువుల ధరలు పెంచి సామాన్య ప్రజల జీవితాలు దుర్భరం చేశారని ఆరోపించారు. అమెరికాతో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలు రద్దు చేసుకోవాలని కోరారు. రైతులకు జ2+50% మద్దతు ధర ప్రకటించాలి, పెంచిన ఎరువుల ధరలు తగ్గించాలి, రైతు-వ్యవసాయ కార్మికుల బ్యాంకు రుణాలు మాఫీ చేయాలి, 60 ఏళ్లు దాటిన వారికి నెలకు రూ. 20,000 సామాజిక భద్రత కల్పించాలి. మహిళలు, ఆదివాసీలపై దాడులు అరికట్టాలని, ఇరాన్, క్యూబా, వెనిజులాపై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదాసాదిరెడ్డి, రాస రాజన్న, వడ్లూరు వెంకన్న, ఆవుల రాజేష్, ఆయితే సూరయ్య, కామ రాయమల్లు, కామ రవి, బిల్ల రమేష్, ఆరేపల్లి సదయ్య, ముక్కామల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# 'శీలావీ' సాహిత్య, చిత్రకళా పురస్కారాలు ప్రధానం



హైదరాబాద్ జూన్ 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్) : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ కళా సంస్థ "శీలావీ సాహిత్య చిత్రకళా వేదిక" సభ్యులు, కార్యక్రమ నిర్వాహకులు శీలా సుభద్రాదేవి, శీలా పల్లవి, ఆశ్లేష ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం రవీంద్రభారతి మొదటి అంతస్తు, కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్ లో 'శీలావీ' అవార్డుల ప్రదానం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సాహితీమూర్తి నెల్లుట్ల రమాదేవి అధ్యక్షత వహించగా, ప్రత్యేక అతిథిగా రచయిత్రి వారణాసి నాగలక్ష్మి హాజరై శీలావీ వీర్రాజు నవలా పురస్కారాన్ని రచయిత్రి (నీలంపురాశి) చంద్రలత కి అందజేసి సత్కరించారు, అలాగే శీలావీ చిత్రకళా పురస్కారాన్ని పగిడిచెంబుల మనీషా కు ప్రదానం చేసి సత్కరించారు. నీలంపురాశి చంద్రలత నవలా పరిచయం సమ్మెట ఉమాదేవి, చిత్రకారిణి మనీషా పరిచయం డాక్టర్. రేఖ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సాహితీవేత్తలు, కళా ప్రియులు, బంధుమిత్రులు పాల్గొన్నారు

# రసరమ్యంగా "భక్త పోతన్న నాటకం", అలరించిన "జానపద సంగీత నృత్యాలు"



హైదరాబాద్ జూన్ 2026 విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ విశ్వనాథ్ ) : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ నిర్వహిస్తున్న తెలంగాణ ప్రజాకళ 99 రోజుల సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనలో భాగంగా 67 వ రోజు "పాల్కురికి సోమన్న మూల" వేదికపై శనివారం జనగామ నెల్లుట్ల ఫౌండేషన్ వారిచే "భక్త పోతన పౌరాణిక నాటకం" ప్రేక్షకులని ఆసాంతం ఆకట్టుకుంది. ఈ పౌరాణిక నాటకం రచన కీర్తిశేషులు పి.ఎస్.ఆర్. ఆంజనేయులు చేశారు. దర్శకత్వం ఎం.ఎస్.ఆర్.కె చేశారు. ముందుగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు జానపద, సామాజిక చైతన్య గీతాలు ఆలపించారు. సాంస్కృతిక మహోత్సవంలో భాగంగా 68 వ రోజున ముందు తెలంగాణగా సాంస్కృతిక సారథి కళాకారులు జానపద, సామాజిక చైతన్య గీతాలతో సభను ఉత్సాహపరిచారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమం గ్యార యాకన్న కళా బృందంచే తెలంగాణ అమరవీరులను యాది జేసుకుంటూ ఆలపించిన గీతాలు. సిద్దిపేట్ జిల్లా గణేష్ కళా బృందం శ్రవణానందకరంగా పాడిన పాటలు ప్రేక్షకులను మైమరపింపజేసాయి. ఈ కార్యక్రమాలకు శ్రీనివాస్ రాజు, విద్యానందాచారి రేలారే ప్రసాద్ వ్యాఖ్యాతలగా వ్యవహరించి విజయవంతంగా నడిపించారు.

# ధాన్యం దించుకునే ప్రక్రియను వేగవంతం చేయాలి

- వనపర్తి అదనపు కలెక్టర్ టి. వినోద్ కుమార్



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 8 (విజన్ ఆంధ్ర) : వనపర్తి జిల్లా నుండి కేటాయించిన వరి ధాన్యాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరగా అన్‌లోడ్ చేసుకోవాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్ ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ జోగులాంబ గద్వాల జిల్లాలోని జగదంబ, జోగులాంబ, శ్రీ వేంకటేశ్వర మరియు శ్రీ బాలాజీ రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వనపర్తి జిల్లాకు సంబంధించిన ధాన్యం ఈ మిల్లులకు కేటాయించిన నేపథ్యంలో, అక్కడ జరుగుతున్న అన్‌లోడింగ్ ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లుల్లో వేగంగా దించుకోవాలని స్పష్టం చేశారు. మిల్లుల వద్ద లారీల నిలిపివేతను తగ్గించేందుకు గాను హమాలీల (కార్మికుల) సంఖ్యను తక్షణమే పెంచుకోవాలని మిల్లర్లకు చెప్పారు. మిల్లుకు వచ్చిన ధాన్యం లారీలను ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేస్తూ రోజువారీ దిగుమతి సామర్థ్యాన్ని పెంచాలని, ఎక్కడా లారీలు ఎక్కువ సమయం వేచి ఉండకుండా చూడాలని అధికారులను, మిల్లర్లను ఆదేశించారు. ఈ తనిఖీల్లో సంబంధిత రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు మరియు రైస్ మిల్లుల ప్రతినిధులు పాల్గొన్నారు.






కాప్రా మండల నూతన తహసీల్దార్ ని తన కార్యాలయంలోసోమవారం నాడు మర్యాద పూర్వకంగా కలసి పూలబొకే ఇచ్చి, శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ నాయుడు, ప్రవీణ్, రామ్ రెడ్డి, సోమయ్య గార్లు పాల్గొని పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

**కాప్రా / జూన్ 08 (విజన్ ఆంధ్ర ప్రతినిధి ) :**

# మొక్కలు నాటడం గొప్ప... వాటిని కాపాడడం అంతకంటే గొప్పది

## - మొక్కల సంఖ్య కాదు.. బతికే మొక్కలే అభివృద్ధికి ప్రమాణం




కొత్తగూడెం బ్యూరో జూన్ 08 (విజన్ ఆంధ్ర) : ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, ఉష్ణోగ్రతల పెరుగుదల, అడవుల క్షీణత వంటి సమస్యల నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం అత్యంత అవసరంగా మారింది. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, ప్రజాప్రతినిధులు, వివిధ సామాజిక సంఘాలు ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభమైన వెంటనే లక్షల సంఖ్యలో మొక్కలు నాటుతున్నామని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటిస్తుంటారు. అయితే మొక్కలు నాటడం వరకు మాత్రమే పరిమితమవుతున్న ఈ కార్యక్రమాలు, వాటి సంరక్షణ విషయంలో మాత్రం ఆశించిన స్థాయిలో ఫలితాలను ఇవ్వడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొక్కలు నాటడం ఒక మంచి పరిణామమే అయినప్పటికీ, వాటిని చెట్లుగా పెంచడం మరింత ముఖ్యమైన బాధ్యత. అనేక ప్రాంతాల్లో మొక్కలు నాటిన తర్వాత వాటి పరిస్థితిని పట్టించుకునే వారు లేకపోవడం వల్ల కొద్ది రోజుల్లోనే అవి ఎండిపోతున్నాయి. నీరు లేకపోవడం, రక్షణ కంచెలు ఏర్పాటు చేయకపోవడం, పశువుల బారిన పడటం, సరైన పర్యవేక్షణ లేకపోవడం వంటి కారణాలతో వేలాది మొక్కలు మనుగడ కోల్పోతున్నాయి. దీంతో ప్రతి సంవత్సరం మొక్కలు నాటినా ఆశించిన స్థాయిలో పచ్చదనం పెరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ఒకరోజు కార్యక్రమం కాదు. మొక్కను నేలలో నాటడం ప్రారంభం మాత్రమే. అది చెట్టుగా ఎదిగి సమాజానికి నీడ, ఆక్సిజన్, పర్యావరణ సమతుల్యతను అందించే వరకు నిరంతర సంరక్షణ అవసరం. కానీ చాలా సందర్భాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు ఫోటోలు, ప్రచార కార్యక్రమాలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

మొక్కలు నాటిన తర్వాత వాటి మనుగడ శాతంపై సమీక్షలు జరగడం అరుదుగా కనిపిస్తోంది. మొక్కల సంరక్షణ బాధ్యత ఎవరిది అనే ప్రశ్నకు ఒకే వ్యక్తి లేదా ఒకే శాఖను బాధ్యులుగా పేర్కొనలేం. ప్రభుత్వం, అటవీ శాఖ, స్థానిక సంస్థలు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు అందరూ కలిసి బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఒక ప్రాంతంలో నాటిన ప్రతి మొక్కకు బాధ్యతను ఒక వ్యక్తికి లేదా సంస్థకు కేటాయిస్తే మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు తమ పరిధిలో నాటిన మొక్కలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. విద్యాసంస్థల్లో విద్యార్థులతో మొక్కలు నాటించడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యత కూడా అప్పగిస్తే పర్యావరణంపై బాధ్యత పెరుగుతుంది. అలాగే కాలనీలు, గ్రామాల్లో స్థానిక యువత, సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు మొక్కల సంరక్షణలో భాగస్వాములు కావాలి. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను దత్తత తీసుకుని సంరక్షిస్తే హరిత విప్లవం సాధ్యమవుతుంది. ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో రోడ్ల వెంట, ప్రభుత్వ కార్యాలయాల వద్ద, పాఠశాలలు, కళాశాలల ప్రాంగణాల్లో నాటిన మొక్కలు సంరక్షణ లేక ఎండిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. కోట్ల రూపాయల ప్రజాధనంతో చేపడుతున్న హరిత కార్యక్రమాలు ఆశించిన ఫలితాలు ఇవ్వాలంటే మొక్కల మనుగడపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. కేవలం ఎన్ని మొక్కలు నాటామనే గణాంకాల కంటే, వాటిలో ఎన్ని చెట్లుగా ఎదిగాయనే అంశమే అసలైన విజయ ప్రమాణంగా పరిగణించాలి. నిపుణుల అభిప్రాయం ప్రకారం మొక్కలు నాటిన తర్వాత కనీసం మూడు సంవత్సరాల పాటు వాటికి క్రమం తప్పకుండా నీరు అందించడం, రక్షణ కంచెలు ఏర్పాటు చేయడం, ఎండిపోతే వెంటనే కొత్త మొక్కలు నాటడం, నిరంతర పర్యవేక్షణ చేపట్టడం అవసరం. మొక్కల సంరక్షణపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తేనే హరిత కార్యక్రమాలు ఫలిస్తాయి. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత. మొక్కలు నాటడం ఒక మంచి ప్రారంభం మాత్రమే. అయితే వాటిని చెట్లుగా పెంచి భవిష్యత్ తరాలకు పచ్చని ప్రకృతిని అందించాలంటే సంరక్షణకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. నాటిన ప్రతి మొక్క బతికి చెట్టుగా ఎదిగినప్పుడే హరిత కార్యక్రమాల అసలైన లక్ష్యం నెరవేరినట్లవుతుంది. లేకపోతే ప్రతి సంవత్సరం లక్షల మొక్కలు నాటుతున్నామనే ప్రకటనలు కేవలం గణాంకాలకే పరిమితమైపోయే ప్రమాదం ఉంది.

# గ్రామాలకు చైతన్య దీపం - శ్యామల్ ఫౌండేషన్ జన చైతన్య కళాజాత ప్రారంభం

- డి.డబ్ల్యూ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ
- జూన్ 12 నుండి ములుగు జిల్లా వ్యాప్తంగా కళారూపాల ద్వారా అవగాహన.



ములుగు, జూన్ 08; గ్రామీణ ప్రజల్లో సామాజిక చైతన్యం పెంచే లక్ష్యంతో శ్యామల్ ఫౌండేషన్ చేపట్టిన జన చైతన్య కళాజాత కార్యక్రమానికి సోమవారం ఘనంగా శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమ పోస్టర్‌ను డి.డబ్ల్యూ. ప్రేమలత ఆవిష్కరించి, చైతన్య యాత్రకు అధికారికంగా ప్రారంభోత్సవం చేశారు. డి.డబ్ల్యూ. ప్రేమలత మాట్లాడుతూ ఐసిడిఎస్ పథకాల పరిరక్షణ, అంగన్వాడీ కేంద్రాల బలోపేతం, తల్లిదండ్రులకు రక్షణ, పర్యావరణ పరిరక్షణ, ఓటు హక్కు చైతన్య యాత్ర, గ్రామాల్లోని వివిధ సమస్యలపై అవగాహన కల్పించడం ఈ కళాజాత ప్రధాన లక్ష్యమన్నారు. ములుగు జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు , ప్రజలు, ప్రజాప్రతినిధులు అందరూ ఈ ప్రోగ్రాకు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చివరి వ్యక్తికి చేరేలా ఇలాంటి చైతన్య కార్యక్రమాలు తోడ్పడతాయని అభిప్రాయపడ్డారు. భవిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్యామల్ నాయక్ మాట్లాడుతూ... ఈ చైతన్య యాత్ర జూన్ 12 నుండి ములుగు జిల్లా వ్యాప్తంగా ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రభుత్వ పథకాల ద్వారా రైతుల సమస్యలు పరిష్కారం, నిరుద్యోగ యువతకు అవకాశాలపై అవగాహన, చిన్నపిల్లల ఆరోగ్య పరిరక్షణ, నిరక్షరాస్యత నిర్మూలన, బాల్య వివాహాల నిర్మూలన వంటి అత్యంత కీలకమైన అంశాలను జానపద కళారూపాల ద్వారా ప్రజలకు చేరువ చేస్తామన్నారు. ఈ కార్యక్రమాలు ప్రతి గ్రామపంచాయతీలో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించబడతాయని, గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సమాజంలో మార్పు రావాలంటే చదువు, ఆరోగ్యం, పర్యావరణంపై అవగాహన తప్పనిసరి అని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, యువత ఈ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని స్వచ్ఛ గ్రామాలుగా తమ ఊళ్లను తీర్చిద్దాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాల సమాచారం చేరేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. కళ ద్వారా వచ్చే మార్పు శాశ్వతంగా ఉంటుందని, అందుకే జానపద కళలను ఎంచుకున్నామని వివరించారు. ఈ కార్యక్రమానికి భవిత ఫౌండేషన్ చైర్మన్ ఆర్థిక సహకారం అందించారు. కళాకారులు బోదానంద వనమాల, పోలేపాక యాకయ్య, స్వరూప రాణి, దూదేపాక రాజేందర్, బాలాజీ నాయక్ బబ్లు తదితరులు పాల్గొని కళాప్రదర్శనలపై తమ అభిప్రాయాలు పంచుకున్నారు..

# ప్రభుత్వ పథకాల ప్రయోజనం ప్రతి ఇంటికీ చేరాలి

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
- ఘనంగా స్వాగతం పలికిన నేతలు పెబ్బేరులో కొనసాగిన ఎంపీ
- మల్లు రవి రథయాత్ర



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 8 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రతి ఇంటికి చేరేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నా బలమైన సంకల్పంతో నాగర్కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి చేపట్టిన రథయాత్ర సోమవారం వనపర్తి జిల్లాలోకి జిల్లాలోకి ప్రవేశించడం జరిగింది. ఈ సందర్భంగా వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, జిల్లా అధ్యక్షులు శివసేనరెడ్డి పెబ్బేరు పట్టణంలో బస్సు యాత్రకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు బస్సులో ప్రయాణం చేస్తూ పెబ్బేరు పట్టణంలోని వీధుల గుండా పర్యటించారు. అనంతరం సుభాష్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల అభ్యున్నతికి ఎంతగానో తోడుపాటునందిస్తుందని ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టి అండగా నిలబడుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వడ్డీ లేని రుణాలు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు చైర్మన్లుగా పాటు పాఠశాలల్లో విద్యార్థులకు వంట ఏజెన్సీలుగా మహిళలే ఉండటం స్కూల్ విద్యార్థులకు మహిళలే స్కూల్ డ్రెస్లను కుట్టించి ఇవ్వడం ఆర్టీసీ బస్సులకు ఓనర్లను చేయడం మహిళా భాగస్వామ్యంతో సోలార్ ప్లాంట్ లో ఏర్పాటు మహిళలకు డీజిల్ బంకుల ఏర్పాట్లు రైతు రుణమాఫీ రైతు భరోసా భూమిలేని నిరుపేదలకు రైతు ఆత్మీయ భరోసా సన్న వడ్లకు బోనస్ అన్నదాతలకు రాయితీపై వ్యవసాయ ఉపకరణానికి సంబంధించిన అన్ని పనుముట్ల పంపిణీ తమ సొంత ఇంటి కల నెరవేరక ఇబ్బందులు ఎదుర్కొనే ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు రేషన్ కార్డుల పంపిణీ ఉచిత సన్న బియ్యం పంపిణీ విద్యార్థులకు మెస్ చార్జీల పెంపు ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటు కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు ఫిష్ ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు పెబ్బేరుల 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు వనపర్తి పెబ్బేరు మున్సిపాలిటీలలో ప్రతి వార్డులో సిసి రోడ్ల నిర్మాణం లాంటి అనేక పథకాలను చేపట్టి నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇట్టి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మన నాగర్కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి గారు చేపట్టిన రథయాత్ర కార్యక్రమం జోగులాంబ గద్వాల జిల్లాలలో ముగించుకుని నేడు వనపర్తికి రావడం ఆనందదాయకమని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాగర్కర్నూల్ పార్లమెంట్ ఇంచార్జ్ మధుసూదన్ రెడ్డి, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, మండలాధ్యక్షులు యాపర్ల రామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సాయిచరణ్ రెడ్డి, జిల్లా డిసిసిబి అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, బోయల రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, పెబ్బేరు మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజేష్, గోపాల్పేట మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు సత్యశీల రెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు యుగంధర్ రెడ్డి, మణిగిల్ల తిరుపతిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల డిగ్రీ కళాశాలలో ఉచిత ప్రవేశాలు

## పరీక్ష లేకుండానే డైరెక్ట్ అడ్మిషన్లు.. నేడే సంప్రదించండి!




వనపర్తి జిల్లా ప్రతినిధి జూన్ 8 (విజన్ ఆంధ్ర) : డిగ్రీ చదవాలనుకునే విద్యార్థులకు ఇదొక సువర్ణావకాశం. మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల (బాలురకు) 2026-27 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ కోర్సుల్లో ఉచిత ప్రవేశాలను ప్రారంభించింది. పాలమూరు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా పనిచేస్తున్న ఈ కళాశాల.. ఉమ్మడి మహబూబ్ నగర్ లోని దేవరకద్ర మండలం చౌదర్‌పల్లి గ్రామంలోని ఎస్‌వీఐటీఎస్ (SVITS) ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో కొనసాగుతోంది. ఈ కళాశాలలో పూర్తిగా ఇంగ్లీష్ మీడియంలో బోధన సాగుతుంది. ప్రవేశ పరీక్ష లేకుండానే, నేరుగా ప్రత్యక్ష ప్రవేశాలు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అయితే, ప్రతి కోర్సులో కేవలం 40 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అందుబాటులో ఉన్న కోర్సులు, గ్రూపులు: బీఏ (B.A): ఎజ్యూ, ఎజుూ, జ్యూఎ బీకాం (దీ.జశీఎ): కంప్యూటర్ అప్లికేషన్స్ (జూా) బీఎస్సీ (B.Sc): BZC, BBtC, MPC, MPCs, MSCs, MSDs విద్యార్థులకు లభించే ప్రత్యేక సదుపాయాలు: కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధనతో పాటు డిజిటల్ తరగతి గదులు, ఆధునిక గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్ వసతులు ఉన్నాయి. వీటితో పాటు ఎన్‌సీసీ (NCC), ఎన్ఎస్ఎస్ (NSS), స్కౌట్స్ అండ్ గైడ్స్, క్రీడా సౌకర్యాలు, జిమ్నాసియం వంటివి అందుబాటులో ఉన్నాయి. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పీజీ ప్రవేశ పరీక్షల కోచింగ్, జాతీయ స్థాయి సెమినార్లు, సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు. ఉచితంగా అందజేసే ప్రయోజనాలు: చేరిన విద్యార్థులకు పూర్తిగా ఉచిత విద్యతో పాటు, ఉచిత భోజన-వసతి (Hostel) సౌకర్యం కల్పిస్తారు. అలాగే 3 జతల యూనిఫారాలు, 24 గంటల వైద్య సదుపాయం అందిస్తారు. వీటితో పాటు నెలకు రూ. 200 పాకెట్ మనీ, సంవత్సరానికి సుమారు రూ. 2,100 కాస్మెటిక్ చార్జీలను కూడా ప్రభుత్వమే భరిస్తుంది. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ఆసక్తి గల విద్యార్థులు, తల్లిదండ్రులు మరిన్ని వివరాల కోసం మరియు ప్రవేశాల కోసం క్రింది నంబర్లలో సంప్రదించాలని రీజినల్ కో-ఆర్డినేటర్ వి. శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో సూచించారు. దేవరకద్ర: 9014040834 నాగర్‌కర్నూల్: 8977331008 నారాయణపేట: 9553288934

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

- మాజీ మంత్రికి ఘన స్వాగతం పలికిన రిజిస్ట్రార్ చంద్రశేఖర్ రెడ్డి
- సింగిరెడ్డిని సన్మానించిన డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 8 విజన్ ఆంధ్ర) : మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సోమవారం వ్యక్తిగత పని నిమిత్తం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ చంద్రశేఖర్ రెడ్డి ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం కార్యాలయ పనితీరును, ప్రజలకు అందుతున్న సేవలను మాజీ మంత్రికి వివరించారు. కార్యాలయంలో ఇంకా కొన్ని మౌలిక వసతులు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఘన సన్మానం.. ఆప్యాయ పలకరింపులు కార్యాలయానికి వచ్చిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డిని డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం నిరంజన్ రెడ్డి కార్యాలయ ప్రాంగణంలో ఉన్న రైటర్స్, ఇతర వ్యాపారస్తులను ఆప్యాయంగా పలకరించారు. అక్కడ వారికి అందుతున్న వసతులు, ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో ఆదర్శవంతమైన కార్యాలయం ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని హంగులతో, అధునాతన సదుపాయాలతో రాష్ట్ర స్థాయిలోనే ఆదర్శవంతమైన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వెంట ఆయన కుమార్తె తేజస్విని, ముఖ్య నాయకులు వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, సయ్యద్ జహంగీర్, భాగ్యరాజ్, అరుణ్ యాదవ్, ఇమ్రాన్, ముని కుమార్, అలీమ్ తదితరులు ఉన్నారు.

# ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ప్రతి ఒక్కరికీ న్యాయం

- వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి
- ప్రజల్లో పోలీసుశాఖపై మరింత విశ్వాసం పెంచేలా స్పందన



వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 8 (విజన్ ఆంధ్ర) : ప్రజల సమస్యల పరిష్కారమే పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని, ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన 9 ఫిర్యాదుదారుల నుండి ఎస్పీ నేరుగా వినతులు స్వీకరించారు. బాధితులు వివరించిన సమస్యలను ఓర్పుతో విన్న ఆమె, ప్రతి ఫిర్యాదును స్వయంగా పరిశీలిస్తూ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సానుభూతితో సమస్యల పరిష్కారం ఫిర్యాదు చేసిన ప్రజలకు వేగంగా న్యాయం అందేలా చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసం మరింత పెరగాలని ఎస్పీ సూచించారు. బాధితుల సమస్యలను సానుభూతితో పరిశీలిస్తూ, చట్టపరమైన రీతిలో త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఫిర్యాదులను స్వయంగా స్వీకరించి వెంటనే స్పందించిన జిల్లా ఎస్పీ తీరు పట్ల ఫిర్యాదుదారులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, తమ సమస్యలకు త్వరలోనే న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు.

# ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన కలెక్టర్



నిజామాబాద్, జూన్ 08 :( విజన్ ఆంధ్ర) జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తో కలిసి పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్ ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్ లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఇతర సామాగ్రికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పనులను పక్కాగా జరిపించాలని అన్నారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్, సిబ్బంది సాత్విక్, విజయేందర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

# ప్రజావాణికి 146 ఫిర్యాదులు



నిజామాబాద్, జూన్ 08 : (విజన్ ఆంధ్ర )ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 146 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, భుజంగరావు, డీఆర్ఓ గీత, జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఏసీపీ ప్రకాశ్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**



నిర్మల్ జిల్లా,జూన్ 08,(విజన్ ఆంధ్ర) : ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ములుగు మున్సిపాలిటీలో కౌన్సిలర్ కు ప్రోటోకాల్ ఇవ్వడం లేదు శంకుస్థాపన బోర్డుపై పేరు లేదు

**- 18వ వార్డు కౌన్సిలర్ అనూష సాగర్. ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు**



ములుగు జూన్ 06;విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు మున్సిపాలిటీ 18వ వార్డు పరిధిలో జరుగుతున్న సెంటర్ లైటింగ్ రోడ్ వరకు అభివృద్ధి పనుల విషయంలో స్థానిక కౌన్సిలర్లకు ప్రోటోకాల్ పాటించడం లేదని కౌన్సిలర్ బైకని అనూషసాగర్ ఆరోపించారు. వార్డు అభివృద్ధి పనులకు సంబంధించిన శంకుస్థాపన బోర్డులపై తమ పేర్లను ఉంచడం లేదని, మున్సిపల్ అధికారులు తమను సంప్రదించడం లేదని వారు వాపోయారు. 18వ వార్డులో అంగడి మైదానం అభివృద్ధి పనులు, మెయిన్ రోడ్డు నుండి గొల్లవాడ రోడ్డు అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ పనులకు సంబంధించిన శంకుస్థాపన బోర్డులపై స్థానిక కౌన్సిలర్ గా తమ పేరు లేదని కౌన్సిలర్లు గుర్తించారు. ప్రజా ప్రతినిధులుగా తమకు తగిన గౌరవం ఇవ్వడం లేదని, కౌన్సిలర్ ప్రోటోకాల్‌ను అధికారులు విస్మరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కౌన్సిలర్లు బైకని అనూషసాగర్ జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వార్డు పరిధిలో జరిగే ఏ అభివృద్ధి పని అయినా స్థానిక కౌన్సిలర్‌కు తెలియజేయకుండా, వారిని సంప్రదించకుండా ముందుకు తీసుకెళ్లడం సరికాదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కౌన్సిలర్ల వినతిని పూర్తిగా విన్న కలెక్టర్ ఈ విషయంపై సానుకూలంగా స్పందించారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు తగిన గౌరవం, ప్రోటోకాల్ పాటించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని కౌన్సిలర్లకు భరోసా ఇచ్చారు. "వార్డు అభివృద్ధి అంటే కౌన్సిలర్‌ను కలుపుకొని పోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కానీ మా వార్డులో జరుగుతున్న పనుల విషయంలో మమ్మల్ని పట్టించుకోవడం లేదు. శంకుస్థాపన బోర్డులపై పేర్లు లేకుండా చేయడం మా గౌరవానికి భంగం" అని కౌన్సిలర్లు బైకని అనూష సాగర్ అన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించడంతో కౌన్సిలర్ సంతోషం వ్యక్తం చేశారు. ఇకపై వార్డు అభివృద్ధి పనుల విషయంలో ప్రోటోకాల్ పాటిస్తారని, తమకు సమాచారం అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# 64 ప్రజా సమస్యలపై కలెక్టర్ దృష్టి.

**- ప్రజావాణిలో అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు.**

**- ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లకు అధిక ప్రాధాన్యత.**



ములుగు జూన్ 08, విజన్ ఆంధ్ర ప్రతినిధి : కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి లికలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావులి హాజరై అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 64 దరఖాస్తులు అందాయి. వాటిలో ఇందిరమ్మ ఇండ్లకు 20 దరఖాస్తులు, పెన్షన్లకు 17 దరఖాస్తులు, మిగిలిన 27 దరఖాస్తులు వివిధ శాఖలకు సంబంధించినవి ఉన్నాయి. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే సంబంధిత శాఖల అధికారులకు పంపించామన్నారు. అర్జీల పరిష్కారంలో జాప్యం చేయవద్దని, ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. పేదల కష్టాలు తీర్చడమే తమ ప్రధాన లక్ష్యమని, నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించి అర్జీదారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ, ఎం. సంపత్ రావు, డీఆర్ఓ రవి కుమార్, ఆర్డీఓ కృష్ణవేణి, అన్ని శాఖల జిల్లా అధికారులు, మండలాల ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# సమన్వయంతోనే స్వచ్ఛ రామగుండం సాకారం!!

## ప్రజా పాలన వార్డు సభలో ప్రజా ప్రతినిధులు, అధికారుల పిలుపు



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 8 (విజన్ ఆంధ్ర) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులందరికీ చేరేలా కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో కదలాలని రామగుండం నగర డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య పిలుపునిచ్చారు. సోమవారం ఎన్టీపీసీ పీటీఎస్ కాకతీయ కల్యాణ మండపంలో 15 డివిజన్ల క్లస్టర్ స్థాయి 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' వార్డు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ, ఎమ్మెల్యే, మేయర్లతో కలిసి ప్రజా ప్రతినిధులు నిత్యం వార్డుల్లో పర్యటిస్తూ నగర రూపురేఖలు మారుస్తున్నారని, వర్షాకాల విపత్తులను ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఇదే సమయంలో, యువత సెల్‌ఫోన్ వ్యసనాల బారిన పడకుండా తల్లిదండ్రులు పోలీసుల సూచనల మేరకు పిల్లలపై నిఘా ఉంచాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ జె. అరుణశ్రీ మాట్లాడుతూ, వర్షాకాల కార్యాచరణలో భాగంగా కాలువల పూడికతీత, రోడ్ల మరమ్మతులు, పైప్‌లైన్ లీకేజీల అదుపు, వీధిదీపాల పునరుద్ధరణ వంటి చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమల నివారణకు పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటూ, 2016 నిబంధనల ప్రకారం చెత్తను నాలుగు రకాలుగా (తడి, పొడి, శానిటరీ, ఈ-వేస్ట్) వేరు చేసి మున్సిపాలిటీకి అందించాలని విజ్ఞప్తి చేశారు. జూన్ 15 లోగా ఓటరు జాబితా మ్యాపింగ్ పూర్తి చేయాలని, భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు నిర్మించాలని, వనమహోత్సవం కోసం స్థలాల గుర్తింపు జరుగుతోందని ఆమె వివరించారు. ఈ సభలో ఏసీపీ మడత రమేష్ ట్రాఫిక్ నిబంధనలపై, ఎంఆర్వో రవీందర్ ఓటరు సర్వేపై, వైద్యాధికారి అతుల్య అంటువ్యాధుల అరికట్టడంపై, ఐసీడీఎస్ సీడీపీవో ఆలేఖ్య అంగన్‌వాడీ సేవలపై అవగాహన కల్పించగా, డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి సహా పలువురు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

# సఖి కేంద్రంలో విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

**- సఖి కేంద్రంను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల జూన్ 08 (విజన్ ఆంధ్ర బ్యూరో) : సఖి కేంద్రంలో పనిచేసే సిబ్బంది సమర్థవంతంగా తమ విధులను నిర్వర్తించాలని, నిబద్ధతతో పనిచేయకుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం గద్వాలలోని సఖి కేంద్రంను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐటీ, స్టోర్, సర్వైవర్, కిచెన్, తదితర విభాగాలను తిరిగి పరిశీలించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ తో పాటు ఇతర రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రంలో పెద్ద సంఖ్యలో సిబ్బంది పనిచేస్తున్నప్పటికీ ఇటీవల సంరక్షించబడ్డ ఓ మహిళ అదృశ్యం కావడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ పనిచేయకపోతే లాభమేమిటని ప్రశ్నించారు. గత రెండేళ్లలో కేంద్రంకు వచ్చిన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హింసకు గురై, ఇతర సమస్యలతో బాధపడుతున్న మహిళలు, బాల్యవివాహాలు, బాల కార్మికులు, ఇతరాత్ర సమస్యలతో వేదనకు గురైన బాలికలను సంరక్షించేందుకు, కౌన్సిలింగ్ నిర్వహించేందుకు ఉద్దేశించిన సఖి కేంద్రంలో ఎంతో బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని మండిపడ్డారు. పోలీసు శాఖ నుంచి రిఫర్ చేసిన కేసులే ఇక్కడికి ఎక్కువగా వస్తున్నాయని, సఖి తరపున సంరక్షించబడుతున్న కేసులు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. సఖి కేంద్రం అందిస్తున్న సేవలపై నిర్వహించే అవగాహన కార్యక్రమాలకు చాలా తక్కువ మంది హాజరయ్యారని, పెద్ద ఎత్తున, ఎక్కువ మందికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రెండు నెలల్లో సఖి సిబ్బంది తమ పనితీరును మెరుగుపరుచుకోకుంటే నిర్లక్ష్యంగా ఉండే వారిని ఉద్యోగంలో నుంచి తొలగించి, అర్హులైన ఇతరులను తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం సఖి కేంద్రం పరిసరాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అక్కడ పొదలు, ఇతర వ్యర్థాలు ఉండడాన్ని గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత మహిళలకు రక్షణ, ఆశ్రయం కల్పించేందుకు ఉద్దేశించిన సఖి కేంద్రాన్ని చిత్తశుద్ధితో నిర్వహించాలని, అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.

# ఎస్ఐఆర్ పై ఓటర్లకు అవగాహన అవసరం

**- ప్రజలు పారిశుద్ధ్యంకు ప్రాధాన్యత ఇవ్వాలి**

**- గ్రామసభలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



అలంపూర్ జూన్ 08 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఓటరు జాబితాలో తప్పిదాలు లేకుండా, పారదర్శకంగా రూపొందించేందుకు ఉద్దేశించిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై ప్రతి ఓటరుకు అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న గ్రామ, వార్డ్ సభల్లో సోమవారం మానవపాడు మండలం బోరవెల్లి గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియపై ప్రధానంగా గ్రామసభల్లో తెలియజేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం స్పెషల్ డ్రైవ్ తో ఓటరు జాబితాను తప్పులు లేకుండా రూపొందించడం జరుగుతుందన్నారు. రైతులు నానో యూరియా పై దృష్టి సారించాలని, సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను పొందవచ్చన్నారు. ఈ ఏడాది వర్షపాతం తగ్గే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ అధికారుల అంచనాల మేరకు రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల ప్రకారం పంటలు సాగు చేయాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రీ తో అర్హులైన రైతులందరికీ వ్యవసాయ సంబంధ సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. బిపి, షుగర్, తదితర వ్యాధులు ఉన్న గ్రామస్తులు ప్రభుత్వ వైద్యశాలలు అందించే చికిత్సను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలు పారిశుద్యానికి ప్రాధాన్యత నివ్వాలని, గృహ సంబంధ, ఇతర వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్తకుండీలను వినియోగించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు గ్రామంలో పిచ్చికుక్కల బెడదను నిర్మూలించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పలువురు గ్రామస్తులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న కూరగాయల విత్తనాల కిట్లను పంపిణీ చేశారు. అంతకుముందు స్వచ్ఛ గ్రామ పంచాయతీ, స్వచ్ఛ తెలంగాణ ఆవశ్యకతపై చిత్రీకరించిన వీడియోను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, గ్రామ సర్పంచ్ హరిశ్చంద్రా రెడ్డి, ఉప సర్పంచ్ సీతారాముడు తహసిల్దార్ మన్సూర్ అలీ సిద్ధికి, ఎంపీడీవో రాఘవ, ఎస్సై తరుణ్ కుమార్ రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి సందీప్, ఏఈఓ నరసింహ, పంచాయతీ కార్యదర్శి అరుణ, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల అవసరాలకు సరిపడా ఎరువుల నిల్వలు

**- అందుబాటులో 27,203 మెట్రిక్ టన్నుల యూరియా**

**- రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దు**

**- యాప్ ద్వారా ప్రణాళికాబద్ధంగా, పారదర్శకంగా యూరియా పంపిణీ**

**- కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి**



నిజామాబాద్, జూన్ 08 :(విజన్ ఆంధ్ర )జిల్లాలో ఖరీఫ్ సీజన్ పంటల సాగు కోసం రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఎరువుల విషయంలో ఎవరు కూడా ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని కలెక్టర్ ఇలా త్రిపాఠి భరోసా కల్పించారు. జిల్లాలో ఎక్కడ కూడా యూరియా కొరత లేదని, రాష్ట్రంలోని ఇతర అన్ని జిల్లాల కంటే నిజామాబాద్ జిల్లాలోనే అత్యధిక స్థాయిలో 27,203 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రాంతాలలో రైతులకు ఎరువులు పంపిణీ జరిగేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని, పంట సాగు చేసే ప్రతి రైతుకు ఎరువులు అందేలా చూస్తామని అన్నారు. ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా, ఎరువులు పక్కదారి పట్టకుండా పారదర్శకమైన పంపిణీ కోసం యూరియా బుకింగ్ యాప్ దోహదపడుతోందని అన్నారు. ఈ యాప్ పనితీరును గమనించిన ఇతర రాష్ట్రాలు కూడా ఒక్క యూరియానే కాకుండా మిగతా అన్ని ఎరువులను కూడా బుకింగ్ యాప్ ద్వారానే రైతులకు అందిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ యాప్ ద్వారా ఆయా మండలాల్లో ఏ డీలర్ వద్ద యూరియా అందుబాటులో ఉంది అనే సమచారం తెలుసుకునే వెసులుబాటు ఉందని, రైతులు సమీప డీలర్ల వద్ద పంట సాగు విస్తీర్ణానికి అనుగుణంగా అవసరమైన యూరియాను బుక్ చేసుకోవచ్చని సూచించారు. అంతేకాకుండా ప్రతీ సొసైటీ వద్ద, ప్రతీ డీలర్ షాప్ లో ఎరువుల నిల్వల వివరాలను తెలియజేసేలా స్టాక్ బోర్డులు ప్రదర్శించేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. నకిలీ, నాసిరకం ఎరువులు, విత్తనాలకు ఆస్కారం లేకుండా మండల స్పెషల్ ఆఫీసర్లతో పాటు తహసిల్దార్లు, ఇతర అధికారులతో నిరంతరం తనిఖీలు జరిపిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. రైతులు ఒకేసారి ఎరువులను కొనుగోలు చేసి అట్టిపెట్టుకోకుండా, తమ అవసరాలకు అనుగుణంగా దశల వారీగా ఎరువులు తీసుకోవాలని, మోతాదుకు మించి వాడవద్దని హితవు పలికారు. ఎరువుల దుకాణాలు, వివిధ సంస్థల ద్వారా యూరియా, ఇతర ఎరువులు కొనే రైతులకు వారి అంగీకారం లేకుండా వేరే ఏ రకమైన ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ఒత్తిడి చేయకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని అన్నారు. యూరియా ఎరువులతో ముడిపెడుతూ ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేయాలని రైతులను బలవంతం చేస్తే డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు.

# జూన్ 28న జిల్లాలో పల్స్ పోలియో ...

**- కలెక్టర్ హేమంత్ సహదేవరావు...**

**- డిఎం అండ్ హెచ్ ఓ గోపాలరావు.**




ములుగు జూన్ 08, విజన్ ఆంధ్ర ప్రతినిధి : పల్స్ పోలియో, స్టాప్ డయేరియా, జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాలపై జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశం సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవరావ్‌లి అధ్యక్షతన వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలియో నిర్మూలనే లక్ష్యంగా జూన్ 28న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 0-5 ఏళ్ల వయసు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని, ముఖ్యంగా వలసదారులు ఉండే ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలైన హైరిస్క్ ఏరియాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. గోపాల్ రావుమాట్లాడుతూ ...... జిల్లాలో 22,572 మంది 0-5 ఏళ్ల పిల్లలు ఉన్నారని, వీరికి 312 పోలియో బూత్‌లు, మొబైల్ టీమ్‌లు, ట్రాన్సిట్ పాయింట్ల ద్వారా వ్యాక్సిన్ అందిస్తామని తెలిపారు. పంచాయతీరాజ్, విద్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల ప్రోగ్రాం ఆఫీసర్ డా. నాగలి మాట్లాడుతూ వర్షాకాలం డయేరియా నివారణకు జూన్ 15 నుండి జూలై 31 వరకు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆశా కార్యకర్తల ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్లు పంపిణీ చేస్తామన్నారు. జూలై 13, 20 తేదీల్లో 1-19 ఏళ్ల వారికి నులిపురుగు నివారణ మాత్రలు అందజేస్తామని వివరించారు. సమావేశంలో జిల్లా మాస్ మీడియా అధికారి సంపత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 14న ములుగులో ఖేలో ఇండియా బాలికల సైక్లింగ్ పోటీలు

**- సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు "బాదం ప్రవీణ్ ."**



ములుగు జూన్ 08, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లా కేంద్రంలో బాలికల క్రీడలకు ఊతం ఇచ్చేలా అస్మిత ఖేలో ఇండియా మహిళల బాలికల సిటీ సైక్లింగ్ పోటీలు ఈ నెల 14వ తేదీన వైభవంగా నిర్వహించనున్నట్లు లిములుగు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్‌లి ప్రకటించారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో పోటీల వివరాలు తెలిపారు. సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ అనే మూడు విభాగాల్లో పోటీలు జరుగుతాయని చెప్పారు. బాలికల్లో సైక్లింగ్ పట్ల ఆసక్తి పెంచడం, జాతీయ స్థాయి క్రీడాకారిణులను తయారు చేయడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని బాదం ప్రవీణ్ పేర్కొన్నారు. విజేతలకు మెడల్స్‌తో పాటు మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తామని, పోటీల్లో పాల్గొన్న ప్రతి బాలికకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇచ్చి ప్రోత్సహిస్తామని ఆయన తెలిపారు. ఇది బాలికల క్రీడా ప్రతిభను గుర్తించే వేదిక అవుతుందని అన్నారు. పోటీల్లో పాల్గొనే అభ్యర్థులు తప్పనిసరిగా తమ సొంత సైకిల్, ఆధార్ కార్డు జిరాక్స్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న బాలికలు ఈ నెల 12వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని " బాదం ప్రవీణ్ " కోరారు. పూర్తి వివరాలకు సంప్రదించాల్సిన నంబర్: కోచ్ శ్రీరామ్ - 8886817492.

# ఈవీఎంల భద్రతలో ఎలాంటి రాజీ లేదు

**- కలెక్టర్ హేమంత్ సహదేవరావు**

**- రాజకీయ పార్టీల సమక్షంలో గోదాం తనిఖీ.**

**- 24 గంటల పర్యవేక్షణ ఉంటుంది.**



ములుగు, జూన్ 08 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్ త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. గోదాం సీల్, సీసీ కెమెరాల పనితీరు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలను కలెక్టర్ పరిశీలించారు. పోలీసు బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పుస్తకాలను కూడా చెక్ చేశారు. కలెక్టర్ హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ... ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు ప్రతి నెల గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈవీఎంల భద్రత విషయంలో 24 గంటల పాటు భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, గోదాంలోని భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు జారీ చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎం.డి. సలీం, డిప్యూటీ తహసీల్దార్ నితీష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ మనోహర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పాత బిల్లులు విడుదల చేయాలని కలెక్టర్కు వినతి పత్రం అందజేత

**- జంపాల రవీందర్**



ములుగు జూన్ 08, విజన్ ఆంధ్ర ప్రతినిధి : జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు కు గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు. 2023-24 బిల్లులు 9 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని, పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు చెల్లించాలని కోరారు. డ్వాక్రా, అమ్మ ఆదర్శ కమిటీల పేరుతో వంట కార్మికులను తొలగించవద్దని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ స్పందిస్తూ.. కార్మికుల సేవలను గుర్తించి ఎవరిని తొలగించకుండా అధికారులకు సూచిస్తామని హామీ ఇచ్చారు.రూ.10 వేల వేతనం, నిత్యావసర సరుకులు ప్రభుత్వమే సరఫరా చేయాలని, అల్పాహారం కార్మికుల ద్వారానే నిర్వహించాలని జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం భారతి, పోరెడ్డి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.




# సింగరేణి బొగ్గు సెగ!!

## - యాజమాన్యం వివరణ
## - కేటీఆర్ స్కామ్ ఆరోపణలు

హైదరాబాద్, జూన్ 8 ( విజన్ ఆంధ్ర ) :

*సింగరేణి సంస్థను చుట్టుముట్టిన బొగ్గు నిల్వల వివాదం ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. యాజమాన్యం వెల్లడించిన లెక్కలు, వాటిపై ప్రతిపక్ష బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణల సంక్షిప్త కథనం*



దక్షిణాది విద్యుత్ రంగానికి వెన్నుముకైన సింగరేణిలో బొగ్గు నిల్వలు పడిపోవడంపై తీవ్ర రాజకీయ దుమారం రేగుతోంది. ఒకవైపు రికార్డు స్థాయిలో నిల్వలు తగ్గాయని యాజమాన్యం చెబుతుంటే, ఇది రూ. 1,600 కోట్ల భారీ కుంభకోణమని ప్రతిపక్షం బీఆర్ఎస్ ఆరోపిస్తోంది.

**యాజమాన్యం వాయిస్: "పదేళ్లలో అత్యల్ప నిల్వలు"**

సింగరేణి అధికారిక ప్రకటన ప్రకారం జూన్ 4 నాటికి గనుల వద్ద కేవలం 26.51 లక్షల టన్నుల బొగ్గు మాత్రమే ఉంది.

**సగానికి పడిపోయిన స్టాక్:**

గత పదేళ్లలో (2014-24) సగటున 50 లక్షల టన్నుల నిల్వలు ఉండేవి. వర్షాకాలంలో థర్మల్ కేంద్రాలకు నిరాటంకంగా సరఫరా చేయడానికి కనీసం 30 లక్షల టన్నులు ఉండాలి. ప్రస్తుతం నిల్వలు తగ్గడంతో రవాణాను క్రమబద్ధీకరిస్తున్నట్లు సంస్థ తెలిపింది.

**టెండర్ల నిబంధనలపై స్పష్టత:**

ఓబీ పనుల మధ్యలో కాంట్రాక్టర్లు వదిలేయకుండా ఉండటానికే మే 2025 నుండి 'సైట్ విజిట్ సర్టిఫికేట్' తెచ్చామని, దీనివల్ల ఇప్పుడు పనులు సజావుగా సాగుతున్నాయని స్పష్టం చేసింది.

**అక్రమాలపై విచారణ:** మెడికల్ బోర్డు దళారులపై యాజమాన్యమే స్వయంగా ఏసీబీకి ఫిర్యాదు చేసిందని, ఇద్దరు ఉద్యోగులను అరెస్ట్ కూడా చేశారని విజిలెన్స్ విభాగం తెలిపింది.

**కేటీఆర్ వాయిస్:**

**40 లక్షల టన్నుల బొగ్గు మాయం**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి రాసిన ఘాటైన లేఖలో ఇది పెద్ద కుంభకోణమని ఆరోపించారు.

**రికార్డుల్లో ఉంది.. క్షేత్రస్థాయిలో లేదు:** వెబ్‌సైట్ రికార్డుల్లో రామగుండం (10 లక్షల టన్నులు), శ్రీరాంపూర్ (8 లక్షలు), మందమర్రి (7.20 లక్షలు) సహా మొత్తం ఏడు గనుల వద్ద బొగ్గు ఉన్నట్లు చూపిస్తున్నా, క్షేత్రస్థాయిలో బొగ్గు మాయమైందని విమర్శించారు.

**వరుస అక్రమాల చిట్టా:** నచ్చిన వారికి నైని కోల్ బ్లాక్ టెండర్లు కట్టబెట్టేందుకే 'సైట్ విజిట్' నిబంధన తెచ్చారని, సోలార్ టెండర్లు అధిక ధరలకు ఇచ్చారని మండిపడ్డారు. ఐఓసీఎల్ నుండి నేరుగా డీజిల్ కొనడం ఆపేసి, 30% ఎక్కువ ధరతో పేలుడు పదార్థాలు కొంటున్నారని, ఫుట్‌బాల్ మ్యాచ్ కోసం రూ. 110 కోట్ల సింగరేణి నిధులు వృథా చేశారని ఆరోపించారు.

**డిమాండ్:**

ఈ రూ. 1,600 కోట్ల స్కామ్‌పై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, వాస్తవాలు తేల్చేందుకు గనుల వద్దకు అఖిల పక్షాన్ని పంపాలని డిమాండ్ చేశారు. ఈ బొగ్గు నిల్వల క్షీణత వెనుక నిజంగానే యాజమాన్యం చెబుతున్న సాంకేతిక కారణాలు ఉన్నాయా? లేక ప్రతిపక్షం ఆరోపిస్తున్నట్లు భారీ అవినీతి జరిగిందా? కేంద్ర ప్రభుత్వం దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటుంది? అనే ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే!!

**- గడ్డం సంతోష్ రాజ్**
స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)

# 'ఈగో'ల ఎక్స్‌ప్రెస్ ఆపుదాం...!!

- 'ఎమోషన్'ల లోకల్ ట్రైన్‌ను ఎక్కుదాం
- సక్సెస్‌లో ఈగో కాదు... హ్యూమిలిటీ ముఖ్యం
- హై పొజిషన్‌లో రూట్స్ మర్చిపోకు
- ఫెయిల్యూర్‌లో డిప్రెషన్ కాదు... కమ్‌బ్యాక్
- జెలసీ కాదు... సెల్ఫ్ బిలీఫ్

## ఏ పరిస్థితిలోనైనా క్లాస్ & బ్యాలెన్స్




హైదరాబాద్, జూన్ 8 :

*లైఫ్ అనేది ఒక ఇన్‌స్టాగ్రామ్ రీల్ కాదు... కేవలం 15 సెకన్లలో ముగిసిపోవడానికి. ఇది ఒక నిరంతర ప్రయాణం. ఈ ప్రయాణంలో ఈరోజు మనం ఏ పొజిషన్‌లో ఉన్నామనేది కాదు, అసలు 'మనం ఎక్కడి నుంచి వచ్చాం?' అనేదే ముఖ్యం. కానీ ఈ ఆధునిక 'ఫాస్ట్ ఫార్వర్డ్' యుగంలో చాలామంది రూట్స్ (వేళ్లను) మరిచిపోతున్నారు. ఈ జనరేషన్‌కి ఒక చిన్న 'రియాలిటీ చెక్' ఇస్తూ, ఒక హార్ట్ టచింగ్ కాన్సెప్ట్. మీ కోసమే ఈ ప్రత్యేక కథనం...*

**ఆకాశంలో విహరించు... కానీ మట్టిని మరువకు!!**

కొంతమందికి చిన్న వయసులోనే సక్సెస్ రావచ్చు, ఐదు అంకెల జీతం లభించవచ్చు, లేదా సమాజంలో ఒక 'ఉన్నత స్థానం' దక్కవచ్చు. అంతమాత్రాన ఆకాశమే హద్దన్నట్లు, కాలర్ ఎగరేసి, 'ఉగ్రూతలు ఊగడం' కరెక్ట్ కాదు. నువ్వు ఈరోజు కార్పొరేట్ ఆఫీసులో ఏసీ రూమ్ లో కూర్చుని కీబోర్డ్ కొడుతున్నావంటే... దానికి కారణం నీ వెనుక ఉన్న 'మట్టి', నీ తల్లిదండ్రుల 'కష్టం' అనే విషయాన్ని మర్చిపోకూడదు.



**పాయింట్ టు బి నోటెడ్:**

నీ బ్రాండెడ్ షూస్ కింద ఉన్న నేల ఎప్పుడూ మారదు. ఆ నేలని నమ్ముకుని, నీకోసం రక్తాన్ని చెమటగా మార్చిన అమ్మానాన్నల విలువను ఐఫోన్ల స్క్రీన్ల వెనుక దాచేయకండి. కష్టం విలువ తెలిసినవాడు సక్సెస్ వస్తే 'నమ్రత'గా ఉంటాడు కానీ 'అహంకారం'తో ఊగిపోడు.

**కింద ఉన్నామని 'క్విట్' అవ్వకు... ద్వేషం పెంచుకోకు!!**

మరోవైపు, కొంతమంది తాము అనుకున్న పొజిషన్‌కు వెళ్లలేకపోయామని, 'అట్టడుగు స్థానంలో' ఉండిపోయామని సమాజం మీద, తోటివారి మీద ద్వేషాన్ని, అసూయను పెంచుకుంటున్నారు.

**వద్దబ్బా ఈ నెగెటివిటీ:**

ఎదుటివాడి ఎదుగుదలను చూసి కుళ్ళిపోవడం వల్ల నీ ఎనర్జీ వేస్ట్ అవుతుంది తప్ప నీ గ్రాఫ్ పెరగదు.

**రైట్ అప్రోచ్ :**

నువ్వు ఈరోజు కింద ఉన్నావంటే, రేపు పైకి లేవడానికి నీకు ఎక్కువ స్పేస్ ఉందని అర్థం. కసిని ద్వేషంగా మార్చకు... కష్టపడే 'ఆయుధం'గా మార్చుకో.

**మోడర్న్ లైఫ్ - ఓల్డ్ స్కూల్ వాల్యూస్**

సక్సెస్ వస్తే ఈగో కాదు... వినయం పెరగాలి. ఎంత ఎత్తుకు ఎదిగినా రూట్స్ మర్చిపోకూడదు. ఫెయిల్యూర్ వస్తే డిప్రెషన్ కాదు... కసి పెరగాలి. ఇతరులపై జెలసీ కాదు... సెల్ఫ్-బిలీఫ్ ఉండాలి. జీవితంలో ఏ స్థితిలో ఉన్నా మనసు స్థిరంగా ఉండాలి.

**ఎండ్ కార్డ్:**

డబ్బు, హోదా, పవర్... ఇవన్నీ ఈరోజు వస్తాయి, రేపు పోతాయి. లైఫ్‌లో 'గ్రాటిట్యూడ్' (కృతజ్ఞత) ముఖ్యం. నువ్వు ఎంత ఎదిగినా అమ్మ పెట్టే గోరుముద్ద ముందు, నాన్న పడిన శ్రమ ముందు నువ్వు చిన్నపిల్లాడివే. ఉన్నత స్థానంలో ఉన్నప్పుడు ఒదగడం... అట్టడుగు స్థానంలో ఉన్నప్పుడు ఎదగడం... ఈ రెండే మనిషిని 'మహాత్ముడు' చేస్తాయి. సో బాస్, ఈగోలు పక్కన పెట్టి, మన కన్నవారిని, మన మట్టిని ప్రేమిద్దాం!!

**- గడ్డం సంతోష్ రాజ్**
స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)

# యోగాంధ్రతో ఆరోగ్య విప్లవం

- జిల్లా వ్యాప్తంగా మొదలైన యోగాంధ్ర పక్షోత్సవాల సందడి
- 10న ఫ్యామిలీ యోగా, 16న ప్రత్యేక యోగా శిక్షణలు
- జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి కడప సిద్ధం
- ప్రతి ఇంటికీ యోగా ప్రతి కుటుంబానికీ ఆరోగ్యం లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ
- జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు ప్రత్యేక కమిటీలు


కడప,జూన్ 8 (విజన్ ఆంధ్ర) శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యానికి యోగా అద్భుతమైన మార్గమని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'యోగాంధ్ర క్యాంపెయిన్-2026' కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా "యోగా" ఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని, నేటి వేగవంతమైన జీవనశైలిలో ఒత్తిడి, ఆందోళన, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలకు "యోగా" ఒక దివ్య ఔషధంగా సమర్థవంతమైన పరిష్కారాన్నిస్తుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ప్రతి పౌరుడు యోగాభ్యాసంలో భాగస్వామ్యం కావాలనే ఉద్దేశ్యంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు. జిల్లాలో నాలుగు ప్రధాన కార్యక్రమాలతో యోగాంధ్ర క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 7 ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయం వద్ద యోగా ప్రదర్శన ను నిర్వహించామని తెలిపారు. జూన్ 10- కడప రాజా రెడ్డి స్టేడియంలో "ఫ్యామిలీ యోగా" జూన్ 16 గండికోటలో ప్రత్యేక యోగా ప్రదర్శన జూన్ 21 రాజా రెడ్డి స్టేడియంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రధాన వేడుక. ఈ కార్యక్రమాల ద్వారా యోగా గొప్పతనాన్ని ప్రజలకు చేరవేయడంతో పాటు, ఆరోగ్యకర జీవన విధానాన్ని అలవాటు చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

**జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు ప్రత్యేక కమిటీలు**

జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాల సమర్ధ నిర్వహణ కోసం. జిల్లా, మండల, గ్రామ/వార్డు స్థాయిల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన 26 మంది సభ్యులతో జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటైందన్నారు. పోలీసు, విద్య, వైద్య ఆరోగ్య, క్రీడలు, పంచాయతీరాజ్, మహిళా సంక్షేమం, ఆర్టీసీ, ఎండోమెంట్స్, అటవీ శాఖల అధికారులు ఇందులో సభ్యులుగా ఉంటారు. కార్యక్రమాల నిర్వహణ, ప్రచారం, రవాణా, భద్రత, వైద్య సేవలు, తాగునీరు, ఫోటో-వీడియో కవరేజీ, పబ్లిసిటీ వంటి శాఖల అధికారులు యోగాంధ్ర జిల్లా కమిటీ సభ్యులు ఆయా శాఖలకు సంబంధించి కార్యక్రమాలను పర్యవేక్షించనున్నారన్నారు. యోగాతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని యోగ కేవలం వ్యాయామం మాత్రమే కాదని. శరీరం, మనస్సు, ఆత్మ మధ్య సమతుల్యతను నెలకొల్పే భారతీయ ఋషుల ఆరోగ్య జ్ఞానం నుండి ఉద్భవించిన అమూల్య సంపద అన్నారు. యోగా మన దిన చర్యలో భాగం అయితే కలిగే లాభాలను కూడా ఆయన తెలిపారు. శరీరానికి సౌష్టవం, బలం పెరుగుతుంది రోగనిరోధక శక్తి మెరుగు పడుతుంది ,మధుమేహం, రక్తపోటు, ఊబకాయం వంటి జీవనశైలి వ్యాధులను నియంత్రించడంలో తోడ్పడుతుంది,మానసిక ఒత్తిడి, ఆందోళన తగ్గుతుంది ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుంది ,నిద్రలేమి సమస్యలు తగ్గుతాయి గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది పిల్లలు, యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది వృద్ధులకు శారీరక చురుకుదనం, మానసిక ఉల్లాసం లభిస్తుంది

**యోగ పోటీలతో ప్రతిభకు ప్రోత్సాహం.**

యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా సోలో యోగా,ప్రాణాయామం, గ్రూప్ యోగా, యోగా క్విజ్, యోగా స్లోగన్, యోగా వ్యాసరచన వంటి పోటీలను జిల్లా యంత్రాంగం నిర్వహించనున్నారు. విద్యార్థులు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. IDY యాప్‌లో నమోదు చేసుకోండి యోగాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ IDY (International Day of Yoga) Appలో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గ్రామ, వార్డు స్థాయిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి




ప్రజలందరినీ యోగాభ్యాసం వైపు మళ్లించాలనికూడా జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.

**"యోగ జీవన విధానంగా మారాలి".**

యోగాను ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా ప్రతి కుటుంబం దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. యోగాంధ్ర క్యాంపెయిన్ ద్వారా జిల్లాలో లక్షలాది మందికి యోగా చేరువై, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి బాటలు పడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. "ప్రతి ఇంట్లో యోగా. ప్రతి మనిషికి ఆరోగ్యం" అనే లక్ష్యంతో యోగాంధ్ర క్యాంపెయిన్‌ను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజలకు పిలుపునిచ్చారు.

# విద్యాహక్కు చట్టాన్ని వెంటనే అమలు చేయాలి

**- శివ కుమార్**



కాప్రా / జూన్ 08(విజన్ ఆంధ్ర ప్రతినిధి ) : పాలకుల నిర్లక్ష్యం పేద ప్రజలకు శాపంగా మారింది విద్యా హక్కు చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని చత్రపతి సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షులు దొమ్మాటి శివకుమార్ అన్నారు ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టడం నిబంధనలు ఉల్లంఘించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారు ఇది విద్యా వ్యవస్థ పై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తోంది అదేవిధంగా విద్య హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలలో 25 శాతం సీట్లను ఆర్థికంగా వెనుకబడిన మరియు పేద కుటుంబాల విద్యార్థులకు ఉచితంగా కేటాయించాలి నాణ్యమైన విద్య అందించాలంటే ప్రభుత్వం విద్యారంగానికి మరింత నిధులు కేటాయించి అవసరమైన అన్ని వసతులు కల్పించాలి అనేక పాఠశాలలో సమస్యలు ఉన్నప్పటికీ సకాలంలో తనిఖీలు నిర్వహించడంలో అధికారులు విఫలమయ్యారు మధ్యతరగతి కుటుంబాలు ఈ ఫీజుల భారాన్ని భరించలేక అప్పులు చేయాల్సి వస్తోంది పిల్లల భవిష్యత్ కోసం తమ ఆర్థిక పరిస్థితిని పక్కనపెట్టి ప్రైవేటు పాఠశాలలో చేర్పిస్తున్నారు ఫీజులు భరించలేని విద్యార్థులను అవమానించడం పరీక్షలకు అనుమతించకపోవడం వంటి ఘటనలు కూడా చాలా చోట్ల వెలుగులోకి వచ్చాయి కొన్నిచోట్ల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు మరియు సంబంధిత విద్యాశాఖ అధికారుల మధ్య లోపాయి కారి ఒప్పందాలు ఉన్నాయని ఆరోపణలు ప్రజల నుంచి వస్తున్నాయి ప్రభుత్వ పాఠశాలలో సరైన తరగతి గదులు మరుగుదొడ్లు తాగునీటి సదుపాయం క్రీడా మైదానాలు లేకపోవడం దురదృష్టకరం ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి మౌలిక వసతులు కల్పించి విద్య హక్కు చట్టాన్ని అమలు చేయాలని వారు అన్నారు

# పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగారం

## - బాధితురాలికి 5 లక్షల రూపాయల పరిహారం

- నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోక్సో కేసులో కోర్టు తీర్పు
- నిందితుడు పస్పుల నందు దోషిగా నిర్ధారణ - 20 ఏళ్ల జైలు, 20 వేల రూపాయల జరిమానా
- ఆ బాధితురాలికి 5 లక్షల రూపాయల బాధిత పరిహారం చెల్లించాలని ఆదేశం
- కేసు దర్యాప్తు, విచారణలో కీలక పాత్ర పోషించిన బృందాన్ని ఎస్పీ అభినందన

జడ్చర్ల / నవాబ్ పేట, జూన్ 8,(విజన్ ఆంధ్ర): మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. మోతీఘన్‌పూర్ గ్రామం, బాలానగర్ మండలానికి చెందిన పస్పుల నందు 29 పై నమోదైన ఈ కేసు విచారణ పూర్తయింది. మహబూబ్‌నగర్‌లోని ప్రత్యేక పోక్సో అత్యాచార కేసుల విచారణ న్యాయస్థానం నిందితుడిని దోషిగా నిర్ధారించింది. ఈ కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, 20 వేల రూపాయల జరిమానా విధిస్తూ జడ్జి తమన్ రాజరాజేశ్వరి తీర్పు ఇచ్చారు. అలాగే బాధితురాలికి 5 లక్షల రూపాయల బాధిత పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి పటిష్టమైన సాక్ష్యాధారాలు సేకరించి న్యాయస్థానంలో నిరూపించడంలో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.జాన్,




మహబూబ్‌నగర్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గాంధీ నాయక్, ఎస్సై, కోర్టు లైజన్ అధికారులు బాలకృష్ణ ఏఎస్ఐ, కృష్ణయ్య పీసీ, శంకర్ పీసీ, సీడీఓ విజయ్ కుమార్ పీసీలు కీలక పాత్ర పోషించారు. వారిని జిల్లా ఎస్పీ డి.జానకి ఐపీఎస్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... మహిళలు చిన్నారులపై జరిగే నేరాల విషయంలో జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టంగా వ్యవహరిస్తుందని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేలా ప్రతి కేసును శాస్త్రీయ దర్యాప్తుతో ముందుకు తీసుకెళ్తామన్నారు. పోక్సో చట్టం కింద నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.